


మనసులో

# మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 202: ఆదివారం 22 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు32:- వెలరూ/ 9-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం



- యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత

4

## యూఎన్ఐ న్యూస్ ఏజెన్సీ ఆఫీసు సీజ్

- 50 మంది జర్నలిస్టుల గెంటివేత
- హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం

4





# ఆధ్యాత్మిక కేంద్రాలుగా టీటీడీ ఆలయాలు

### తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన చర్యలు

- కాలుష్య రహితంగా తిరుమల క్షేత్రం అభివృద్ధి
- అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు



**తిరుమల, మార్చి 21:** తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టీటీడీ బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్

మిగతా 2 లో



## తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

- ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు

2

## నక్కపల్లి వద్ద స్టీల్ ఫ్యాక్టరీ

- 23న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు రాక
- 1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం

2





## కోతుల దాడిలో వృద్ధురాలు మృతి

- 20కి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి దాడి

కోతుల మూక దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో చోటు చేసుకుంది.

2

# పశు పోషకులకు ఊరట

- రుసుములపై సడలింపులు జారీ
- మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి



**అమరావతి, మార్చి 21:** పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్న రైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ ఛార్జీలు మినహాయింపునిచ్చినట్లు స్పష్టం చేశారు.

మిగతా 2 లో



## ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం

### దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్

హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

జగన్ హయాంలో ఏపీ ఆర్థికంగా చాలా నష్టపోయిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో జరిగిన పొరపాట్లను తమ ప్రభుత్వంలో సరిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## జగన్ హయాంలో ఆర్థికంగా రాష్ట్రం దివాళా

2

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం



2

## హిప్పో దాడిలో పశు వైద్యురాలు మృతి

వివరాలు 3వ పేజీలో



# ఆధ్యాత్మిక కేంద్రాలుగా టీటీడీ ఆలయాలు

మొదటి పేజీ తరువాయి

కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

# కోతుల దాడిలో వృద్ధురాలు మృతి

**కాకినాడ, మార్చి 21:** కోతుల మూక దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామ శివారులో జీడిమామిడి తోటను ఆనుకుని ఉన్న ఇంట్లో దానబోయిన చిన్నబుల్లి (68) నివాసం ఉంటున్నారు. గేదెకు నీరు పెట్టేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. 20కి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి దాడి చేయడంతో తప్పించుకునే వీలు లేకుండా పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. చిన్నబుల్లి తనకు ఉన్న 3 ఎకరాల తోటలో తన కుమార్తె కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటోంది. ఈ ప్రాంతంలో కోతుల దాడిలో గాయపడిన ఘటనలు చాలా జరిగాయని.. అయితే ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారని గ్రామస్థులు వాపోయారు.

# పశు పోషకులకు ఊరట

మొదటి పేజీ తరువాయి

ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ నిర్ణయంతో మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల

## అక్రిడిటేషన్ వచ్చాక పూర్తిస్థాయి పరీక్షలు

## వెల్లడించిన ఏపీ మంత్రి సత్యకుమార్

**తిరుమల, మార్చి 21:** కొద్దికాలం వ్యవధిలోనే తిరుమలలో ఫుడ్ సేఫ్టీ పరిశోధన శాలను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పరిశోధనశాలలో అనేక పరీక్షలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పాలు, నెయ్యి, నూనెతో పాటు ముడి సరుకుల నాణ్యతను పరీక్షించవచ్చని చెప్పుకొచ్చారు. తిరుమలలో ప్రతిష్టాత్మకంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ల్యాబ్‌ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని 2024లో ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి అదనంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రస్తావించారు. శనివారం తిరుమలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ పరిశోధన శాలలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ పరిశోధన శాల పని చేస్తోందని వివరించారు. అప్పటి వరకు అనాలిసిస్ జరుగుతునే ఉంటుందని తెలిపారు. మూడు నెలల్లో గుంటూరు, వైజాగ్‌లో పరిశోధన శాలలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 11 స్టేట్ ఫుడ్ ల్యాబ్‌లను ఆధునికీకరించామని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీపడ బోమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.



# తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

## ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు



**తిరుమల, మార్చి 21:** తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

## ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు

## వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు

## ఎఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు

## భక్తులను నేరుగా కలుసుకుని చర్చించి చంద్రబాబు



**తిరుమల, మార్చి 21:** సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాదం విశిష్ఠతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు.

# జగన్ హయాంలో ఆర్థికంగా రాష్ట్రం దివాళా

## అరసవిల్లి అభివృద్ధి పనులకు రామ్మోహన్ శ్రీకారం



**శ్రీకాకుళం, మార్చి 21:** జగన్ హయాంలో ఏపీ ఆర్థికంగా చాలా నష్టపోయిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో జరిగిన పొరపాట్లను తమ ప్రభుత్వంలో సరిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణి పున:నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. అరసవల్లి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అరసవల్లి ఆలయంలో రూ.4 కోట్లతో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండుగగా నిర్వహించామని చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రసాదం స్కీమ్‌లో అరసవల్లి నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. రూ.4 కోట్లతో పుష్కరిణి అభివృద్ధికి చర్యలు చేపట్టామని అన్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని వివరించారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్గిల్ పార్క్ అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

## డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం



**విజయనగరం, మార్చి 21:** జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. రామభద్రాపురం మండలం తారాపురం వద్ద బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వెళ్తుండగా వెనుక టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక టైర్ పేలి మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవర్.. వెంటనే ప్రయాణికులను దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఏ గాయం కాలేదు. అయితే బస్సు మాత్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఒడిశాకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా ప్రయాణం చేస్తున్నట్లు సమాచారం. కాగా, బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ÷ర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇక పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను ప్రత్యామ్నయ మార్గాల్లో గమ్యస్థానాలకు పంపించేశారు.

# నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

**విశాఖపట్టణం, మార్చి 21:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారం కోసం సోమవారం సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామిలు శంకుస్థాపన చేయనున్నారు.ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా



పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి. గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం, వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు పడింది. ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతుంది. గత 21 నెలల కూటమి ప్రభుత్వ కృషితో ఈ భారీ ప్రాజెక్టు సాకారం కాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఈ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేయనుంది.




# హిప్పో దాడిలో పశువైద్యురాలు మృతి

### ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి

### ప్రభుత్వం తరఫున 30లక్షల పరిహారం ప్రకటన

**బెంగళూరు, మార్చి 21:** కర్ణాటకలో పెను విషాద ఘటన ఒకటి చోటుచేసుకుంది. హిప్పోపోటమస్ దాడిలో పశు వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. గర్భంతో ఉన్న హిప్పోను చెక్ చేయడానికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన 27 ఏళ్ల సమీక్షా రెడ్డి త్యావరకొప్ప టైగర్, లయన్ సఫారీలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశు వైద్యురాలిగా సేవలు అందిస్తోంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె జూలోని సన్ కాపర్ పక్షికి చికిత్స చేయడానికి వెళ్లింది. పక్షికి చికిత్స పూర్తయిన తర్వాత గర్భంతో ఉన్న హిప్పో టెంపరేచర్ చేయడానికి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ హిప్పో ఆమెపై దాడి చేసింది. తలతో బలంగా సమీక్షారెడ్డిని కొట్టింది. దీంతో ఆమె ఊపిరితిత్తులు, లివర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూ సిబ్బంది ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సమీక్షా రెడ్డి ప్రాణాలు విడిచింది. పశువైద్యురాలి మృతిపై కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బీ ఖండ్రే స్పందించారు. సమీక్షారెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫు నుంచి 30 లక్షల రూపాయల పరిహారం ప్రకటించారు. ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. కాగా, సమీక్షా రెడ్డి హెబ్బల్‌లోని వెటర్నరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. 2023లో డిగ్రీ పూర్తి అయిన తర్వాత కొంతకాలం పాటు మంగళూరు సర్కిల్ వైల్డ్ లైఫ్ డాక్టర్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేసింది. ఫిబ్రవరి నెల నుంచి శివమొగ్గ జూలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశువైద్యురాలిగా సేవలు అందిస్తున్నారు. జూలో విధుల్లో చేరి రెండు నెలలు కాకుండానే ఈ విషాదం చోటుచేసుకుంది.

# ఉద్యోగులు పదవీ విరమణ వయసు పెంపు

### 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచిన ఏపి ప్రభుత్వం



**అమరావతి,మార్చి21:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయ-సును సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై శనివారం సమావేశమైన మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, నారాయణ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. వయసు సడలింపు అంశాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిరాకరించగా.. కూటమి ప్రభుత్వం మాత్రం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేలుచేసే నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించారు. ఈ మేరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు ఉద్యోగులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు మేలు చేసిన కూటమి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కన్నుమూత

**అనంతపురం, మార్చి 21:** అనంత జిల్లా కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కన్నుమూశారు.. ఆయన వయస్సు 81 సంవత్సరాలు.. శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన ఆరేళ్ల పాటు పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పనిచేశారు. కళ్యాణదుర్గం మండలం గరుడాపురం పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగారు. నెల రోజులుగా గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతూ.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇవాళ తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమంతరాయ చౌదరి స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు ..




# ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం
- రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి 21:** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశర కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# యుద్ధరీతులు మారుతున్నాయి

- యువత దేశ రక్షణకు నడుం బిగించాలి
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, మార్చి 21:** నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

## పాడితోనే సరిసంపదలు: మంత్రి



**విజయనగరం, మార్చి 21:** పాడిని నమ్ముకుంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని దేవుపల్లి గ్రామంలో ఎఎంసి చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం కత్రిమ లేగదూడల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు గ్రాసం పెంచే రైతులకు తన వంతుగా 25వేలు రూపాయలు ప్రోత్సాహం అందిస్తానని ప్రకటించారు. గొల్లుపాలెంలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ కోరాడ కష్ణ, పశుసంవర్థక శాఖా జెడి దామోదర్, వ్యవసాయ శాఖ ఎడి నిర్మలజ్యోతి, టిడిపి మండల అధ్యక్షులు రాపాక అచ్చెం నాయుడు పాల్గొన్నారు.

## తల్లి, చెల్లికి ఆస్తిలో అన్యాయం చేయడమేమిటి

### వైఎస్ జగన్‌ను ప్రశ్నించిన మాజీ మంత్రి పీతల



**అమరావతి,మార్చి 21:** మహిళా లోకాన్ని, ఆస్తి హక్కును అవమానపరిచేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరించడం అత్యంత హేయ-ంమైన చర్య అని మాజీ మంత్రి, ఎపిడబ్ల్యూసిఎఫ్‌సి ఛైర్‌పర్సన్ పీతల సుజాత విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తండ్రి సంపాదనలో దాదాపు రూ.43 వేల కోట్లు కలిగిన జగన్ చట్ట ప్రకారం తల్లికి, చెల్లికి ఇవ్వాల్సిన సమాన వాటాను ఎందుకుకివ్వడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం జగన్ గొడవ కాదని, దేశంలోని మహిళలకు రాజ్యాంగం కల్పించిన ఆస్తి హక్కుపై చేస్తున్న దాడి అని పేర్కొన్నారు. ఆస్తులను ప్రేమించడం, తల్లిని వేధించడం ఒక పాలసీలా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ఈ రాష్ట్ర ప్రజలకు, మహిళలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు.

# అతిపెద్ద చౌరబాటుదారుడు మోదీయే

### ఈద్ ర్యాలీలో మమత బెనర్జీ వ్యాఖ్యలు



**కోల్‌కతా,మార్చి21:** దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు ప్రధాని మోదీయే అని విమర్శించారు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ. బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో శనివారం జరిగిన ఈద్ ర్యాలీలో మమత పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మోదీపై, బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు మోదీ. బెంగాల్‌ను ఎవరు లక్ష్యంగా చేసుకుంటారో వారు నరకానికి వెళ్తారు. బీజేపీని రాష్ట్రంలోకి రాకుండా చూస్తాం. మోదీ నుంచి, బీజేపీ నుంచి దేశాన్ని, బెంగాల్‌ను కాపాడటమే టీఎంసీ ప్రాథమిక కర్తవ్యం. బెంగాల్ మత సామరస్యాన్ని కాపాడుతాం. సర్ ద్వారా ప్రజల ఓటు హక్కుల్ని కాలరాసింది బీజేపీ. సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం. బీజేపీ అంటే గూండాలు, దొంగల పార్టీ. మీ ఓటు హక్కును మోదీ తీసుకోకుండా చూస్తా. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కుల్ని కాపాడేందుకు పోరాడుదాం. కొందరు ప్రజల ఓట్లు సర్ పేరుతో తీసేశారు. నేను దీనికోసం కోల్‌కతా నుంచి ఢిల్లీ వరకు, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్లా. ప్రజల హక్కులకు రక్షణ దొరుకుతుందనుకుంటున్నా. బెంగాల్‌లోని అన్ని కులాలు, వర్గాల ప్రజలకు అండగా ఉంటా' అని మమత వ్యాఖ్యానించారు. అయితే, మమత వ్యాఖ్యలపై బెంగాల్ బీజేపీ నేతలు మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే నిరాశ, భయంతో మమత ఇలా ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేత శిశిర్ బజోరియా అన్నారు. మమత ఉపయోగించిన భాష సరికాదన్నారు. ప్రధాని మోదీని చొరబాటుదారుడు అని ఎవరు అన్నా వారికి రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు. ఇక, బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడుతాయి.




సంపాదకీయం

# రుణ విముక్తి చర్యలను పట్టించుకోని బడ్జెట్

దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం గొప్ప పనులు చేశారంటే ఏమీ లేదు. ఉన్న అప్పులకు మిత్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తేవడం తప్ప, తెలంగాణను రుణం నుంచి విముక్తి చేసే ఆలోచన ఒక్కటీ కానరాలేదు. కెసిఆర్‌ను మించి అప్పులు చేస్తూ పోతే మరో వంద ఏళ్లయినా అప్పులు తీరవు. దీనిపై ఆలోచన, ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రసంగాలు సాగుతున్నాయి. మేము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం ఆర్థిక మంత్రిగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క గొప్పగా చెప్పుకున్నారు. కానీ డబ్బు ఆదా చేయడం, వృధా చేయకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఎక్కడ వృధా అవుతుందో కూడా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించే ప్రయత్నం జరగడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు డబుల్ పెన్షన్లు, లక్షల్లో జీతాలు ఎందుకో చెప్పడం లేదు. కిలో రూపాయి బియ్యం వృధాను అరికట్టడం లేదు. పెన్షన్ల వృధాను గుర్తించడం లేదు. ఇవన్నీ కట్టడి చేస్తే కొంతయినా మిగులుబాటు ఉంటుంది. ఇకపోతే కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి జరగడం లేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చిన ఘనత వీరిది. వేల ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయి, దేవాలయాలు పాడుబడ్డా పట్టింపు లేదు. ఉత్సవాలు నిర్వహించుకోవడం తప్ప దేవాదాయశాఖ మంత్రికి ఏ భూమి ఎక్కడ ఉందో లేదో తెలియదు. రోడ్లు ఎలా ఉన్నాయో రోడ్లు భవనాల శాఖ మంత్రికి తెలియదు. ప్రభుత్వమంటే పంచి పెట్టడం కాదు. ఆదాయాన్ని ఆదా చేయాలి. అప్పులు లేకుండా చేయాలి. అలా కాకుండా సంక్షేమాల పేరుతో దుబారా చేయడం వల్ల అభివృద్ధి ఆగిపోతోంది. తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం రేషన్ కార్డులు ఉన్నవారికే అని చెప్పకనే చెప్పారు. రేషన్ కార్డుల్లో బోగస్ ఎత్తివేస్తే అనేకమంది పేదలకు లబ్ది చేకూరుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది ఎవరికన్నది స్పష్టత లేదు. అన్ని కుటుంబాలకు వర్తిస్తుందా అన్నది చెప్పాలి. ఇకపోతే ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వాటిని పటిష్టం చేయాల్సి ఉన్నా గత రెండేళ్లుగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. హాస్టళ్లునరక కూపాలుగా ఉన్నా వాటిని ఉద్ధరించలేదు. ఉన్న స్కూళ్లను సంస్కరించడం లేదు. కానీ కొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలన్న లక్ష్యం మంచిదే. కానీ ఉన్న స్కూళ్లను బాగుచేసి, అధ్యాపకులను భర్తీ చేస్తే మంచిది. ఇకపోతే మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పం ఆహ్వానించదగ్గదే. గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం ఉజ్జాయింపుగా తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్దాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్న తరుణంలో అందుకు అనుగుణంగా కూడా ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఎప్పటికైనా ఉచిత పథకాలు తగ్గించుకోవడం, ఖర్చులు తగ్గించుకోవడం చేయనంత వరకు బడ్జెట్ కేటాయింపులు ఘనంగానే ఉంటాయి. ఆయరణలో దెబంతింటాయి.



డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

- దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్
- హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం



**టెహ్రాన్, మార్చి 21:** ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా÷–గ్గ÷ట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్–2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్–యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హార్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళుతున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ.. ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత



**వాషింగ్టన్, మార్చి 21:** యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితి పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హార్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

# దాడులతో దద్దరిల్లుతో పశ్చిమాసియా

**ఇరాన్ అణు కేంద్రంపై వైమానిక దాడులు**

**నష్టం లేదని తెలిపిన ఇరాన్**

**అంతర్జాతీయ ఉల్లంఘనేనని ఆరోపణ**

**టెహ్రాన్, మార్చి 21:** దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# యూఎన్ఐ న్యూస్ ఏజెన్సీ ఆఫీసు సీజ్

**50 మంది జర్నలిస్టుల గెంటివేత**

**హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం**



**న్యూఢిల్లీ, మార్చి 21:** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

## నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన

# ఏర్పాట్లును పరిశీలించిన హోం మంత్రి అనిత



**- అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి**



**నక్కపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** నక్కపల్లి మండలంలో ఈ నెల 23న జరగనున్న ప్రతిష్టాత్మక ఆర్సెలర్ మిట్టల్ – నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతిరోజూ పనుల పురోగతిని మంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమన్ పటేల్, వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భద్రతా ఏర్పాట్లపై హోం మంత్రి అనిత పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రతా ఏర్పాట్లపై వివరించారు. ఈ సమీక్షలో విశాఖ పట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం మరియు మన్యం జిల్లాల నుండి పోలీస్ అధికారులు పాల్గొన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యేలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. వీఐపీలకు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణను పక్కాగా అమలు చేయాలని, విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# డ్రగ్స్, గంజాయిపై విస్తృత తనిఖీలు చేపట్టాలి

**- మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు అందరు కృషి చేయాలి**
**- ఫార్మసీ లలో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మరాదు : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి**



**విజయనగరం ,(మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 21 :** జిల్లాలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్, విద్యాశాఖ, అబ్కారి, అటవీ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై యువతకు, విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా నివారణకు అంతరరాష్ట్ర, జిల్లాల సరిహద్దు లలో చెక్ పోస్ట్ ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. పోలీసు, ఫారెస్ట్,ఎక్సైజ్ శాఖలతో జాయింటు ఆపరేషను నిర్వహించాలని తెలిపారు. బస్సులు,రైల్వే స్టేషన్ లలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలు రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి శిక్షలు పడే విధంగా కట్టుదిట్టమైన ఆధారాలు సమకూర్చాలని ఆయన అన్నారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గంజాయి, ఇతర మత్తు పదార్థాల చెడు ప్రభావాలను వివరించాలని ఆయన ఆదేశించారు. విద్యా సంస్థలు వద్ద కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విద్యా సంస్థలలో ఎట్టి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. విద్యా సంస్థల దగ్గరలో గల దుకాణాలను తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్దంగా విక్రయాలు జరిపే షాపులను మూసివేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫార్మసీ లలో ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు సంబందించిన మందులు అమ్మరాదని, అమ్మకాలు సాగించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్, విద్యాశాఖ, అబ్కారి, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో వైభవంగా

# ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



**పాల్గొన్న స్పీకర్ చింతకాయల దంపతులు**

**నర్సీపట్నం , మార్చి 21 (మనసులో మాట) :** నర్సీపట్నం: స్థానిక కాపువీధిలోని శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్దకు చేరుకున్న స్పీకర్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు సన్నాయి మేళం మరియు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్లో వారు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు స్పీకర్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి వారిని ఘనంగా సత్కరించారు. నర్సీపట్నం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీమాన్ నేతేటి శరత్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో ఈ శాస్త్రోక్త కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో, కొల్లానా పరదేశి నాయుడు, గొలుసు నరసింహమూర్తి, బలిజి బుజ్జి, దాడి శ్రీను, పెదరెడ్ల నాగేశ్వరావు, గోలజానా రాజు తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు రూ.227.50 లక్షలు మంజూరు

**- మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వెల్లడి**


**దేవరాపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** మాడుగుల నియోజకవర్గానికి సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనుల నిర్మాణం కోసం రూ.227.50 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల గ్రామాల అభివృద్ధికి ముఖ్య ప్రాధాన్యత ఇస్తూ పలు గ్రామ పంచాయతీలలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థల నిర్మాణానికి ప్రభుత్వం రూ.227.50 లక్షల నిధులను మంజూరు చేసింది ఎమ్మెల్యే బండారు పేర్కొన్నారు. ఈ పనులకు పరిపాలన అనుమతులు కూడా లభించాయన్నారు. చీడికాడ మండలంలోని చీడికాడ గ్రామ పంచాయతీకి రూ.15 లక్షలు, చెట్టుపల్లి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు, బైలపూడి గ్రామ పంచాయతీకి రూ.15 లక్షలు, తురువోలు గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు, అప్పలరాజు పురం గ్రామ పంచాయతీకి రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. మాడుగుల మండలంలోని మాడుగుల గ్రామ పంచాయతీకి రూ.15 లక్షలు, డి .గోటివాడ గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు, ఎల్ . పొన్నవోలు గ్రామ పంచాయతీకి రూ.15 లక్షలు,ఎం .కోడూరు గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

దేవరాపల్లి మండలంలోని మూలకాపల్లి గ్రామ పంచాయతీలో రెండు పనులకు కలిపి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. కె .కోటపాడు మండలంలోని గుళ్లేపల్లి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు, కె.సంతపాలెం గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు, కింతాడ గ్రామ పంచాయతీకి రూ.7.5 లక్షలు, వారాడ గ్రామ పంచాయతీకి రూ 10 లక్షలు, సింగన్నదొర పాలెం గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు, మంజూరయ్యాయని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పనులను ఈ నెల 30 వ తేది లోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారు స్పష్టం చేశారు.

# ఈ నెల 23న అనకాపల్లి జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

**- నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన**
**- కేంద్ర మంత్రులు హాజరు**



**విశాఖ సిటీ , మార్చి 21 (మనసులో మాట) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 23న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈనెల 23 తేదీన మధ్యాహ్నం వాయుమార్గం ద్వారా విశాఖ పట్నం చేరుకుంటారు , ఎయిర్పోర్ట్ నుండి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చందనాడ గ్రామం చేరుకుని ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు.అనంతరం అక్కడినుండి వాయు మార్గం ద్వారా విజయవాడ వెళ్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్. చంద్రశేఖర్ పెమ్మసాని, కేంద్ర ఉప్పు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ పాల్గొంటారు.

**25న ఏయు కాన్వకేషన్ కు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ రాక**

రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఈనెల 24న రాత్రి 9:00 గంటలకు వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుని రాత్రికి ఒక హోటల్లో బస చేస్తారు.25 ఉదయం10:00 గంటలకు ఆంధ్ర యూనివర్సిటీ కాన్వకేషన్ లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:00 గంటలకు విశాఖపట్నం నుండి వాయుమార్గం ద్వారా విజయవాడ వెళ్తారు.


# బీజేపీలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త ఎం.వి.ఆర్



**అనకావల్లి టౌన్ , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వర రావు (ఎం.వి.ఆర్) మంగళవారం విశాఖ బీజేపీ పార్టీ కార్యా లయం లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు.రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెంకటేశ్వరకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ తో పాటు సుమారు 100 మంది పైగా అనుచరులు, స్థానిక సర్పంచులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ విధానాలు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితులై ప్రజల సేవలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరినట్లు ఎం.వి.ఆర్ తెలిపారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అనకాపల్లి ప్రాంతంలో పార్టీని అన్ని స్థాయిల్లో బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, రానున్న రోజుల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదుర్తి సర్పంచ్ కడిమి వెంకట్, బంగారం మెట్ట నానాజీ, గంటా సూరిబాబు, నర్సీపట్నం జానకి, గాలి శ్రీను, గైపూరు రాజు అధిక సంఖ్యలో ఎం వి ఆర్ అభిమానులు పాల్గొన్నారు.



# రోడ్డుపై కూలిన చెట్టు..నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



**కోటవురట్ల , మార్చి 21 (మనసులో మాట) :** కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షం వీచిన గాలులకు పెద్ద చెట్టు కూలిపోయింది. నర్సీపట్నం–రేవు పోలవరం ఆర్ అండ్ బి రహదారికి అడ్డంగా చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు విద్యుత్ స్తంభంపై పడటంతో వైర్లు అన్ని తెగి కింద పడ్డాయి. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఈ సంఘటన అర్ధరాత్రి జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల వరకు చెట్టు తొలగించలేదు. గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించడంతో ఉదయం 9 గంటలకు వచ్చి చెట్టును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలి

**ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలు**



**విశాఖ సిటీ , మార్చి 21 (మనసులో మాట) :** ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని సమగ్ర ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆనందపురం కూడలిని పరిశీలించిన వారు, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణం అమలు చేయగల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు పూల మార్కెట్‌ను సమీపంలోని రైతు బజార్‌కు కేటాయించిన 95 సెంట్ల స్థలానికి తరలించే అంశంపై చర్చించారు. అలాగే, దానికి ఆనుకుని ఉన్న ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని కూడా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు.

ఫ్లైఓవర్ కింద విస్తరణ పనులు చేపట్టి, తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రాంత పరిస్థితులను సూక్ష్మంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులు, పోలీస్ శాఖ, స్థానిక రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రంజాన్ ప్రత్యేక నమాజులో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం , మార్చి 21 (మనసులో మాట) :** శ్రీకాకుళం నగరం జి.టి. రోడ్డు లో గల జామియా మసీదులో ఈరోజు జరిగిన రమజాన్ ప్రత్యేక నమాజులో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొనడం జరిగింది. జామియా మసీదు ఇమామ్ ఎండి. జియావుర్ రెహమాన్ ప్రత్యేక నమాజు ( ఈద్–ఉల్–ఫితర్) చదివించడం జరిగింది. అనంతరం యావత్ మానవాళి ఆయురా రోగ్యాలు, సుఖ సంతోషాలు, అష్ట ఐశ్వర్యాలు కలగాలని అల్లాకు (భగవంతుని) ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి ప్రాచీన, పెద్దదైన జామియా మసీదు నా నియోజకవర్గంలో ఉండడం నా అదృష్టం అని ఈ మసీదును అభివృద్ధికి





కట్టుబడి ఉన్నానని త్వరలోనే అంతర్గత రహదారులు, సోలార్ లైట్స్, ప్రహరీ గోడ మరమ్మత్తులు మరియు ఎత్తు పెంచుట, శిథిలా వ్యవస్థకు చేరుకున్న మురుగుదొడ్లను నూతన నిర్మాణం తదితర పనులన్నీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు సహాయ, సహకారంతో నిధులు కేటాయించి త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్తూ ముస్లిం ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, జామియా మసీద్ ఇమామ్ మహమ్మద్ జియావుద్దీన్ రెహమాన్ (ముఫ్తీ), ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, మౌజన్ మహమ్మద్, జామియా మసీద్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎండి యాసిన్, కోశాధికారి మీర్ అసదుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ సలీం, అబ్దుల్ గఫార్ ఖాన్, సభ్యులు షేక్ శాన్ బాషా, అలీ భాయ్, ఎండి ఇబ్రహీం, ఎండి రఫీ, అబ్దుల్ రషీద్, ఎండి అన్వర్ భాష, హాజీ మీర్ షాదికుల్లా, హాజీ హర్షద్, హాజీ అమీరుల్లా బేగ్, హాజీ షబ్బీర్, హాజీ ఖాన్, హాజీ యాసిన్, ముబారక్, షాను, షఫీ, రోషన్ బాషా ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక 'టీవీ5' పంచాంగం

- చింతపల్లి ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరణ
- వాస్తవాల వెలికితీతలో టీవీ5 కృషి అభినందనీయం



**చింతపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రజల గొంతుకగా నిలుస్తూ, ఎప్పటికప్పుడు వాస్తవాలను వెలికితీస్తున్న 'టీవీ5' వార్తా సంస్థ, ఆధ్యాత్మిక రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోందని చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేశెట్టి సత్యనారాయణ(సతీష్) కొనియాడారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ వేదికగా 'టీవీ5 హిందూధర్మం' ప్రత్యేక పంచాంగాన్ని ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సబ్బితి వనరాజు సమక్షంలో టీవీ 5 పాత్రికేయుడు సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేశెట్టి సతీష్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో టీవీ5 నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు. కేవలం వార్తా ప్రసారాలకే పరిమితం కాకుండా, శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనాన్ని సూచించే పంచాంగాన్ని రూపొందించి భక్తి భావనను చాటుకోవడం శ్లాఘనీయమని కొనియాడారు. అల్లూరి జిల్లాలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ వార్తలను అందించడమే కాకుండా, ఇలాంటి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉగాది పర్వదినం పూర్తయిన నేపథ్యంలో, ఈ నూతన సంవత్సరం టీవీ5 యాజమాన్యానికి, ప్రతినిధులకు అలాగే ప్రేక్షకులకు మరిన్ని విజయాలను చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలువురు పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కోటేశ్వరరావు(కోటి), చిట్టిబాబు, సత్తార్ తదితరులు పాల్గొని, టీవీ5 చేస్తున్న కృషిని అభినందించారు.

## శ్రీ గరుడాద్రి కొండ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాదం వితరణ



**గాజువాక , మార్చి 21 (మనసులో మాట) :** జీవీఎంసీ పరిధి 65వ వార్డు భానోజీ తోట వాంబే కోలనీ గరుడాద్రి కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో అంగరంగ వైభవంగా ప్రతి వారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ ఆలయ సేవకులు ఆర్థిక సహాయంతో నిర్వహించారు.ముఖ్య అతిథులకు మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే ప్రసాద వితరణ భక్తుల సహాయ సహకారాలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం అన్నప్రసాద వితరణలో మేము కూడా పాల్గొనడం మా అదృష్టమని వెంకటేశ్వర స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు.ఏడు వారాలు నిష్ఠతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి ప్రదర్శలు చేసి స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏ ఇ రామకృష్ణ, అప్పల రాజు,పెంటకోట రాజు, పూడి శాంతి మరియు ఆలయ సేవకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# మాతృభాషా ప్రావీణ్యతతో ఉన్నత శిఖరాలు

### అనకాపల్లి జిల్లాలో మాతృభాషోద్యమ సదస్సు, ఉచిత ఐఐటీ, నీట్ కోచింగ్



**రోలుగుంట , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా "వేములపూడిలోని మాతృభాషోద్యమ ఉన్నత పాఠశాలలో "మాతృభాషలో ప్రావీణ్యంతోనే ఉన్నత శిఖరాలు" అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ డీజీపీ, ఐపీఎస్ అధికారి కిల్లాడి సత్యనారాయణ తెలుగు మాతృభాషలో ప్రావీణ్యం, పట్టుదలతో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పోస్టులను సాధించవచ్చని విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. తెలుగులోనే నైపుణ్యం సాధించి, అకుంఠిత దీక్షతో లక్ష్యసాధన చేస్తే గొప్ప విజయాలు సాధ్యమని ఆయన ఉద్ఘాటించారు. ఒకటో తరగతి నుంచి ఎమ్ఎ వరకు తెలుగు మీడియంలో చదివి, తెలుగులోనే ఐపీఎస్ పరీక్ష రాసి ఉత్తరప్రదేశ్లో సీనియర్ ఐపీఎస్ గా పనిచేసిన అనుభవాన్ని ఆయన తన సొంత జీవితం ద్వారా తెలియజేశారు. సత్యనారాయణతో పాటు తెలుగు మీడియంలో చదివి, ఐఏఎస్ పరీక్షను తెలుగులోనే రాసి దేశంలో మూడో ర్యాంకు సాధించిన రోణంకి గోపాలకృష్ణ వంటి వారి విజయాలను ఉదాహరణలుగా పేర్కొన్నారు. మాతృభాష ప్రావీణ్యం వల్ల మేధోవికాసం, సృజనాత్మకత పెరుగుతాయని, గణితం- సైన్స్ విషయాలు కూడా సులభం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. నర్సీపట్నం ప్రాంత వాసిగా గ్రామీణ పిల్లల చదువు గురించి ఆవేదన వ్యక్తం చేస్తూ తెలుగు మీడియం విద్యను బలపరిచేలా "తెంగ్లీషు భాషోద్యమం" ప్రారంభించిన తీరును కూడా వివరించారు. ఇదే కార్యక్రమంలో ఆల్ ఇండియా జ్యోతిరావు పూలే ఓబీసీ అధ్యక్షులు పోతల ప్రసాద్ నాయుడు తెలిపినట్లు, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఢిల్లీలో ఉచిత కోచింగ్ ఇస్తున్నారు. సామాజిక చైతన్య కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఐఐటీ, ఐఏఎస్, ఐపీఎస్, మెడిసిన్ వంటి ఉన్నత విద్యలకు తక్కువ ఖర్చుతో అత్యుత్తమ అనుభవం కలిగిన అధ్యాపకుల ఆన్లైన్ బోధన కూడా నిర్వహిస్తున్నారు. దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మంచి నైపుణ్యం కలిగిన విద్యార్థులను దత్తత తీసుకొని, వారి ఉన్నత చదువులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు కార్యక్రమంలో సత్యనారాయణ, ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. అలాగే, అనకాపల్లి జిల్లా చుట్టుపక్కల మండలా ల్లో 8, 9, 10 తరగతుల గ్రామీణ పేద విద్యార్థు లకు ఐఐటీ-జేఈఈ (మెయిన్, అడ్వాన్స్డ్), నీట్ (యూజీ) పరీక్షల ఫౌండేషన్ కోచింగ్ ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ప్రముఖ ఆన్లైన్ విద్యా సంస్థ ఫిజిక్స్ వాలా, సమర్పణ సేవా సంస్థ, వేద విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం అమలవుతోంది.

రిటైర్డ్ ఐపీఎస్ కిల్లాడి సత్యనారాయణ (సమర్పణ స్థాపకుడు), ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు (వేద విద్యా డైరెక్టర్) ఈ కార్యక్రమానికి ప్రధాన భాగస్వామ్యం వహిస్తున్నారు.గ్రామీణ ప్రతిభలను వెలికితీసి ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కోచింగ్ను ఊర్లోనే అందుబాటులో ఉంచుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఆర్థిక, సామాజిక ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. వేసవి సెలవుల సమయంలో ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఆన్లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఢిల్లీ సంస్థ సహకారంతో పూర్తి ఏర్పాట్లు చేశారు. ఐఐటీ-జేఈఈ (మెయిన్, అడ్వాన్స్డ్ ), నీట్ (యూజీ) పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. మార్చి 29 ఆదివారం మాకవరపాలెం మండలం, మరియు రోలుగుంట మండలాలలో ఈ కోచింగ్ కి సంబంధించిన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి ఆన్లైన్ క్లాసులు ప్రారంభమవు తాయన్నారు.

## ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకించండి : సిపిఎం




**అచ్చుతాపురం , మార్చి 21 (మనసులో మాట) :** అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, యుద్ధం వద్దు శాంతి కావాలని అచ్యుతాపురం సంతలో సిపిఎం కరపత్రాలు పంపిణీ చేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్ రాము ,సీనియర్ నాయకులు కరీ అప్పారావు మాట్లాడుతూ గత 22 రోజులుగా ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ కలిపి ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా ఇతర నగరాలపై బాంబుల వర్షం కురిపించాయి ఆ దేశంలో పాఠశాల పై బాంబులు వేసి 160మంది విద్యార్థులకు బలి తీసుకున్నాయి నేవీ ఉత్సవాల్లో పాల్గొనడానికి మన విశాఖ తీరానికి వచ్చిన నూక తిరిగి వెళుతున్న శ్రీలంక సముద్ర జలాల్లో పయనిస్తున్న సైనిక పడవను 100 మంది ని అమెరికా నీటముంచింది వేలాల మంది నేటికీ చనిపోతున్నారు యుద్ధము వలన అమెరికా ఖనిజ నిక్షేపాలపై పెత్తనం చలాయించడం కోసం ఇజ్రాయిల్ తో కలిపి దాడులు పూనుకుంటున్నది దీంతో భారత దేశ ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి ఇప్పటికే వంట గ్యాస్ ధరలు పెరిగాయి వంటగ్యాసు దొరకగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు దీంతోపాటు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి గ్యాస్ ఉత్పత్తి లేక పరిశ్రమల్లో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు తోపుడు బళ్ళు, చిరు వ్యాపారస్తులు గ్యాస్ లేక ఉపాధి కోల్పోతున్నారు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మన దేశ ఎగుమతులు ఆగిపోయాయి ఎగుమతులు చేసే వస్తువులు ధరలు తగ్గి రైతాంగం పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి దిగుమతి చేసుకునే ఆయిల్ ,గ్యాస్ ఇతర వస్తువులు అమాంతం ధరలు పెరుగుతున్నాయి యుద్ధం నివారణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు పైగా అమెరికా ,ఇజ్రాయులకు వత్తాసు పడుతున్నాయి మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోతుంది యుద్ధ నివారణకు చర్యలు తీసుకొని యుద్ధాన్ని వ్యతిరేకించి శాంతిని నెలకొల్పాలని సిపిఎం కోరుతున్నది ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె సోము నాయుడు,ఆర్ లక్ష్మి ,కడారి అప్పారావు కాసులమ్మ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## సెరినస్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రగడ



**అచ్చుతాపురం , మార్చి 21 (మనసులో మాట) :** అచ్చుతాపురం కేంద్రంలో సెరినస్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరావు పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సామాజిక కార్యక్రమంలో తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీలా తులసీరామ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, కర్రీ వెంకటరమణ, పుర్రె రవి యాదవ్, కొమోజు ఈశ్వరరావు, తిమ్మరాజుపేట పిఎసిఎస్ చైర్మన్ జగ్గప్పారావు, దేవర కృష్ణ, బద్ది తాతాజీ, ఎల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చామంతీపురం సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**మాకవరపాలెం , మార్చి 21 (మనసులో మాట) :** మాకవరపాలెం మండలం చామంతీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ బొడ్డు గోవిందరావు తండ్రి బొడ్డు పైడియ్యానాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో నర్సీపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శనివారం గోవిందరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు ఘటించారు. అనంతరం గోవిందరావు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఇలాంటి కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గ్రామానికి సేవలు అందించిన పైడియ్యానాయుడు మరణం తీరని లోటని పేర్కొన్నారు. అలాగే కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, నాయకులు కూడా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి రుత్తల సత్యనారాయణ, మండల బూత్ అధ్యక్షుడు రుత్తల వాసు, మండల యూత్ అధ్యక్షుడు రుత్తల రాజుబాబు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పిల్లా శ్రీను, పెద్దిపాలెం సర్పంచ్ బాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి సందర్భంగా టీటీడీ కళ్యాణ మండపంలో పుష్పార్చన, శ్రీరామ సంకీర్త నార్చన



**విశాఖ , మార్చి 21 (మనసులో మాట) :** రానున్న శ్రీరామ నవమి పండుగ సందర్భంగా తమ ఆధ్వర్యంలో నగరంలోని ఎంవిపి కాలని టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీ సీతా సమేత శ్రీరాముల వారికి కోటి మల్లెలతో పుష్పార్చన, శ్రీరామ సంకీర్తనార్చన, హనుమాన్ చాలీసా వేద ఆశీర్వచనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని శారదా సంగీత నిలయం అధ్యక్షురాలు భావరాజు విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు టీటీడీ కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను గత 25 సంవత్సరాలుగా శాస్త్రీయ సంగీత పాఠశాల నిర్వహిస్తున్నా నన్నారు. తమ సంస్థ నుండి సుమారు రెండు వందల మంది సంగీత విద్యార్థులచే వసంత నవరాత్రుల సందర్భముగా శ్రీ సీతా సమేత శ్రీరాముల వారికి కోటి మల్లెలతో పుష్పార్చన, శ్రీరామ సంకీర్తనార్చన, హనుమాన్ చాలీసా వేద ఆశీర్వచనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయ సంకల్పించా మన్నారు. విద్యార్థులకు సనాతన ధర్మ విలువలు, భారతీయ సంస్కృతి సంప్రదాయములు తెలియ చేయుటకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ ఆదివారం రోజున శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మండపంలో జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రతబాగ్చి, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణ బాబు హాజరవుతారన్నారు. ఈ ధార్మిక కార్యక్రమం నిర్వహించుటకు తాము ఎవరి వద్దా ఎటువంటి రుసుము వసూలు చేయటము లేదన్నారు.

## ఉగాది ఉత్సవంలో రసవత్తరంగా మండల స్థాయి చదరంగం పోటీలు



**అచ్చుతాపురం , మార్చి 21 (మనసులో మాట) :** అచ్యుతాపురం,కొండకర్ల గ్రామంలో ఉగాది ఉత్సవంలో మండల స్థాయి చదరంగం పోటీలు రసవత్తరంగా ముగిశాయి. హేమాగ్ని ఆన్లైన్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్లలో విజయం సాధించిన ఆరుగురు తుది పోరుకు చేరుకున్నారు. ఈ తుదిపోరులో ప్రథమ స్థానంలో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన పి శ్రీనివాసరావు గారు, రెండవ స్థానంలో అనకాపల్లి కి చెందిన కే తేజ, మూడవ స్థానంలో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన పి నాగు గెలుపొందారు. అలాగే జూనియర్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచిన కే కౌశిక్ ప్రథమ స్థానంలోను బీ చైతన్య ద్వితీయ స్థానంను సాధించారు. పోటీలు నిర్వహించినటువంటి ఆర్గనైజర్ వసాది ఉదయభాస్కర్ మాట్లాడుతూ యువతలో ఈ పోటీలు ఒక ప్రేరేపణగా మారి మంచి క్రీడాకారులను అందించడానికి ఈ పోటీలు వేదికగా మారుతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఫోటీలను సమర్థిస్తూ మొదటి బహుమానంను కోట్ని శివ , రెండవ బహుమతి ఇరుగుల శ్రీనివాస్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి జై భీమ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కొండకర్ల కార్యవర్గం మరియు గ్రామ పెద్దలు గుబ్బల అప్పారావు, గుబ్బల ఈశ్వర రావు, సబ్బవరపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవ చేసిన జూనియర్ ప్రగడ నాగేశ్వరరావుకి డాక్టరేట్ ప్రధనం




**అచ్యుతాపురం , మార్చి 21 (మనసులో మాట) :** చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ,ఉ దేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, ఆధ్వర్యంలో, విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ లో. గౌరవ డాక్టరేట్ ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. సమాజ. సేవ చేస్తూ, కరోనా టైంలో, చేసిన సేవలను, గుర్తించి డాక్టరేట్ (సోషల్ సర్వీస్) ప్రగడ నాగేశ్వరరావు( జూనియర్) ఈ క్రింది వారి చేతుల మీదుగా. తీసుకోవడం జరిగింది. డాక్టర్ ఆమోస్ జేమ్స్ యూనివర్సిటీ. హెడ్, డాక్టర్ కలే లక్ష్మణరావు అడ్వకేట్, డాక్టర్ వై ఏ చిన్నారావు, చేయూత సోషల్ సర్వీస్ డైరెక్టర్, డాక్టర్ ఉమామహేశ్వరి మదర్ తెరిసా అవార్డు గ్రహీత స్కూల్ టీచర్, ప్రత్తిపాటి ప్రసాద్ చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్టేట్ డైరెక్టర్, రైట్ రెవరెండ్, బిస్సాప్ త్రిపాటి ఫ్రమ్ ఢిల్లీ యూనివర్సిటీ హెడ్, ప్రొఫెసర్ లీలావతి పాడేరు. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## వంట గ్యాస్ పంపిణీకి ఎటువంటి ఆటంకము లేకుండా సరఫరా : జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి

- వంటగ్యాస్ ఏజెన్సీలు, గోదాములు తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్




**విశాఖ సిటీ , మార్చి 21 (మనసులో మాట) :** వంట గ్యాస్ కొరత నైపధ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి గ్యాస్ ఏజెన్సీలు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌర సరఫరా అధికారి,డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రోలజి వారితో కలసి రఘురామ్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయములో, అప్లాండ్ హెచ్పి గ్యాస్ ఏజెన్సీ గోదాములలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ లో భాగంగా రఘురామ్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయములో వున్న వినియోగ దారులను సమయానికి సిలిండర్లు అందుతున్నాయా అని, గ్యాస్ సరఫరాలో ఏమైనా సమస్యలు వున్నాయని అడుగగా సదరు సమస్యలపై ఎటువంటి పర్యాదులు లేవని తెలుసుకున్నారు. రఘురామ్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులను వినియోగ దారులకు సమయానికి సిలిండర్లు అందుతు న్నాయా, ఏమైనా అవకతవకలు జరుగుతున్నాయా అనే అంశాలపై ఆన్లైన్ కంప్యూటర్ రికార్డులను క్షుణంగా పరిశీలించి, రఘురామ్ గ్యాప్ ఏజెన్సీ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. తదుపరి పరిశీలనలో భాగంగా అస్లాండ్ గ్యాస్ ఏజెన్సీ వారి గోదాములలో ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు, భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ, సరఫరా విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సిలిండర్ల నిల్వలో భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. జాయింట్ కలెక్టర్ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులకు గ్యాస్ పంపిణీ పై వచ్చిన ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఏవైనా లోపాలు గమనించిన పక్షంలో తక్షణమే సరిచేయాలని, లేని యెడల తగిన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. గ్యాస్ వినియోగ దారులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, గృహ వినియోగమునకు సంభందించిన వంట గ్యాస్ పంపిణీకి ఎటువంటి ఆటంకము లేకుండా సరఫరా చేయుటకు ప్రభుత్వం అన్నీ చర్యలు తెసుకొంటుందని, గృహ వినియోగమునకు సంభందించిన వంట గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని తెలిపారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## అరసం విజయనగరం జిల్లా శాఖ మహాసభలు

**- చాసో సమగ్ర సాహిత్యం పుస్తకావిష్కరణ**




**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతి నిధి మార్చ్ 21 :** అభ్యుదయ రచయితల సంఘం విజయనగరం జిల్లా శాఖ మహాసభలు "చాసో సాహితీ వేదిక" జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆది వారం ఉదయం నిర్వహించనున్నారు. ఈ కార్య క్రమంలో చాసో సమగ్ర సాహిత్యాన్ని అరసం పుస్తక రూపంలో ఆవిష్కరణ చేస్తుంది. ఈ కార్యక్రమానికి ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ కేఎస్ చలం అధ్యక్షులుగా, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత్రి, చాసో కుమార్తె చాగంటి కృష్ణ కుమారి ,అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ గ్రంధావిష్కరణ చేస్తారు. చాసో సాహిత్యం పుస్తకం ఆవిష్కరణ ఆవశ్యకతను రాష్ట్ర కార్యదర్శులు వల్లూరి శివప్రసాద్, కే.శరత్చంద్ర తెలియజేస్తాను. పుస్తక సమీక్షను జిల్లా అధ్యక్షులు జీఎస్ చలం చేస్తారు. సభను రత్నాల బాలకృష్ణ, బద్రి కూర్మారావు నిర్వహి స్తారు. చాసో సాహిత్యాన్ని, భావజాలాన్ని సేకరించి ముందు తరాలకి అందజేసిన వెలుగు రామి నాయుడిని ఈ సందర్భంగా అరసం సత్కరించు కుంటుంది. చాసో అభిమానులు, కవులు, రచయిత లు, సాహితీవేత్తలు, సాహితి మిత్రులు అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవల సిందిగా ఆహ్వానిస్తున్నాం.

## వేసవి దృశ్య పశుపక్షాదుల కోసం మంచినీటి తొట్టెలను ఏర్పాటు చేయండి

**శరీర అవయవ దాతలు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ**



**విజయనగరం , మార్చి 21 (మనసులో మాట) :** ఎండాకాలం కారణంగా పశుపక్షాదులకు దాహార్తిని తీర్చేందుకు ఇంటి దగ్గర లేదా ఇంటి పరిసర ప్రాంతాలలో చిన్న చిన్న మంచినీటి తొట్టెలను ఏర్పాటు చెయ్యాలని అఖిలభారత శరీర అవయ వదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,జనవిజ్ఞాన వేదిక జిల్లా ట్రెజరర్ షిణగం శివాజీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అఖిలభారత శరీర అవయవదాతల సంఘం,జనవిజ్ఞాన వేదిక,సత్య యుగ కాన్సిసిఎస్ పిరమిడ్ స్పిరిచువల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అనేక ప్రాంతాలలో పక్షులు నీళ్లు తాగేందుకు అవసరమైన సిమెంట్ తో తయారు చేసిన మంచినీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివాజీ,పిరమిడ్ స్పిరిచువల్ ట్రస్ట్ ప్రతినిధి చేకూరి సంతోష్ వర్మ మాట్లాడుతూ మానవజాతి మనుగడకు పశుపక్షాదులు అవసరం ఎంతో ఉందని,ఈ ప్రకృతిలో ప్రతి జీవికి మరో జీవితో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అవసరం ఉన్నందున ప్రతి ఒక్క జీవిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు వారి ఇండ్ల వద్ద పక్షుల కోసం నీళ్ల కుండీలు ఎందుకు ఏర్పాటు చేయాలో వివరించి,వారిని చైతన్య పరచాలన్నారు. వేసవి కాలమంతా కుండీలలో నీళ్లు ఉండేలా చూసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**చీడికాడ , మార్చి 21 (మనసులో మాట) :** గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేసిందని సర్పంచ్ గొర్లి గణేష్ అన్నారు మండలంలో చెట్టుపల్లి గ్రామంలో 20లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులును సర్పంచ్ గణేష్ శనివారం ప్రారంభించారు గ్రామంలో సీసి డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి 20 లక్షలు ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేశారు అన్నారు ఈ నిధులతో గ్రామంలో రోడ్లు డ్రైనేజీ అభివృద్ధి చెందుతాయి అన్నారు

# పారిశ్రామిక ప్రగతికి పునాది..పుర ప్రజలుకు ఆహ్వానం



**ఎస్.రాయవరం , మార్చి 21 (మనసులో మాట) :** ఈనెల 23 వతేది సోమ వారం నాడు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న స్టీల్ ప్లాంట్ శంఖుస్థాపన కార్య క్రమం లో ప్రజలుఅందరూ పాల్గొనాలని కోరుతూ మండలంలో పలు గ్రామా ల్లో కూటమి నాయుకులు కరపత్రాలు ప్రచారం చేప ట్టారు. నక్కపల్లి మండలం చందనాడ గ్రామంవద్ద ప్రతిష్టాత్మకమై అర్సెలార్ మిట్టల్ ఉక్కుపరిశ్రమ కుశంఖుస్థాపన చేసేందుకురాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్రమంత్రులు, కేంద్ర మంత్రులు, కేంద్ర ఉక్కుశాఖ అధికారులు పారిశ్రామిక ప్రగతికినాంధి పలికేందుకు హాజరు అవుతున్నందున అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలంటూ విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు ఇటింటా కర పత్రలును పంపిణీ చేసారు. తిమ్మా పురం, రేవు పోల వరం, సర్వసిద్ధి, ధర్మవరం తదితర గ్రామాల్లో కూటమి నేతలు ప్రజలను తరలిం చేందుకు విస్తృత ప్రచారం చేపట్టారు. రాష్ట్ర హోం శాఖమంత్రి వంగల పూడి అనిత కృషి తోజరు గుతున్న ఈ కార్య క్రమంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు.





## కలిసికట్టుగా పని చేద్దాం.. పార్టీని గెలిపించుకుందాం : మల్ల విజయ్ ప్రసాద్ పిలుపు



**మల్కాపురం , మార్చి 21 (మనసులో మాట) :** పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సమన్వ యకర్త మల్ల విజయప్రసాద్, నియోజకవర్గ పరిశీల కులు జహీర్ అహ్మద్ నేతృత్వంలో మాజీ కార్పొరే టర్లకు అభినందన సభ గాజువాక మింది గ్రామంలో వైయస్సార్సీపీ పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకు ని మాజీ వైసిపి కార్పొరేటర్లకు సన్మానిస్తూ, అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ జీవీఎంసీ, వైసిపి పార్టీకి చెందిన కార్పోరేటర్లుగా మంచి పనితీరును కనబరిచారని ఎన్నో కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మౌలిక సదుపా యాలు కల్పించారని, నిరంతరం కార్పొరేటర్లు ప్రజల మధ్య ఉంటూ ఇక్కడ ఉన్న ఏడు వార్డులను అభివృద్ధి పథంలో నడిపించారని ఆయన కొనియాడుతూ, రానున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ పార్టీని మరింత ముందుకు నడిపించి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలని, ఎన్నికల సమయానికి ఓట్ల గల్లంతు జరిగే అవకా శాలు ఎక్కువ ఉన్నాయని వాటి విషయంలో కార్యకర్తలతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా ఎంతో జాగ్రత్తతో వ్యవహ రించాలని, అదేవిధంగా పార్టీకి సేవలు అందించిన కార్యకర్తల కు గుర్తింపు ఉంటుందని, అటువంటివారిని అధిష్టానం నుంచి కూడా గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గులిగిందాల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, గులిగిందాల కృష్ణ,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్ల ధనలత, పిల్ల కన్నబాబు, పూండి మల్లేష్, బోగవెల్లి నాగభూషణం, పిలక రామ్మోహన్ రెడ్డి 62వ వార్డు అధ్యక్షులు జివిఎల్ నరేష్, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ధర్మ ప్రచారం నిమిత్తం రెండు వేల కుటుంబాలతో ధర్మ నిధి సేకరణ



**వి మాడుగుల , మార్చి 21 (మనసులో మాట) :** మాడుగుల దేవి ఆడిటోరియంలో భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రారంభించిన సమరసత సేవ ఫౌండేషన్ సేవలను గుర్తించి ఆ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న ధర్మ ప్రచారానికి అవసరమయ్యే ధర్మ నిది మాడుగుల మండలంలో 2000 కుటుంబాలు చే 2 లక్షల రూపాయలు నిధి ఏర్పాటు చేసి సంస్థ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ కు శనివారం అప్పగిం చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి సమరసత సేవ ఫౌండేషన్ ప్రతి పల్లెలోనూ దేవాలయ కేంద్రంగా ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందువుల్లో మంచి చైతన్యం తీసుకు వచ్చిందని, మతమార్పుల తో మోసపోతున్న పల్లె ప్రజలకు ధర్మంపై అవగాహన కల్పించి సనాతన ధర్మంపై చైతన్య వంతులు చేయడం జరుగుతుందని, టీటీడీ సహకారంతో ఎస్సీ ,ఎస్టీలకు దేవాలయాల నిర్మాణం చేసి వారికే అర్చక శిక్షణ ఇప్పించి వారు స్వయంగా దేవాలయాన్ని పోషించు కునే విధంగా కమిటీలు వేసి, అదే దేవాలయంలో బాల వికాస్ కేంద్రాల పేరుతో విద్యార్థుల ను సంస్కార వంతులను చేసే విధంగా కేంద్రాలు నడపడం గొప్పతనం అన్నారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారకు తవ్వా సన్యాసిశెట్టి ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో సమరసత సేవ ఫౌండేషన్ మండల గౌరవాధ్యక్షులు జల్లు సంజయ్ ,మండల కన్వీనర్ గౌరీపట్టపు మహేష్ కుమార్, పొట్ట బలరాం, మహిళా కన్వీనర్ చదలవాడ జయమ్మ, సహ కన్వీనర్ గొల్లవిల్లి సత్యారావు, సాధన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం

**- ఢిల్లీలో ముగిసిన 'ఆల్ ఇండియా ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్' సమావేశాలు**
**- పాల్గొన్న ఏపీ రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ రీమల నవభారత్**




**చింతపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** దేశవ్యాప్తంగా ఉన్న గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆల్ ఇండియా కాంగ్రెస్ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్' మరియు 'ట్రైబల్ ఎగ్జిక్యూటివ్' సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. న్యూఢిల్లీలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ ఎస్టీ సెల్ జాతీయ చైర్మన్ డాక్టర్ విక్రాంత్ భూరియా అధ్యక్షత వహించారు. ఈ భేటీకి చింతపల్లికి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ రీమల నవభారత్ హాజరై, రాష్ట్రంలోని గిరిజన సమస్యలను జాతీయ వేదికపై వినిపించారు. ఈ సందర్భంగా ఏపీ ఎస్టీ సెల్ చైర్మన్ రీమల నవభారత్ మాట్లాడుతూ..2020లో సుప్రీంకోర్టు తీర్పుతో జీవో నెం. 3 రద్దు కావడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గిరిజన నిరుద్యోగులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు దక్కాల్సిన రాజ్యాంగబద్ధమైన హక్కులు హరించుకుపోతున్నాయని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో భాగంగా సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ, జల్-జంగిల్-జమీన్ (నీరు-అడవి-భూమి) పై ఆదివాసీలకు ఉన్న హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ముందుంటుందని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గిరిజన సంస్కృతిని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొంది స్తామని పేర్కొన్నారు. ఈ రెండు రోజుల సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల ఎస్టీ సెల్ చైర్మన్లు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రాల మంత్రులు, మాజీ ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి రాష్ట్రం నుంచి వచ్చిన ప్రతినిధులు తమ ప్రాంతాల్లోని గిరిజన భూ సమస్యలు, విద్య, ఉపాధి అవకాశాలపై నివేదికలను కౌన్సిల్‌కు సమర్పించారు.




# అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**మెట్టపాలెంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**నర్సీపట్నం , మార్చి 21 (మనసులో మాట) :** నర్సీపట్నం మండలం మెట్టపాలెం పంచాయతీ నూతన భవనాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులు రూ. 43.60 లక్షలతో ఈ భవనాన్ని నిర్మిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లో భవనాన్ని ప్రారంభించి నిధులు ఇవ్వకుండా ఈ భవన నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేయగా, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేకంగా రూ. 22 లక్షలు మంజూరు చేసి పూర్తి చేశామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, తొలి ప్రాధాన్యతగా వైద్యరంగాన్ని అభివృద్ధి చేసి నర్సీపట్నం ఆసుపత్రిని జిల్లాలోనే నంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం రెండేళ్లలో సుమారు రూ. 425 కోట్లు తీసుకు వచ్చామని స్పీకర్ వెల్లడించారు. ఇప్పటికే 80 శాతం మేర రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణంలో భాగంగా మొదటి విడతగా మెట్టపాలెంలో ఐదు రోడ్ల నిర్మాణానికి రూ. 35 లక్షలు, రెండో విడతలో ఎనిమిది రోడ్లకు రూ. 30 లక్షలు కేటాయించినట్లు వివరించారు. అలాగే గ్రామాల్లో శ్మశాన వాటికల నిర్మాణానికి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ 60 పంచాయతీలకు నిధులు కేటాయించామని, ఇందులో మెట్టపాలెం, మొండికండి గ్రామాలకు రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేశా మన్నారు. తారు రోడ్ల విషయానికొస్తే మొండికండి నుంచి వేములపూడి వరకు రూ. 80 లక్షలు, అప్పన్నపాలెం నుంచి మెట్టపాలెం రోడ్డుకు రూ. 87 లక్షలు వెచ్చించామన్నారు. బుచ్చన్నపాలెం వద్ద వంతెన నిర్మాణా నికి రూ. 35 లక్షలు కేటాయించామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కేవలం నర్సీపట్నం మండలానికే ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ. 8.44 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు స్పీకర్ ఉద్ఘాటించారు. పంచాయతీల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో వేములపూడి, గబ్బాడ, ఎరకన్నపాలెం, దుగ్గాడ, మెట్టపాలెం గ్రామాలకు సమర్థులైన అధికారులను నియమించామన్నారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, తన స్నేహితుల సహకారంతో నర్సీపట్నం స్థానిక పెద్ద చెరువులో 108 అడుగుల శివపార్వతుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. రావణాపల్లి రిజర్వాయర్ నుంచి ఈ చెరువుకు నీరు వస్తుందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూకాలమ్మ పండుగను బ్రహ్మాండంగా నిర్వహించామని, రాబోయే 31, 1 తేదీల్లో జరిగే మరిడమ్మ పండుగను కూడా గ్రాండ్ గా నిర్వహించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన ఇంచార్జ్ సూర్యచంద్ర, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగ స్వామి, ఎమ్ పి టి సి బోళం రాంప్రసాద్, సర్పంచ్ కుంద్రపు అర్జున, పార్టీ మండలం ప్రెసిడెంట్ సుకల అప్పల నాయుడు, తాసిల్దార్ రామారావు, ఎండిఓ ఉషశ్రీ, డి ఈ ఈ పి ఆర్ ఈశ్వరరావు ఇతర అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## కవిత్వం విశ్వభాష : డాక్టర్ డివిజి శంకరరావు



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 21 :** కవిత్వం విశ్వభాష అని, మంచి కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేయవచ్చునని ప్రముఖ సాహితీవేత్త, రచయిత, పార్లమెంటు మాజీ సభ్యులు డాక్టర్ డివిజి శంకరరావు పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతాంజలి పాఠశాలలో నిర్వహిం చిన కవితోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ మంచి కవిత్వం చిరస్థాయిగా ఉంటుందని అన్నారు.తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ సమాజ హితవు కోరేదే సాహిత్యమని, తెలుగు సాహిత్యంలో కవితా ప్రక్రియ ఉత్కృష్టమైనదని, మంచి కవిత్వంతో మార్పు సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ముందుగా రచయిత కాగుపాటి నారాయణమూర్తి రాసిన భావ కవితా వీచికలు కవితాసంపుటిని గురు ప్రసాద్ తో కలిసి డాక్టర్ డివిజి శంకర్రావు ఆవిష్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జివి శ్రీనివాస్, డోకి చంద్రశేఖర్, దాసరి పద్మ, లింగాల నరసింగరావు, సాలూరి సంతోషి, పైడిరాజు, ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు తమ కవిత్వంతో అలరించారు. విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకులు ఆరికతోట సూర్య ప్రకాశరావు ఆంగ్లరచయితల సాహిత్యంలో గొప్పతనాన్ని వివరించారు. ఈ సమావేశంలో గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ ఎ.శ్రీనివాసరావు, డైరక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్

**: జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్**



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 21 :** జిల్లాలో రంజాన్ పండగ హిందూ- ముస్లిం సోదరుల మధ్య సోదర భావం పెల్లుబికి, పండగలో ఎటువంటి మత విద్వేషాలు, సంఘర్షలు, అల్లర్లు జరగకుండా రంజాన్ ప్రశాంత యుతంగా ముగిసినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, శని వారం తెలిపారు. ఈ సందర్భం గా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - రంజాన్ పర్వ దినాన జిల్లాలో ఎటువంటి మత ఘర్షణలు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన ముందస్తు భద్రత చర్యలు సత్ఫలి తాలిచ్చా యన్నారు. రంజాన్ పర్వదినాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తం గా అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీసు అధికారులు డ్రోన్ లతో పర్యవేక్షించారు. మసీదుల వద్ద ప్రార్ధనలకు విచ్చేసిన ముస్లిం సోదరులకు హిందూ సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. కొన్ని మసీదుల వద్ద హిందువులు, ముస్లింలు సోదర భావంతో ఒకరినొకరు అలింగనం చేసుకొని, శుభాకాంక్షలు తెలుపుకొన్నారన్నారు. పట్టణంలో ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్ లతో నిఘా ఏర్పాటు చేసి, ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరుల వాహనాల వలన ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారని తెలిపారు. భారత దేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనమని, రంజాన్ పండగ రోజున హిందూ-ముస్లిం సోదరులు ఒకరి సంస్కృతిని ఒకరు గౌరవించుకొంటూ, శుభాకాంక్షలు తెలుపుకొంటూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. రంజాన్ ముస్లింల పవిత్రమైన మాసమని, ప్రతీ రోజూ ఉపవాస దీక్ష చేస్తూ, ప్రార్ధనలు చేస్తూ, ముస్లిం సోదరులు తమ దాతృత్వాన్ని చాటుకుంటారన్నారు. ఈ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు తమకు ఆప్తులైన హిందువులను ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేయడం పరస్పర ఐక్యతకు, సమాజంలో శాంతి, సహనం, ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మసీదుల వద్ద సంబంధిత పోలీసు అధికారులు, సిఐలు భద్రత విధులు నిర్వహించగా, విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు మరియు చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు బందోబస్తు, భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## పిల్లల పౌష్టికాహారంపై గరికపాటి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్



**కంచరపాలెం , మార్చి 21 (మనసులో మాట) :** పిల్లల పౌష్టికాహారంపై గరికపాటి నరసింహారావు అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కే రమాప్రభ శనివారం తెలిపారు. ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి పాఠశాలల్లో పిల్లలకు ఇచ్చే కోడిగుడ్ల గురించి, వారి ఆహారపు అలవాట్ల గురించి చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవని ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండి, ధర్మ ప్రబోధాలు చేసే వ్యక్తి, పేద పిల్లల ఆకలిని, వారి ప్రాథమిక హక్కులను కించపరిచేలా మాట్లాడటం శోచనీయం అని తెలిపారు. భారతదేశంలో నేటికీ దాదాపు 35 నుండి 40 శాతం మంది పిల్లలు సరైన పౌష్టికాహారం అందక 'స్టంటింగ్' (వయసుకి తగ్గ ఎదుగుదల లేకపోవడం), 'వేస్టింగ్' (బరువు తక్కువగా ఉండటం) వంటి సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2025 ప్రకారం భారతదేశం 123 దేశాలలో 102 వ స్థానంలో ఆందోళనకరమైన స్థితిలో ఉందని ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత, హక్కు కాగా, దీన్ని హేళన చేయడం అంటే దేశ భవిష్యత్తును అవమానించడమే అని తెలిపారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగు దేశాలు కూడా ఆకలి సూచీలో మనకంటే మెరుగైన ర్యాంకుల్లో ఉన్నాయని అని గుర్తు చేశారు.

కాబట్టి, పిల్లలకు అందించే కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహారం అనేది కేవలం ఒక సౌకర్యం కాదని అది వారి ప్రాథమిక చట్టబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో భాగంగానే గౌరవప్రదమైన ఆహారం పొందే హక్కు కూడా ఉందని తెలిపారు. పీఎం పోషన్ పథకం కింద 10 కోట్లకు పైగా పాఠశాల పిల్లలు ప్రతిరోజూ పోషక భోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పోషకాలతో కూడిన ఆహారం అందించడం చట్టబద్ధమైన హక్కని, ఒక గుడ్డు కోసం పిల్లలు బడికి వస్తున్నారని మాట్లాడటం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ఆహారం తీసుకునే విధానం గురించి మాట్లాడుతూ, 'శోభనం రాత్రి పెళ్ళికొడుకు' వంటి అనైతిక, అసభ్యకరమైన పోలికలు తీసుకురావడం గరికపాటి విజ్ఞతకే వదిలేస్తున్నాం అని తెలిపారు. పిల్లల హక్కులను కించపరుస్తూ, వారి పేదరికాన్ని హేళన చేస్తూ మాట్లాడిన గరికపాటి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

## సబ్బవరంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు

**- దేశ పునర్నిర్మాణం కోసమే భారతీయ జనసంఘ ఆవిర్భావం**




**అనకావల్లి రూరల్ , మార్చి 21 (మనసులో మాట) :** దేశ పునః నిర్మాణం కోసమే భారతీయ జన సంఘం పార్టీని స్థాపించారని బిజెపి సీనియర్ నాయకులు పుట్ట గంగయ్య, పొలమరశెట్టి నాగేశ్వరరావు, ఓరిగంటి నాగమణి, పట్టాభి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సబ్బవరంలో బిజెపి మండల ముఖ్య నాయకులకు రెండు రోజుల పాటు దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులలో రానున్న కాలంలో బిజెపి పార్టీని ఏ విధంగా ముందుకు నడిపించాలి కార్యకర్తలు ఏ విధంగా వ్యవహరించాలి, కార్యకర్తల బాధ్యతలు అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల ఆశయాల మేరకు, నాటి దేశ పరిస్థితుల దృష్ట్యా, రాజకీయ పార్టీ స్థాపన అవసరం ఉందని భావించి జన సంఘను శ్యాం ప్రసాద్ ముఖర్జీ, దీన దయ ఉపాధ్యాయ, తదితరులు స్థాపించా లన్నారు. జనసంగ్ ఆధ్వర్యంలో మూడు ఎంపీ సీట్లు సాధించి, నేడు ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకుందన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పీవిఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొని దిశా నిర్దేశం చేశారు.రెండు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ తరగతులలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు శరగడం శంకర్రావు, రామానాయుడు, గొంప నర్సింగరావు, గొట్టివాడ సామ్రాట్ కుమార్,వనం సత్యనారాయణ, మండల స్వామి చక్రవర్తి, పెద్దిశెట్టి అప్పారావు, గొట్టివాడ ఝాన్సీ పాల్గొన్నారు.

## కొత్తవూరు సమస్యలు పరిష్కరించండి

- కొత్తవూరును వేధిస్తున్న పాఠశాల, తాగునీరు, మురుగు కాలువలు, రోడ్లు సమస్యలు
- పురిపాకలో విద్యార్థుల చదువులు
- గ్రామాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పార్వతీపురం , మార్చి 21 (మనసులో మాట) :** పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం మండలం, పెదమరికి పంచాయతీలో గల గిరిజన గ్రామం కొత్తవూరు కష్టాలను తీర్చాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు మంగల దాలి నాయుడు, ఓబిసి చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్ తదితరులు గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన కొమరాడ మండలం డంగభద్ర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర నిర్వహించారన్నారు. ఆ యాత్రలో గ్రామానికి చెందిన హిమరిక నూకమ్మ, మెలక రాధ, అద్దాకుల అమల తదితర గ్రామస్తులు తమ గ్రామాన్ని వేధిస్తున్న పలు సమస్యలను వైఎస్ షర్మిల రెడ్డి వద్ద మొరపెట్టుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ అధినేత ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. గ్రామంలో దాదాపు 3 వీధులకి ఇంటింటికి కొళాయి లేదన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థుల కోసం గ్రామస్తులే శ్రమదానం చేసి పులిపాకను నిర్మించుకున్నారన్నారు. ఆపురిపాక లోనే ప్రస్తుతం కొంతమంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఆ గ్రామానికి చదువుకునేందుకు బొడ్డవలస, రేవటిగూడ, పెళ్లిగుడ్డి, తమ్మన్నదొరవలస తదితర ఆంధ్ర ఒడిస్సా గ్రామాలకు చెందిన పిల్లలు చదువుకునేందుకు వస్తున్నారన్నారు. పాఠశాల గజనిర్మానం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రొఫైల్ నిర్మాణం లేకపోవడంతో పందులు కుక్కలు విద్యార్థులతో సహవాసం చేస్తున్నాయన్నారు. గ్రామస్తులు శ్రమదానం చేసి వెదురు కంపతో ఎలుగు ఏర్పాటు చేసుకున్నారన్నారు. దీంతోపాటు గ్రామంలో వాటర్ ట్యాంక్ లేక గిరిజనులు తాగునీటికీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గ్రామంలో పలుచోట్ల రోడ్లు, మురుగు కాలువల నిర్మాణము లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నచోట మురుగు కాలువలు మురుగుతో పేరుకుపోయి దోమలు ఈగలకు ఆవాసాలుగా మారాయి అన్నారు. వాటి వలన తరచూ అనారోగ్యానికి గురవుతున్నట్లు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. గ్రామ స్మశానానికి రహదారి సదుపాయం లేక మృతదేహాలను తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అలాగే పలువురి ఎల్ల నిర్మాణాలు కూడా నిలిచిపోయినట్లు తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కొత్తవూరు కష్టాలను తీర్చాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

## శృంగవరపుకోట లో చలివేంద్రం ప్రారంభం




**శృంగవరపుకోట , మార్చి 21 (మనసులో మాట) :** ఎస్.కోట: తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారి తనయుడు నారా దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరిం చుకుని ఎస్.కోట మండల కేంద్రంలో బీసెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు శ్రీమతి బీసెట్టి అరుణ గారు కేక్ కట్ చేసి దేవాన్ష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, ప్రస్తుతం పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఆమె ప్రత్యేకంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. నారా వారి వారసుడు దేవాన్ష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ, సేవే లక్ష్యంగా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిశెట్టి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు బిశెట్టి అరుణ, PACS చైర్మన్ గొర్రుపోటు సింహాచలం నాయుడు, ఆవీజ వైస్ చైర్మన్ తూర్పటి ఆదిబాబు, స్టేట్ దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ నానిగిరి రమనాజీ, గనివాడ బంగారు నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ పెదగాడి రాజు, ఆవీజ డైరెక్టర్ అనకాపల్లి చెల్లయ్య, ఐటీడీపీ స్టేట్ సెక్రటరీ చక్కా కిరణ్ కుమార్, పార్లమెంట్ సెక్రటరీ కాపుగంటి వాసు, మండల పార్టీ నాయకులు పొట్నూరు సాయి రామ్, సత్తిబాబు, బోనంగి జ్యోతి, సూరి అప్పారావు, కన్నతల్లి, మోహన్, గోపి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ శిక్షణా కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి

**- అమ్మ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు**




**నర్సీపట్నం రూరల్ , మార్చి 21 (మనసులో మాట) :** స్థానిక రామారావు పేట లో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీ అమ్మ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎస్ వరహాలు, కార్యదర్శి జయ కోరారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ నిర్వహిస్తున్న ర్యాంప్ ప్రోగ్రాం ద్వారా ఎంటర్ప్రైనర్ కమ్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 18 నుండి 45 సంవత్సరాల మహిళలకు, పురుషులకు 30 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. వ్యాపారవేత్తగా ఎదగాలని ఆశపడే వారికి ఈ శిక్షణ ద్వారా నైపుణ్యం, మెళకువలు అందిస్తామన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల స్త్రీ పురుషులతోపాటు ఎమ్ ఎల్ ఏస్, ఏబీఎమ్ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఈ శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ధృవపత్రాలు అందజేస్తామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉపాధి పనులు కల్పించాలి



**డుంబ్రిగుడ , మార్చి 21 (మనసులో మాట) :** కంద్రుమ్ పంచాయతీలో ఉపాధి పనులను వెంటనే కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

ఆ పంచాయతీలోని జాతర వలస గ్రామంలో శనివారం ఆయన సందర్శించి ఆ గ్రామంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు లేక సుదూర వైదన ప్రాంతాలైన కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, మైదాన ప్రాంతాల్లో వలసలు వెళుతున్నారని చెప్పారు. అక్కడ సరైన సౌకర్యాలు లేక గిరిజనులు నాన్న అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులను కల్పించి పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలీలకు రోజుకు కనీస వేతనం రూ 600 లు చెల్లించి, 200 రోజులు పని దినాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు కే రామచందర్, టి.పరన్న, కె మధునో, పరశురాం, గాసి ,గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నిర్మూలనకు 8వ విడత టీకా కార్యక్రమం ప్రారంభం



**రోలుగుంట , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం: కేంద్ర ప్రభుత్వం 2030 లోగా గాలికుంటు (గాళ్ళు లేదా జడుపు) వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం 8వ విడతలో భాగంగా పాడి పశువులకు గాళ్ళు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు విశాఖ డైరీ పాల కేంద్రం వద్ద ఉచితంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 76 పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు, పశుగణ సహాయకులు రాజేశ్వరి, గోపాలమిత్ర రాజు, సహాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మండలంలో సుమారు 10 వేల పశువులకు టీకాలు వేయేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక గ్రామంలో 80 శాతం పశువులకు టీకాలు వేయించినట్లయితే ఆ వ్యాధి ఆ గ్రామం నుంచి పూర్తిగా తొలగిపోతుంది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని గుర్తించి గౌరవ ప్రజాప్రతినిధులు, అభ్యుదయ రైతులు, పత్రికా ప్రతినిధులు తమ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించి, అందరూ పశువులకు టీకాలు వేయించుకోవాల ని పశుసంవర్ధక శాఖ, రోలుగుంట మండలం పిలుపునిచ్చింది.

## 23న సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- దేవరాపల్లిలో టిడిపి శ్రేణులు సమావేశం**



**దేవరాపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా పారిశ్రామిక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టానికి వేదిక కానున్న నక్కపల్లి స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ మెగా ప్రాజెక్టుకు ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్న నేపథ్యంలో కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా పార్టీ కార్యాచరణ రూపొందించింది. శనివారం రైవాడ జలాశయ అతిథి గృహం వద్ద రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి బోర్డు డైరెక్టర్, మండల టీడీపీ అబ్జర్వర్ తుడుము సుబ్బారావు పార్టీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర యువత తలరాతను మార్చే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడి ఇదని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఈ ప్రాజెక్టుకు మద్దతుగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేవరాపల్లి మండలం నుంచి సుమారు 400 మందికి తగ్గకుండా కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమానికి హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ ఆధ్వర్యంలో ఇప్పటికే వాహనాలు, రవాణా ఏర్పాట్లపై చర్చలు పూర్తయ్యాయని, గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బండారు రామారావు, బంధం అప్పలరాజు, గుల్లిపల్లి అర్జున, అల్లు అబద్ధం, సబ్బవరపు మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

## టమోటో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రయత్నిస్తా

**- టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్**



**అనకావల్లి ప్రతినిధి , మార్చి 21 (మనసులో మాట) :** టమోటో రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్ లో శనివారం అనకాపల్లి జిల్లా లోని టమాటా రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను రత్నాకర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా టమాటా రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదని, అనకాపల్లి మార్కెట్లో రైతులు తమ సరుకులు ఉంచడానికి, దించుకోవడానికి వీలు లేకుండా ఉందని, స్థానిక రైతుల నుండి టమాటా కొనకుండా ఇతర ప్రాంతాల రైతుల నుండి ఇక్కడ వర్తకులు కొనడం వలన స్థానిక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అలాగే టమాటాలు మార్కెట్లో అమ్ముకోవడానికి స్థలం సరిపోవడం లేదని అనకాపల్లి డిసిఎంఎస్ స్థలంలో అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ టమాటా రైతులు అందరూ విశాఖపట్నం, గాజువాక పట్టణాల్లో ఉన్న రైతు బజార్లలో ప్రత్యక్షంగా అమ్ముకోవడానికి వీలుగా అధికారుల తో మాట్లాడి పాసులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమస్యపై కాయగూరల మార్కెట్లో వర్తకులతో మాట్లాడడం జరుగుతుందని రత్నాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ దార్ల సంఘం కార్యవర్గ ప్రతినిధులు విల్లూరి రాము, కాంద్రేగుల విస్సు, విల్లూరి మాధవరావు, ఆళ్ల శ్రీను, కర్రి మోదీనాయుడు, కర్రి గుణ, బుద్ధ లక్ష్మణరావు, కర్రి గణేష్, సారిపల్లి లోకేష్, పోలిమేర శ్రీను, కొణతాల ఉమా మశ్వరరావు, కర్రి గంగాధర్, బుద్ధ గంగాధర్, రైతులు పాల్గొన్నారు

**27 న పెదరామస్వామి దేవాలయం లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం**

అనకాపల్లి గవరపాలెం శ్రీ పెదరామ స్వామి దేవస్థానంలో ఈనెల 27 న జరగబోయే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ పోస్టర్స్ ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆలయ కమిటీ సభ్యులు అవిష్కరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలు ఈనెల 25 నుంచి 29 వరకు అతి వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. 25 న స్వామివారి కళ్యాణ రాట వేయడం జరుగుతుందని తెలియజేశారు. 27 న ఉదయం స్వామివారికి పంచామృతాలతో అర్చన, అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే శ్రీరామచంద్రమూర్తి, సీతామహాలక్ష్మి అమ్మవార్లకు కళ్యాణ మహోత్సవం అతి వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. అదేరోజు మధ్యాహ్నం సుమారు పదివేల మందికి అన్నసమారాదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. 29 న సాయంత్రం నుంచి స్వామివారి ఊంజల సేవా కార్యక్రమం, కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మళ్ల రాజా, బొడ్డేడ శంకర్రావు, కర్రీ శివన్నారాయణ, కొణతాల అప్పలనాయుడు, కొణతాల గోపికృష్ణ, కర్రీ అప్పాజీ, మల్ల శ్రీను, కోరుబిల్లి ఆరుద్ర, కోరుభిల్లి పర్రి, పథకంశెట్టి శ్రీను, పెంటకోట చిన్న, పెంటకోట శివాజీ, కర్రీ భాను తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గణబాబు



**మల్కాపురం ,మార్చి 21 (మనసులో మాట) :** విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ గణబాబు శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీహరిపురం ప్రధాన రహదారి సమీపంలోని ఈద్గా మరియు ఖబ్రిస్థాన్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన ముస్లిం సమాజానికి పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాటాడుతూ, క్రమశిక్షణ, దాతృత్వం మరియు సోదరభావానికి రంజాన్ పండుగ ప్రతీక అని కొనియాడారు. నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, ఈ పవిత్ర రోజున అందరి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముస్లిం వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు గణబాబు ను సాదరంగా ఆహ్వానించి, ముస్లిం సమాజానికి ఆయన అందిస్తున్న నిరంతర సేవలకు గాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

## బైకులో చెలరేగిన మంటలు



**డుంబ్రిగుడ , మార్చి 21 (మనసులో మాట) :** గమ్యం చేరుకోవాలనే ఆకాంక్షతో బైకుతో స్వగ్రామా నికి బయలు దేరిన ద్విచక్ర వాహన చోదకుడికి బైకు నుంచి చెలరేగిన మంటలతో బిక్కి పడాల్సిన పరిస్థితి ఏర్పడింది దీనికి సంబంధించి కండ్రుం పంచాయతీ స్వర్ణయిగుడలోని పతలంగి గ్రామానికి చెందిన తాంగుల విష్ణు అనే గిరిజనుడి ద్విచక్ర వాహనంలోని వెనుక టైరు కాలం చెల్లింది. ద్విచక్ర వాహనదారుడు తన తమ్ముడు ద్వారా అరకులోయ మెకానిక్ దుకాణం లో టైరు మార్చి తీసుకురావాలని పంపించారు. టైరును మార్చిన తన తుమ్ముడు మరోకరుతో స్వగ్రామానికి బయలు దేరారు. మండల కేంద్రం డుంబ్రిగుడలోని గుంటసీమ కూడలికి చేరుకునే క్రమంలో బైకు నుంచి ఆకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. దుకాణదారుల ఎదురుగా బైకు ఇంజిన్లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమయ్యింది. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకొచ్చినా అప్పటికే పూర్తిగా కాలిపోయింది స్థానిక పోలీసులు దగ్ధమయిన బైకును పక్కకు తప్పించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

## ఏపీ జేఏసీ చైర్మన్‌గా చిట్టిబాబు

**- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక**





**చింతపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) చింతపల్లి తాలూకా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గిరిజన భవన్‌లో రాష్ట్ర, జిల్లా జేఏసీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎన్నికల ప్రక్రియలో చింతపల్లి తాలూకా జేఏసీ చైర్మన్‌గా బి. చిట్టిబాబు, జనరల్ సెక్రెటరీగా డి. శశి కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా జేఏసీ సెక్రెటరీ జనరల్ యు.వి. గిరి, కో–చైర్మన్ కుడుముల వెంకటరమణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సేవా శ్రీనివాసరావుల సమక్షంలో ఈ ఎన్నికల ఉత్కంఠ ముగిసింది.కార్యవర్గంలోని ఇతర కీలక పదవులకు కో–చైర్మన్లుగా జి. తిరుపతి బాబు, కే. సత్తిబాబు, వైస్ చైర్మన్లుగా ఎం. వీరయ్య దొర, పి.వి. రమణ, ఎల్. సురేష్ కుమార్, ఎం. కృష్ణమూర్తి, ఎస్. పవన్, ఆర్. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా పి. బాబురావు, జి. కనకయ్య, కే. చిరంజీవి, జి. నవమోహన్ బాధ్యతలు చేపట్టగా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కే. వెంకటేష్, ట్రెజరర్‌గా కే. బాబురావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బి. గంగరాజు, వి. తలుపులు, కే. మచ్చలింగం, ఎం. దేముడు, ఎల్. రామకృష్ణ, జి. మోహన్రావు, యు. మాణిక్యాలరావులను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బి. చిట్టిబాబు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జేఏసీ వేదికగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగుల హక్కులకు భంగం వాటిల్లిన ప్రతిసారి జేఏసీ పక్షాన బలమైన ఉద్యమాలు చేపడతామన్నారు. చింతపల్లి తాలూకాలోని అన్ని సంఘాలను సమన్వయం చేసుకుంటూ, కార్యవర్గ సభ్యుల సహకారంతో జేఏసీని మరింత బలోపేతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తనపై ఉంచిన విశ్వాసానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జేఏసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు



**డుంబ్రిగుడ , మార్చి 21 (మనసులో మాట) :** మండలంలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగింది. అరమ పంచాయతీ పరిడిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక మసీదులో ముస్లిం సోదరులతో అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొని రంజాన్ పర్వదిన వేడుకల్లో భాగస్వాములుగా నిలిచి ప్రత్యేక ప్రార్థనలో పాలుపంచుకున్నారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## పెద ఉప్పరగుడెంలో వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

**- వేములపూడి పంచాయతీ అభివృద్ధికి రూ. 4 కోట్లు : స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**నర్సీపట్నం , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ పరిధిలోని పెద ఉప్పరగుడెం గ్రామంలో భగీరథ వంశీకుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాములు, వినాయకుడు మరియు లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విచ్చేసి, స్వామివారికి తొలి పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న స్పీకర్ కు గ్రామస్థులు, మహిళలు మేళతాళాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ ఆలయం వద్దకు తోడ్కొని వెళ్లారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామ పెద్దలు స్పీకర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. గ్రామస్తులంతా ఐకమత్యంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి ఈ రామాలయాన్ని బ్రహ్మాండంగా నిర్మించుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని నాతవరం, వేములపూడి, అమలాపురం తదితర ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పెద ఉప్పరగుడెం గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, వేములపూడి నుంచి ఉప్పరగుడెం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ. 32 లక్షలు మంజూరు చేశామని వెల్లడించారు. అలాగే పొలాలకు వెళ్లేందుకు వీలుగా కాలువ పనుల కోసం రూ. 2 కోట్లు కేటాయించామన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ స్కూల్ భవనానికి రూ. 13 లక్షలు, అంగన్‌వాడీ భవనానికి రూ. 3 లక్షలు, వేములపూడి పంచాయతీకి మొత్తం రూ. 4 కోట్లు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. విద్యార్థినుల సౌకర్యార్థం వారు చదువుకోవడానికి వీలుగా ఆశ్రమ పాఠశాలలు (హాస్టల్స్) మంజూరు చేశామని, వేములపూడిలో కూడా 50 సెంట్ల స్థలంలో బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ ఊరి పేరును కూడా మార్చి కొత్త పేరును అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోలెం రాంప్రసాద్, జెడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, నక్క పెంటయ్య, నక్క రమణ, లచ్చుబాబు, జగ్గయ్య, రామాలయం గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న విశాఖ రేంజ్ ఐజి గోపినాథ్ జట్టి దంపతులు



**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 21 (మనసులో మాట) :** ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారిని శనివారం విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్,ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం**

శనివారం అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, శ్రీదేవి దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి విజయనాయుడు ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి విజయ్ నాయుడు ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, సహాయ కమిషనర్, ఆలయ ఈఓ యాళ్ల శ్రీధర్ ,ఆలయ ధర్మ కర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు,కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేషి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**జి.మాడుగుల , మార్చి 21 (మనసులో మాట) :** జి. మాడుగుల మండల కేంద్రంలో ఈనెల 25 నుండి 27 వరకు శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ ధర్మకర్త మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక రామాలయం వద్ద శనివారం నాడు శ్రీరామనవమి ఉత్సవ వాల్ పోస్టర్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ ఏడాది శ్రీరామనవమి సీతా రాముల కళ్యాణం 100వ కళ్యాణంగా జి.మాడుగుల లో జరుపబడుతుందని. భద్రాచలం శ్రీ రాముని కళ్యాణం జరిగే రీతిలో ఇక్కడ కూడా జరుగుతుందని ఈ కళ్యాణం లో వందమంది జంటలకు ఈ ఏడాది కళ్యాణం లో కూర్చోవచ్చునని అన్నారు. మూడు రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని అలాగే 27వ తారీఖున స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపు మేళ తాళాలు మంగళ వాయిద్యాలు గిరిజన సాంప్రదాయ దింసా నృత్యాలు కోలాటాలతో అంగరంగ వైభవంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస మత్స్యరాజు ప్రధాన కార్యదర్శి ఎంవిజి రాజు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఎం రామరాజు, సింహాచలం రాజు, లక్ష్మీపతి రాజు, జాయింట్ సెక్రెటరీ కె.వి రమణ, చుక్కల వెంకటరమణ, వడ్డాది శ్రీనివాసరావు, ఆతవ శ్రీను, రాము, ఎం నారాయణ రాజు, కే. కొత్తందొర,కోటేశ్వరరావు, తలారి మచ్చయ్య, ఆలయ పూజారి భాస్కర్ రావు (బి ఎస్ కే టైలర్) పాల్గొన్నారు.

## దేవరాపల్లిలో దంచికొట్టిన వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రోడ్లపై పొంగిపొర్లిన డ్రైనేజీ మురుగనీరు
- పోతదశ పంటలకు తీవ్ర నష్టం
- ఆందోళనలో రైతన్నలు



**దేవరాపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** మండల నలుమూలల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం సుమారు గంట వరకు వర్షం దంచికొట్టింది. ఉగాది నాటి నుంచి మూడు రోజులుగా సాయంత్రం పూట వర్షం కురుస్తుండడంతో రైవాడ జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి జలాశయంలోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. వర్షంతో పాటుగా ఈదురు గాలులు వీయడంతో పూతదశలో ఉన్న జీడి, మామిడి పంటలపై ప్రభావం పడుతోందని రైతుల ఆందోళన చెందుతున్నారు.ఈ వర్షానికి దేవరాపల్లి సీతంపేట, నాగయ్యపేట, కాశీపురం, ఏ. కొత్తపల్లి, చిననందిపల్లి, పెదనంది పల్లి తదితర గ్రామాలలో ఈ వర్షపు నీరుకు వీధులన్నీ జలమయమయ్యాయి. దీంతో డ్రైనేజీలలో నీరు కదలక వీధి రోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లింది. ఇది ఇలా ఉంటే, ప్రతిరోజు కురుస్తున్న వర్షంతో కాయగూరలు, అపరాల సాగు పండించిన రైతులకు ఈ వర్షం నష్టాన్ని మిగిల్చుతుందని రైతన్నల దిగులు చెందుతున్నారు.

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో రోజు గ్రామాలలో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో చాలా వరకు పల్లెలు చీకట్లోనే గడుపుతున్నాయి. సాధ్యమైనంత మేరకు విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించి విద్యుత్ సరఫరా అందిస్తున్నారు.

## నక్కపల్లిలో ఈ నెల 23న స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన

**- పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి రావాలని ప్రగడ నాగేశ్వరరావు పిలుపు**



**మునగపాక , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్న ఆర్ సి లాల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు ఈనెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్మించడానికి పార్టీ సమాయత్తం కావాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక మండలం నుండి అత్యధిక స్థాయిలో పార్టీ శ్రేణులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి తరలి రావాలని, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మునగపాక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు జరుగుతున్న అన్యాయంపై త్వరలోనే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి తెల్చుకోవడం జరుగుతుందని, కార్యకర్తలకు అన్యాయం జరిగితే అధికారులకు కనువిప్పు కలిగేలాగా



ఆందోళన చేసిన న్యాయం చేస్తానని, కార్యకర్తలంతా మనస్పర్ధలు వీడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టిడిపి పార్టీ పరిశీలకులు బోండా జగన్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులను అణగదొక్కే విధంగా వైసిపి నేతలతో చేట్టపట్టాలు చేస్తూ తెలుగుదేశం క్యాడర్ను నిర్వీర్యం చేయడానికి ప్రణాళిక రూపొందించారని, కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం త్వరలోనే ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ చిన్న, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, జిల్లా యాదవ సంక్షేమ సంఘం కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, పార్టీ నేతలు పెంటకోట శ్రీరామ్ మూర్తి, మల్ల వరహానరసింగరావు, మల్ల శేషు, మొల్లి అప్పలరాజు, ఆడారి జగన్నాథరావు, మద్దాల కృష్ణ , ఆడారి అబ్బాయి నాయుడు,ఉలింగల గోవిందా పలువురు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సేవాభావంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

**- ఎన్.సి.సి.విద్యార్థులతో మమేకమైన జిల్లా ఎస్పీ**



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 21 :** ఇటీవల శివరాత్రి పర్వదినంలో రామతీర్థం ఆలయంలో భక్తులను క్యూలైన్లలో పంపుటలో పోలీసుశాఖకు సహాయపడిన ఎన్.సి.సి. విద్యార్థులతో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మమేకమై, వారు పోలీసుశాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – విద్యార్థులు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో మెలగాలని, తమ ఉన్నతమైన భవిష్యత్తుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ ద్వారా సమాజానికి సేవలందిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకొంటే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునన్నారు. ఎన్‌సీసీ క్యాంపుల్లో చురుకుగా పాల్గొని, ఇతర రాష్ట్రాల విద్యార్థులతో మమేకమవడం ద్వారా వారి ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. భారతదేశం అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనమని, దేశంలో ఎన్నో భిన్న మతాలు, కులాలు ఉన్నప్పటికీ మనమంతా భారతీయులమనే భావనను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలో తాను కూడా ఎన్.సి.సి. విద్యార్థిగా క్యాంపులో చురుకుగా పాల్గొనేవాడినని గత స్మృతులను విద్యార్థులతో జిల్లా ఎస్పీ పంచుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రామతీర్థం, పుణ్యగిరి ఆలయాలలో భక్తుల క్యూలైన్ నిర్వహణలో ఎన్‌సీసీ విద్యార్థులు పోలీసు శాఖకు అందించిన సహకారాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. విద్యార్థుల సేవాభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరేందుకు ఇటువంటి ప్రశంసలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి సిఐ ఎ.వీ.లీలారావు, భోగాపురం రూరల్ సిఐ జీ.రామకృష్ణ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం సేవిద్దాం రమ్మని నగదు, సెల్ ఫోన్ దోపిడీ..ఐదుగురు అరెస్టు



**కంచరపాలెం , మార్చి 21 (మనసులో మాట) :** మద్యం సేవిద్దాం అని ఓ వ్యక్తిని పిలిచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, దాడి చేసి నగదు, సెల్ ఫోన్ దోచుకున్న ఐదుగురు నిందితులను ఎంవీపీ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వివరాలను శుక్రవారం సాయంత్రం సీ.ఐ వి. చక్రధరరావు పోలీస్ స్టేషన్లో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన సుగ్గు జగబంధు పైపింగ్ పనుల నిమిత్తం ఈ నెల 13న విశాఖ వచ్చారు. రైల్వే స్టేషన్ సమీపంలోని లాడ్జిలో దిగిన ఆయనకు అదే రోజు రాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు పరిచయమయ్యారు. వారు మరో ముగ్గురిని పరిచయం చేసి జగబంధుతో మద్యం, బిర్యానీ కొనిపించారు. అనంతరం వారంతా కలిసి మోటార్ సైకిళ్లపై జగబంధును పెద్దవాల్తేర్ శ్మశానం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అర్ధరాత్రి వరకు మద్యం సేవించిన తర్వాత నిందితులు జగబంధు సెల్‌ఫోన్ అడిగారు. అందుకు ఆయన నిరాకరించడంతో అతనిపై దాడి చేసి ఫోన్‌తో పాటు రూ. 10,000 నగదును బలవంతంగా లాక్కుని పరారయ్యారు. దీంతో బాధితుడు ఈ నెల 16న ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంవీపీ క్రైమ్ సీ.ఐ వి. చక్రధరరావు పర్యవేక్షణలో ఎంవీపీ క్రైమ్ ఎస్సై సిహెచ్. రామదాసు కేసు నమోదు చేసి తన సిబ్బందితో కలిసి నిందితులను గుర్తించారు. ఫోన్ లొకేషన్, ఇతర సాంకేతిక ఆధారాలతో ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా నిందితులు బాధితుడి ఫోన్‌లోని 'ఫోన్ పే' ద్వారా రూ. 73,000 డ్రా చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ. 36,000 నగదు, వన్ ప్లస్ మొబైల్, నేరానికి ఉపయోగించిన రెండు స్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో సుంకరి గౌతమ్ అలియాస్ పండు, కణ్ణన్ చందు అలియాస్ మిక్కీ, వంగర సాయి దినేష్, గుజ్జి నిశాంత్ రెడ్డి అలియాస్ బన్నీ, బొర జగదీష్ ఉన్నారు. వీరిపై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం, దోపిడీ వంటి కేసులు ఉన్నట్లు సీఐ చక్రధర్ రావు తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్సైలు రామదాసు, శ్రీనివాస రావు ఇతర సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## టిడిపి సీనియర్ నేతల రమణను పరామర్శించిన ప్రగడ నాగేశ్వరరావు



**మునగపాక , మార్చి 21 (మనసులో మాట) :** మునగపాక మండలం మల్లవరం గ్రామ శాఖ అధ్యక్షులు ఇందల రమణ కుమారుడు ఈ మధ్య కాలంలో అనారోగ్యానికి గురై మరణించడం జరిగింది. వారి కుటుంబాన్ని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ ప్రగడ నాగేశ్వరరావు , రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ కర్రి సాయి కృష్ణ , జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు అధ్యక్షుడు మల్ల శేషు ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరలకు శుభాకాంక్షలు

- ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర



**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి పట్టణంలో శనివారం ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర హాజరయ్యారు. రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరులుకు స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ సోదర సోదరీమణులకు "రంజాన్" పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం,దివ్య చింతనల కలయికే పవిత్ర రంజాన్ అన్నారు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ మాసంలో అత్యంత నిష్టగా నెల రోజుల పాటు చేసిన ఉపవాస దీక్షను ముగించుకుని ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకుంటున్న ముస్లిం సోదరులందరికీ ఈద్ ముబారక్. అందరి పైన అల్లా అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఇంటిల్లిపాదికీ ఈ రంజాన్ శుభాలను, ఆనందాలను పంచివ్వాలని కోరుకుంటున్నానన్నారు. రంజాన్ కానుకగా ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల కింద 45 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకుడు విడుదల చేసేరన్నారు. ఈ కార్యక్రమంలో జిలాని, షేక్ రియాజ్, అస్మత్,అన్సర్ ,రెహమాన్ ,నంద్యాల గణేష్,అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు


## దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో గిరిజన యువతకు వాలీబాల్ పంపిణీ



**కొయ్యూరు , మార్చి 21 (మనసులో మాట) :** గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని లక్ష్యంగా దుమంతి సత్యనారాయణ వాలీబాల్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఐక్యతతో, సంతోషంతో జీవిస్తూ ప్రతిరోజూ కనీసం ఒక గంటపాటు వాలీబాల్ ఆడాలని సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మంచి ఆలోచనలు పెంపొందుతాయని, సమాజంలో గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు.అలాగే త్వరలో విడుదల కానున్న ఉద్యోగ నియామక నోటిఫికేషన్ల దృష్ట్యా నిరుద్యోగ యువతకు డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ కూడా పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు.బూధరాళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని బాలరేవుల, పిడుగురాయి, నూకరాయి తోట, జువ్విరేవుల, లోయలపాలెం గ్రామాల యువతకు వాలీబాల్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దుమంతి రామకృష్ణ, తుచ్చ సలీం, ఐదు గ్రామాలకు చెందిన యువత హాజరయ్యారు.

## మునగపాక లో ఘనంగా రంజాన్ వేడుకలు

- ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు



**మునగపాక , మార్చి 21 (మనసులో మాట) :** మండల కేంద్రం మునగపాక ఆల్ నూర్ మజీద్ ప్రార్థన మందిరంలో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి ముస్లిం తో సోదరులంతా ఉదయం నుండే ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని తమ సోదర భావాన్ని చాటుకున్నారు.

రంజాన్ వేడుకల్లో భాగంగా 30 రోజులు ఉపవాస దీక్షలు చేసి అల్లా కరుణ కటాక్షాలు అందరికీ కలగాలని, పేదవారిపట్ల ప్రేమతో కరుణ తో వ్యవహరించాలని మజీద్ గురువు ఎస్ కే ఆదాం, ఎస్ కే సైపుల్ల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్కే రసూల్, ఎస్ కే ఇబ్రహీం, ఎస్ కే నాగూర్, ఎస్.కె రాము, ఎస్ కే సలీం పెద్ద ఎత్తున ముస్లిం సోదరీమణులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ కోసం ఈ ప్రాంత ప్రజలు త్యాగం మరువలేనిది : హోం మంత్రి" అనిత"

**నక్కపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** ఆర్ సి లాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను జీవితాంతం మర్చిపోలేని వారి త్యాగమే ఈరోజు ఈ ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం నక్కపల్లి మండలం లో ఉన్న మంత్రి నివాసం వద్ద విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ నక్కపల్లి మండలం టిడిపి కంచుకోటగా నిలిచిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ అందించే మండలంగా నక్కపల్లి ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి చరిత్రలో తన పేరు నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ కోసం నక్కపల్లి మండలంలోని అనేక గ్రామాల ప్రజలు చేసిన త్యాగాలను మంత్రి గుర్తుచేశారు. ఆ గ్రామాల ప్రజల త్యాగం మరువలేనిదని, రాష్ట్ర అభివృద్ధి కోసం వారు చేసిన సహకారం ప్రశంసనీయమని అన్నారు. వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. టాయ్ పార్క్ ఏర్పాటు ద్వారా సుమారు 20 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వెల్లడించారు. ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు పిలుపునిచ్చారు.



అడ్డురోడ్డులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కూడా సాధించామని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ స్థాపనతో నక్కపల్లి , పరిసర ప్రాంతాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని మంత్రి అనిత ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నక్కపల్లి ప్రాంతం ప్రపంచ పటంలో గుర్తింపు పొందుతోందని అన్నారు. ఈ సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవివర్మ ,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురం దాసు నూకరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి ,దార్ల కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ, జనసేన మండల శాఖ అధ్యక్షులు సుధాకర్, ఎంపిటిసి మెరుగు నాగేశ్వరరావు ,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయిన వెంకటరమణ ,మండల పార్టీ ఉపాధ్యక్షులు ఐనంపూడి అప్పలరాజు, పల్లా రాంబాబు తదితరులు ఉన్నారు.



## కమ్యూనిస్ట్ ల ద్వంద నీతి,ద్వంద వైఖరికి నిదర్శనం డొకులూరు లేట్ రైట్ క్వారీలు : ఆదివాసీ జెఏసి నేత రామరావుదొర

**గూడెం / సీలేరు , మార్చి 21 (మనసులో మాట) :** కమ్యూనిస్టులు బకులూరులో ఒక వైఖరి డొకులూరులో మరోవైఖరిని ప్రదర్శించడం కమ్యూనిస్ట్ ల ద్వంద నీతికి, ద్వంద వైఖరికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి జిల్లా చైర్మన్ రామరావుదొర తీవ్రస్థాయిలో మండిపడ్డారు.భారత కమ్యూనిస్ట్ పార్టీ(సిపిఐ)అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పేరుతో కొయ్యూరు మండలం బకులూరులో రంగురాళ్ళ క్వారీ (వజ్రాల క్వారీ)తవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్న విషయం విదితమే. జికె వీధి మండలం పెదవలస పంచాయతీ డొకులూరు గ్రామంలో ఎర్రమట్టి క్వారీ (లేటరైట్ క్వారీ) బుక్కరాజేంద్ర ప్రసాద్ పేరుతో తవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్న విషయం కూడా విదితమే.గత మూడు,నాలుగు నెలల నుండి బకులూరు రంగురాళ్ళ క్వారీ గురించి క్వారీకి వ్యతిరేకంగా బకులూరు గ్రామస్తులు పెద్ద ఎత్తున పోరాడుతుంటే సిపిఐ, సిపిఎం కామ్రేడ్లు ఎందుకు మాట్లాడటంలేదు.బకులూరు గ్రామస్తులపై బైండవర్ కేసులు పెట్టి క్వారీ తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతుంటే ఎర్రన్నలు ఎక్కడున్నారని, అదే విధంగా ఈనెల 4వ తారీకునా డొకులూరు లేటరైట్ క్వారీ తవ్వకం కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిగితే క్వారీ తవ్వడానికి వ్యతిరేకమంటూ సాక్షత్తు బకులూరు వజ్రాల క్వారీ అధినేత, సిపిఐ అల్లూరి సీతరామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలేపల్లి వెంకట రమణ, అల్లూరి సీతారామరాజు జిల్లా సిపిఐ జిల్లా స్థాయి నాయకులు హాజరయ్యారని, వారితో పాటు సిపిఎం జిల్లా నాయకులు బోనంగి చిన్నయ్య పడాల్, అంపురంగి బుజ్జిబాబులతో పాటు సిపిఎం నాయకులు హాజరయ్యారు.మరోవైపు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ లకు వ్యతిరేకంగా పోరాటం, బాక్సైట్ తవ్వితే సిపిఎం పార్టీ చూస్తూ ఊరుకోదు అంటూ టివి చానెల్స్ ఇంటర్వ్యూ లు ఇవ్వడం. ఇంత పెద్ద పోరాటాలు చేసే కమ్యూనిస్ట్ లు బకులూరు గ్రామంలో ఏం



జరుగుతుందో తెలుసుకోకపో వడమే మిటి. ఇదే ద్వంద వైఖరి,ఇదే ద్వంద నీతి జిఓ నెంబర్ 3 విషయంలో కమ్యూనిస్ట్ లు ప్రదర్శించారు.సిపిఎం అనుబంధ సంస్థ యూటిఎఫ్ ఆర్థిక సహాయంతో చేబ్రోలు లీలా ప్రసాద్ సుప్రీం కోర్ట్ వరకు వెళ్లి రద్దు చేయిస్తే అదే సిపిఎం అనుబంధ గిరిజన సంఘం జిఓ నెంబర్ 3 పునరుద్దరించలంటూ పోరాటం. వీరి పోరాటం ఏమి ఆరాటమో అర్థం చేసుకోవాలంటే పులిని చూసి నక్క వాతలు పెట్టుకొన్నట్లు అప్పటి వరకు ఉన్న గిరిజన సంఘం కాస్తా ఆదివాసీ గిరిజన సంఘంగా మారిపోయిందని దుయ్యబట్టారు.

## 23 న ముఖ్యమంత్రి చంద్రబాబు నక్కపల్లి పర్యటన ను విజయవంతం చేయాలి

### అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 21 (మనసులో మాట) :** ఈనెల 23 న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నక్కపల్లి పర్యటన ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయం లో శనివారం కూటమి పార్టీ ల ముఖ్య నాయకులు తో ఎమ్మెల్యే రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. సిఎం చంద్రబాబునాయుడు అనకాపల్లి జిల్లా నక్కపల్లి పర్యటన ను విజయవంతం చేయడానికి అందరు సహకరించాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమం లో ఏపీయుఎఫ్ఐడిసి చైర్మెన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, బత్తుల తాతయ్య బాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మెన్ మల్ల సురేంద్ర , డీసీఎంఎస్ చైర్మన్ కొట్ని బాలాజీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా డిహెచ్‌పిఎస్ రెండవ జిల్లా మహాసభ

**నర్సీపట్నం రూరల్ , మార్చి 21 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా దళిత హక్కుల పోరాట సమితి( డి హెచ్ పి ఎస్ ) రెండవ జిల్లా మహాసభ శనివారం నర్సీపట్నంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అభిద్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడనుండి శ్రీ కన్య సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కృష్ణా ప్యాలస్ లో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జేవి ప్రభాకర్ మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు తీవ్రంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఉత్తరాది రాష్ట్రాల్లో దళితుల సంస్కృతిపై తీవ్రమైన దాడి చేశారని అన్నారు. మన రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు రూపాయికి ఎకరం భూమి ఇస్తామంటున్నారని, ఇల్లు లేని నిరుపేదలకు స్థలాల గురించి మాట్లాడడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ, దళితులంతా ఐక్యంగా ఉద్యమించి మన హక్కులను సాధించుకోవాలని రాజ్యాంగాన్ని




కాపాడుకోవాలని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారల నిరోధక చట్టాన్ని నీరుగార్చి దళితులకు అన్యాయం చేసిందని అన్నారు. సనాతన ధర్మం పేరుతో మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగ స్థానంలో తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పండుతుందని అందులో భాగంగా రాజ్యాంగంపై చట్టసభలో సాక్షిగా పలు మార్లు దాడి జరిగిందన్నారు. జిల్లాలో దళిత కుల పోరాట సమితి బలోపేతం చేయడం ద్వారా దళిత వ్యతిరేక కార్యక్రమాలపై బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 39 మందితో జిల్లా కౌన్సిల్లో ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ డిసిహెచ్ రాజబాబు, జిల్లా అధ్యక్షులుగా వడలి శివ ప్రకాష్, జిల్లా కార్యదర్శిగా పెద్దాడ లవ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బందులు సుబ్బలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, దళిత పులి పోరాట సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ డి సి హెచ్ రాజబాబు జిల్లా కార్యదర్శి పెద్దలు లావరాజు, బీహెచ్కే సీనియర్ నాయకులు కొండప్పరావు , విశాఖపట్నం డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి రాంబాబు, డిహెచ్పిఎస్ వైస్ ప్రెసిడెంట్ వై పాపారావు, కేవీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఎమ్మార్పీఎస్ నాయకులు సతీష్, డీఎస్పీఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగరత్నం, కార్యదర్శిలు కార్యకర్తలు పాల్గొన్నారు.




## అడవి తల్లి బాట శంకుస్థాపనకే పరిమితం

### రహదారి నిర్మాణం నిలిచిపోవడంతో గ్రామస్తుల ఆవేదన

**హుకుంపేట , మార్చి 21 (మనసులో మాట) :** మండలంలోని దుర్గం పంచాయతీ గాలిపడు గ్రామంలో అడవి తల్లి బాట రహదారి నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమై, పనులు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. 21-12-2024న ఈ రహదారికి శంకుస్థాపన చేసి, సుమారు 2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2025 ఏప్రిల్‌లో కొంతమేర మట్టి తవ్వకం చేసి కేశర్ బుగ్గి వేసినప్పటికీ, ఆ తర్వాత పనులు ముందుకు సాగలేదు. "ఇదిగో, అదిగో" అంటూ అధికారులు





హామీలు ఇచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొదటిసారి తుఫాను కారణంగా రహదారి దెబ్బతినడంతో అధికారులు వచ్చి పరిశీలించి, కొంతమేర మరమ్మత్తులు చేసి వెళ్లిపోయారు. అనంతరం త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు రహదారి పూర్తిగా కొట్టుకుపోయి దారుణ స్థితికి చేరింది. దీంతో గ్రామస్తులకు రాకపోకలు, నిత్యావసరాల కోసం వెళ్లడం కష్టసాధ్యంగా మారింది. రోడ్డు పనులు ఎందుకు ఆగిపోయాయో తెలియక గ్రామ ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నామని వారు తెలిపారు. శంకుస్థాపన చేయడంలో చూపుతున్న శ్రద్ధ, పనులు పూర్తి చేయడంలో అధికారులు చూపడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

**దేవరాపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** మండలంలోని ముస్లిం సోదరులు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులంతా కాశీపురం మసీదుకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరిని ఒకరు అలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన నెల రోజులుగా ఉపవాసాలతో ఈ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అంతా



ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మనలోని సహనం, కరుణ, దానం, మానవత్వం వంటి గొప్ప విలువలను పెంపొందిస్తూ అందరికీ ప్రేరణగా నిలుస్తుందన్నారు.

## రైతు భరోసా డబ్బులు తీసుకునేందుకు రైతులు..కిటకిటలాడిన బీసీ కేంద్రాలు

**హుకుంపేట , మార్చి 21 (మనసులో మాట) :** మండల కేంద్రంలో పీఎం కిసాన్ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కావడంతో బీసీ (బ్యాంకింగ్ కారస్పాండెంట్) కేంద్రాలు శనివారం జనాలతో కిక్కిరిసిపోయాయి. ఉగాది సెలవు కారణంగా బ్యాంకులు మూసివేయబడడంతో రైతులు డబ్బులు ఉపసంహరించుకునేందుకు బీసీ కేంద్రాలను ఆశ్రయించారు. వారపు సంతకు వచ్చిన రైతులు ఖాతాల్లో జమ అయిన డబ్బులను తీసుకుని కూరగాయలు, నిత్యావసర సరుకు



లు కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. దీంతో మండల కేంద్రంలోని బీసీ పాయింట్ల వద్ద భారీగా రద్దీ నెలకొంది. బ్యాంక్ ఆఫ్ బరోడా సహా ఇతర బ్యాంకులు సెలవు కారణంగా పనిచేయకపోవడంతో, రైతులు ఎక్కువగా బీసీల వద్దనే నగదు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బీసీ కేంద్రాలు జనాలతో కిటకిటలాడుతూ కనిపించాయి.

## శ్రీ భద్రావతి సమేత భావనా రుషి స్వామివారి కల్యాణం మహోత్సవంలో పాల్గొన్న ప్రగడ



**అచ్యుతాపురం , మార్చి 21 (మనసులో మాట) :** దుప్పితూరు గ్రామంలో వేంచేసి యున్న పద్మశాలి కుల ఆరాధ్య దైవం అయిన శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామివారి కల్యాణం మహోత్సవం సందర్భంగా,ఈ యొక్క కార్యక్రమం పద్మశాలి కులభాందువులు మరియు దేవాలయం చైర్మన్ మాడెం సూరి అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది,20 వ తేదీ ఉదయం 6 గంటల నుంచి స్వామి వార్లు వేదపండితలు తో, పూజలు కళ్యాణం జరిగింది, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన ఘనంగా నిర్వహించడం జరిగింది,దుప్పితూరు గ్రామంలో పెద్దలు,రాష్ట్ర రోడ్లు కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు ,సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు,దేశంశెట్టి ఈశ్వరావు,మాజీ సర్పంచ్ దేశంశెట్టి పైడియ్యనాయుడు, మాజీ సర్పంచ్ ప్రగడ రాము సత్యనారాయణ దంపతులు వారి కుమారులు ప్రగడ నాగేశ్వరావు టజూనియర్ఈ, ప్రగడ ఈశ్వరరావు,అలాగే శెట్టి చిరంజీవి దంపతులు,శెట్టి అప్పారావు పిఎసిఎస్ అధ్యక్షులు దేశంశెట్టి వెంకటరమణ,మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, దేశంశెట్టి త్రినాధ్,మాడెం ఈశ్వరావు, అముదూరి అప్పలరాజు, వానపల్లి వెంకటరమణ, శేశెట్టి రాంబాబు పాల్గొన్నారు.. సాయంత్రం 6.00 గంటలు నుండి తెల్లవారిజాము 12,30 గం,, గంటల వరకు కూడా స్వామివారికి పూజా కార్యక్రమాలు అలాగే తప్పుడు గుళ్ళు, తాడు పెద్ద సేవలు అలాగే, కోలాటాలు సంస్కృతి కార్యక్రమాలు, మరియు భారీగా స్వామి వారి ఊరేగింపు జరిగింది యొక్క కార్యక్రమానికి అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల నుంచి భారీగా పద్మశాలి కుల బంధువులు హాజరు కావడం జరిగింది అదేవిధంగా విశాఖపట్నం శ్రీకాకుళం విజయనగరం ప్రాంతాల నుంచి మరియు కుల పెద్దలు భారీ సంఖ్యలో హాజరై స్వామి వార్లు కల్యాణంలో తెల్లవారే వరకు కూడా స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ పప్పు రాజారావు అదేవిధంగా కట్ట రామారావు పద్మశాలి సంఘం నాయకులు మరియు సింహాచలం దేవస్థానం మాజీ బోర్డు డైరెక్టర్ సూరిశెట్టి సూరిబాబు,పంపాన సత్యనారాయణ, తిప్పన అప్పారావు సూరిశెట్టి ఋషి బాబు , కట్టా రామారావు, విజయనగరం జిల్లా నాలి అప్పారావు,కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దోనెలపాలెంలో పోలీసులు అవగాహనా కార్యక్రమం

**రాజవొమ్మంగి , మార్చి 21 (మనసులో మాట) :** మండలంలోని జడ్డంగి స్టేషన్ పరిధిలో దోనెలపాలెం గ్రామంలో జడ్డంగి పోలీసులు గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై చిన్నబాబు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో సమావేశమై గంజాయి, అక్రమ మద్యం (సారా) వినియోగం మరియు రవాణా వల్ల కలిగే నష్టాల పై ఎస్ఐ చిన్నబాబు అవగాహన కల్పించారు.గంజాయి మరియు సారా వంటి అక్రమ కార్యకలాపాలు వ్యక్తుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలు విచ్ఛిన్నమై మరియు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ, అపరిచితుల ఫోన్ కాల్స్, ఓటీపీ లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే మోసపూరిత లింకులు మరియు సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేశారు. గ్రామంలోని యువతను సన్మార్గంలో నడిపించేందుకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువు మరియు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలనికోరారు. అలానే జడ్డంగి సెంటర్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీ కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వాహనదారులపై ఎస్ఐ చిన్నబాబు జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం, మోటార్ వాహన చట్టం ఉల్లంఘనలు వంటి అంశాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు వేయడం జరిగింది. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారిం చడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియచేసిన పల్లా శ్రీనివాస్

**గాజువాక , మార్చి 21 (మనసులో మాట) :** బిసి రోడ్ ఈద్గా మైదానంలో గాజువాక ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వమత సమైక్యతకు నిదర్శనం గాజువాక ప్రాంతమని అందరూ కలిసికట్టుగా అన్ని పండగలు చేసుకోవడం గాజువాకలో మంచి వాతావరణమని కూటమి ప్రభుత్వంలో ముస్లిం ల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మసీదు ఇమాములకు మౌజనులకు బకాయి ఉన్న జీతం ఇఫ్తార్ విందులో 45 కోట్ల రూపాయలు విడుదల చేశారని సూపర్ సిక్స్ లో భాగంగా ముస్లిం ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని మసీదులకు ఈద్గాలకు దర్గాల నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఉర్దూ అకాడమీ అభివృద్ధికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కి చాలా ఎక్కువ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వమని చెప్పారు ఈ కార్యక్రమంలో 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, అజిమాబాద్ సున్ని జామా మసీదు, ముత్తవల్లి,మదిన వల్లి,ఆన్సర్ వల్లి,మోతి ఇషాక్,హాజీ అమీర్ జబ్బర్, మదీనా మసీదు నుంచి రజివుల్లా షౌకత్ అలీ ఆరిఫ్, గౌసియా మసీదు నుండి రెహమాన్ లుక్మాన్ మరియు ఇమ్రాన్ గౌస్ మరియు యూత్ కమిటీలు, అంజుమనే సిరతు నబి నూర్ పార్టీ,అంజుమనే గౌస్ పార్టీ, మదీనా పార్టీ,గౌసియా నౌ జవాన్ సొసైటీ,రాజా పార్టీ,కాజా గరీబ్ నమాజ్ పార్టీ ముస్లిం యూత్ వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొని ఈద్గా మైదానంలో ప్రపంచం శాంతి గురించి నమాజ్ ప్రార్థనలు జరిపారు. ఈద్గా మైదానంలో ఈద్ నమాజ్, అజీమాబా సున్ని జామా మసీదు,ఇమామ్ షాకీర్ నమాజ్ చదివించారు

## ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నేతను పరామర్శించిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

**నర్సీపట్నం రూరల్ , మార్చి 21 (మననులో మాట) :** నర్సీపట్నం పినారిపాలెంకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు గరగా శ్రీను గత నెలలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆయన రెండు కాళ్లు కోల్పోయి చికిత్స అనంతరం ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ గరగా శ్రీను నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ, ప్రమాదంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, అయినా ధైర్యంగా ఉండాలన్నారు. గరగా శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని



భరోసా ఇచ్చారు. పార్టీ తరపున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఆయనకు కృత్రిమ కాళ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీను ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని వార్డ్ టీడీపీ ఇన్చార్జి లాలం మురళీకృష్ణ ను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకుడు లాలం మురళీకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి వేతన దారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

**ఎన్ రాయవరం , మార్చి 21 (మనసులో మాట) :** ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం గ్రామంలోని వి బి జి రామ్ జి పథకం వేతనదారులకు శనివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రేవు పోలవరం గ్రామంలోని ఉపాధి పనుల్లో పాల్గొంటున్న సుమారు 200 మంది వేతనదారులకు స్థానిక తెలుగుదేశం పార్టీ ఎస్. రాయవరం మండలం యూత్ అధ్యక్షుడు కోడా లోవరాజు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వేతనదారులకు మజ్జిగ పంపిణీ చేసినట్టు లోవరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా హుకుంపేటలో రంజాన్ వేడుకలు

**హుకుంపేట , మార్చి 21 (మనసులో మాట) :** మండల కేంద్రంలోని స్థానిక మసీదులో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరు లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ప్రార్థించారు. రంజాన్ నెల అంతా ఉపవాస దీక్షలు పాటించిన విశ్వాసులు, ఈద్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మసీదు ప్రాంగణంలో ప్రార్థనలు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శు



భాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక ఐక్యతకు ప్రతీకగా ఈ వేడుకలు నిలిచాయని నిర్వాహకులు తెలిపారు

## గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్ మరొకరు పరారు

**రావికమతం , మార్చి 21 (మనసులో మాట) :** ఏజెన్సీ ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 22కేజీల గంజాయి, 1000నగదు 2సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసామని కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. దొండపూడి చెక్ పోస్ట్ వద్ద తమ సిబ్బందితో శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న నేపథ్యంలో ఏ ప్రాంతంలో ఉన్న ర ఇద్దరు వ్యక్తులు తమను చూసి బ్యాగ్ లు వదిలి పారిపోతున్నారని చెప్పారు సిబ్బంది వెళ్ళి వెంబడించగా నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన వ్యక్తి పట్టు బడ్డారని తెలిపారు అతని సమక్షంలో బ్యాగ్ పరిశీలించగా గంజాయి తో పాటు బంగారు వస్తువులు ఉన్నాయన్నారు దీంతో. ఆ వ్యక్తిని స్టేషన్ కు తీసుకు వచ్చి విచారణ చేయగా నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన వ్యక్తిగా



తెలిసిందన్నారు . ఇతనిపై గతంలో సీలేరు, నాయుడుపేట, పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులోనూ, రోలుగుంట స్టేషన్ పరిధిలో బంగారు వస్తువులు చోరీ కేసు లోనూ నిందితుడు అన్నారు, పారిపోయిన మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు.

### హిందూ సంఘాల ఆధ్వర్యంలో

## సద్భావనా సదస్సు..పాల్గొన్న కేఎన్ఆర్, శ్రీరాం

**గాజువాక , మార్చి 21 (మనసులో మాట) :** గాజువాక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో సద్భావనా సదస్సు జరిగింది. గాజువాక నగరంలో వున్న హిందూ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. మొదట భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య వక్తగా శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసారు. కులాల వారీగా విడిపోకుండా ఉండాలని సూచించారు. మత మార్పిళ్లను అరికట్టాలని కోరారు. గతంలో ఎవరైనా మతం మారితే వారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకురావాలని సూచిం చారు. సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరారు.



కార్యక్రమంలో అఖిల భారత కాపు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు,మానవతా సంఘం అధ్యక్షులు కృష్ణంరాజు, పాతకర్నవానిపాలెం రామాలయ కమిటీ అధ్యక్షుడు సిరసపల్లి అప్పారావు, శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు కొండలరావు, గోపాలకృష్ణ, కేటిబి కోలనీ అధ్యక్షుడు ప్రభాకరరావు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, కార్యదర్శి మద్ది కృష్ణారెడ్డి,భవానీ,ప్లీడర్ నాయుడు,డాక్టర్ శేషప్రసాద్ ,లీలాకృష్ణ ,అప్పారావు,శ్రీను,పలువురు కుల పెద్దలు ,భజన,ఆలయ కమిటీ,హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముస్లింలకు కూటమి ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదు

### - కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు హైదర్ ఆలీ సింకా

**కంచరపాలెం , మార్చి 21 (మనసులో మాట) :** ముస్లింలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కూటమి ప్రభుత్వం కల్పించడం లేదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు హైదర్ ఆలీ సింకా ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా శనివారం గొల్లలపాలెం, ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ముస్లిం సోదరుల నమాజ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారిన ముస్లిం సోదరులకు నమాజ్ చేసుకోవడానికి నగరంలో సరైన స్థలం లేదన్నారు. అలాగే చనిపోయిన తర్వాత పూడ్చడానికి కూడా స్థలం లేకపోవడం బాధాకరం అని తెలిపారు. గత ప్రభుత్వం ముస్లింలకు చెందిన వక్ఫ్ భూములు ఉపయోగించే ప్రయత్నం చేయకపోగా, వాటిని లాక్కునే ప్రయత్నం చేసిందని విమర్శించారు.



దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ముస్లింలకు నమాజ్ చేసుకోవడానికి స్థలాన్ని, కబరస్తాన్ కి ఒక స్థలాన్ని కేటాయించాలని కోరారు. రంజాన్ మాసంలో అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరానపై దాడి చేయడం, వేలమంది ముస్లిం సోదరులకు రంజాన్ మాసంలో దాడులు చేసి చంపడం దారుణమని చెబుతూ ఖండించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అందరూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## రైలులో ప్రయాణిస్తున్న వారి ల్యాప్‌టాప్‌లు, నగదు తస్కరిస్తున్న పాత నేరస్తుని అరెస్టు

**కంచరపాలెం , మార్చి 21 (మననులో మాట) :** రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లు, నగదు తస్కరిస్తున్న పాత నేరస్థుడిని జిఆర్పి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మూడు ల్యాప్‌టాప్‌లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. జిఆర్పి పోలీసులు శనివారం అందించిన వివరాల మేరకు, జిఆర్పి, ఆర్‌పిఎఫ్ సిబ్బంది సంయుక్తంగా సోమవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కాకినాడ జిల్లాకు చెందిన అనంత దుర్గారావు (27) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి వద్ద జరిపిన తనిఖీల్లో సుమారు రూ. 50,000 విలువ గల మూడు ల్యాప్‌టాప్‌లు, రూ. 20,000 లు నగదు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో



హాజరుపరిచారు. నిందితుడు గతంలో కూడా వివిధ రైల్వే పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ల్యాప్‌టాప్ దొంగతనాల కేసుల్లో నేరస్తుడిగా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. రైలు ప్రయాణికులు తమ విలువైన వస్తువుల పట్ల, ముఖ్యంగా ల్యాప్‌టాప్‌లు, నగదు విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని జి ఆర్ పి సిఐ ధనంజయ నాయుడు సూచించారు. ప్రయాణ సమయంలో గానీ, స్టేషన్ పరిసరాల్లో గానీ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం

### - రూ. 25 వేల విరాళం అందజేసిన జనసేన నాయకుడు అప్పన దొరబాబు

**నర్సీపట్నం , మార్చి 21 (మనసులో మాట) :** నర్సీపట్నం పట్టణం పాత సంతబయలు 4వ వార్డులో వెలసిన రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అప్పన ఎన్ ఎస్ జి దొరబాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, మరియు కార్యక్రమ నిర్వహణకు తన వంతు సహకారంగా రూ. 25 వేల రూపాయల విరాళాన్ని ప్రకటించి చెక్కును 4వ వార్డు రామాలయ కమిటీ పెద్దలకు అందజేశారు. ఈ



కార్యక్రమంలో జనసేన టౌన్ నాయకులు అద్దేపల్లి గణేష్, కొప్పాక కళ్యాణ్ సూరకాసుల గోపి, నానీజీ, మారిశెట్టి రాజా, పోతల గణేష్, జనసైనికులు, వార్డు ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

**నక్కపల్లి , మార్చి 21 (మనసులో మాట) :** మండలంలోని ముస్లిం గ్రామాల్లో అతి పవిత్రమైన రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించి ఒకరు ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించి ఉదయం నుంచి దర్గాల వద్దకు చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు ముగించి ప్రత్యేక ప్రార్థన చేశారు. మండలంలోని పెద్ద బోధి గల్లం వద్ద ఉన్న ఈద్గా వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుకొని ప్రార్థన చేశారు. పెద్ద ఎత్తున యువకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మజ్జిగను పంపిణీ చేశారు.





KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
ఆదివారం 22 మార్చి 2026


# పేరుకే 'చిన్న'జగ్గంపేట..
# చేసేవన్నీ 'పెద్ద' వ్యవహారాలే!..

## - సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో ఆగిన మట్టి తవ్వకాలు!



**పిఠాపురం (మనసులో మాట) మార్చి 21:** గొల్లప్రోలు మండలంలోని చిన్నజగ్గంపేట గ్రామంలో గత వారం రోజులుగా సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాల ఉదంతం చూస్తుంటే.. "పేరుకే చిన్న జగ్గంపేట.. కానీ ఇక్కడ జరిగే దందాలన్నీ పెద్ద వ్యవహారాలే" అన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే ఇంత బహిరంగంగా మట్టి మాఫియా చెలరేగిపోతుందంటే, ఇక్కడ అధికారుల తీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు మండిపడుతున్నారు.

**సోషల్ మీడియా దెబ్బకు బ్రేక్!**

గ్రామంలో రోడ్ల నిర్మాణానికి మట్టి, గ్రావల్ అవసరమనే సాకుతో.. అధికార, ప్రతిపక్షాలకు చెందిన 'మూడు పార్టీల' నేతలు ఏకమై సాగిస్తున్న ఈ దందాకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా జెసిబిలతో భూగర్భాన్ని తొలిచేస్తూ, ట్రాక్టర్లు, లారీల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించాయి. ఈ వ్యవహారం రచ్చకెక్కడంతో భయాందోళనకు గురైన నిర్వాహకులు ప్రస్తుతం తవ్వకాలను నిలిపివేశారు. అయితే, ఇంత బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున రాజకీయ ముడుపులు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**ఫిర్యాదు చేస్తే అణచివేత.. సొంత పార్టీ నేతపైనే ఒత్తిడి**

ఈ అక్రమ దందాను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన ఒక అధికార పార్టీ నేతపైనే ఇప్పుడు ఒత్తిడి పర్వం సాగుతోంది. "వాళ్లు తవ్వుకుని అమ్ముకుంటే నీకేంటి?" అనే చందాన తోటి నాయకులే సదరు వ్యక్తిని అడ్డుకుంటూ, నిలదీసిన వ్యక్తిని ఒంటరిని చేసే ప్రయత్నం చేస్తున్నారు. పారదర్శకమైన పాలన అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పాత పద్ధతుల్లోనే మట్టి దోపిడీ సాగుతుండటం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తవ్వకాలు ఆగిపోయినంత మాత్రాన సరిపెట్టకుండా, ఇప్పటివరకు జరిగిన దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే జెసిబి సహ పలు ట్రాక్టర్లను స్వాధీన పరుచుకున్నారు.

అమ్ముకున్న మట్టికి సంబంధించిన సొమ్ము మొత్తాన్ని సదరు వ్యక్తుల నుండి రెవెన్యూ అధికారులు రికవరీ చేసి పంచాయతీ ఎకౌంట్ లో జమ చేయాలని ప్రజలు కోరుతున్నారు..





## పోలవరం జిల్లా కలెక్టర్ గా కే.దినేష్ కుమార్

**ఎటపాక/ రంపచోడవరం ( మనసులో మాట) 21:** నూతనంగా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటైన పోలవరం జిల్లా కి మొదటి కలెక్టర్ గా కె.దినేష్ కుమార్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏజెన్సీ లోని రంపచోడవరం కేంద్రంగా 11 మండలాలను కలుపుతూ పోలవరం జిల్లాను ప్రకటించినప్పటి నుండి అల్లూరి జిల్లా కలెక్టర్ ఇన్చార్జ్ గా ఉన్నారు.కాగా శాశ్వత కలెక్టర్ గా ప్రభుత్వం పోలవరం జిల్లాకు నియమించడం పట్ల ఏజెన్సీ ప్రాంత ప్రజలు వారికున్న సమస్యలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం దొరుకుతుందని జిల్లా వాసులు ఆశ వాహం వ్యక్తం చేశారు. 2017 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన దినేష్ కుమార్ ప్రస్తుతం ఆయుష్ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ గా పనిచేశారు.

## కాకినాడ లో మార్చి 23న పీజీఆర్ఎస్ / రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు

- ప్రజా సమస్యల పరిష్కారానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి
- కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** కాకినాడ కలెక్టరేట్ లో మార్చి 23వ తేదిన సోమవారం జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీ ఆర్ఎస్) , రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలను అనివార్య కారణాలవల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా కలెక్టర్ సందర్భంగా కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 కాల్ సెంటర్ సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమస్యలు, ఫిర్యాదులను 1100 కాల్ సెంటర్ ద్వారా నమోదు చేయవచ్చుని, పరిష్కార స్థాయి తెలుసుకునే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ముస్లిం మైనార్టీ అభివృద్ధి, సంక్షేమానికి
# కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ముస్లిం సోదర, సోదరీమణులు భక్తి,శ్రద్ధలతో ఆత్మను శుద్ధి చేసుకుంటూ పేదలకు దాన ధర్మాలను చెయ్యడం పవిత్ర రంజాన్ మాసం ప్రతీక
- ఈద్గాలో పాల్గొని పార్థనలు చేసి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియ జేసిన మంత్రి
- రంజాన్ ముందే స్వంత నగదుతో సుమారు రూ 15 లక్షలతో రంజాన్ కానుకలు అందజేశాము - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ...



**ఏలూరు/నూజివీడు, మార్చి 21 (మనసులో మాట)..** నూజివీడు పట్టణంలో రంజాన్ సంధర్భంగా ఈద్గాలో శనివారం ముస్లీం సోదర, సోదరీమణులతో కలిసి ప్రత్యేక పార్ధనలు చేసి పేరు పేరునా పలకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, ప్రేమతో మంత్రి ఆలింగనం చేసుకున్నారు. అనంతరం పేద ముస్లీం సోదర, సోదరీమణులకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దానధర్మాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ అభివృద్దే అజెండగా, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు అడుగులు వేస్తుందని అన్నారు. పేద ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ, సాయం అందించి ఆదుకోవడంలో జీవితంలో ఎంతో సంతోషం కలుగు తుందన్నారు. స్వంత నగదు వెచ్చించి నూజివీడు పట్టణంలో నూజివీడు నియోజకవర్గములోని ముస్లీం సోదరులకు రంజాన్ రెండు రోజుల ముందే రంజాన్ పర్వదిన సందర్భంగా సుమారు రూ 15 లక్షలతో 15 వందల మంది ముస్లీం సోదరులకు కానుకగా నూతన వస్త్రాలను అందించి ముస్లీం సోదరులకు ముందే రంజాన్ పండుగ సంతోషాన్ని నింపామని అన్నారు. శాంతి, సహనం,పరమత సహనం, క్రమశిక్షణ, తనపై తనకు నియంత్రణ ఉపవాసం ఉండడం అది కేవలం ముస్లీం సోదరులకు మాత్రమే ప్రత్యేకం మని తెలియజేశారు. ఆపదలో ఆదుకోవడంలో ముస్లీం సోదరులు వారికి వారే సాటి అని అన్నారు. ఖురాన్ అవతరించిన రంజాన్ నెల ఎంతో పవిత్రమైనదని, ప్రతి ముస్లిం సోదరులు తన సంపాదనలో రెండున్నర శాతాన్ని పేదలకు పంచడం ద్వారా పేదవారు గొప్పవారు అని తారతమ్యం లేకుండా అందరూ కలిసి పండగని ఆనందంగా జరుపుకుంటారని తెలియజేశారు. వచ్చే బక్రీద్ కల్లా ఈద్గా పూర్తి చేసి ముస్లీం సోదరులకు అందిస్తామని తెలిపారు. ముస్లీం సోదరులు హజ్ యాత్రకు రూ 100 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం అని పేర్కొన్నారు. త్వరలో షాధీఖానా పూర్తి చేసి అన్ని సర్వహంగులతో తీర్చిదిద్ది ముస్లీం సోదరులు కళ్ళలో ఆనందం నింపుతానని అన్నారు. తల్లికి వందనం ద్వారా ముస్లీం సోదరులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. కడప, విజయవాడ దర్గాను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ నియమించిన షేక్ నిజాముద్దీన్ మరియు పది మంది సభ్యులతో కూడిన కమిటీ చాలా బాగా పనిచేస్తుందని వారు చాలా తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపించారని కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో ముస్లీం సోదరులకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఆనాడు అబ్దుల్ కలామ్ ని రాష్ట్రపతిని చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాత్ర మరువలేనిది తెలియజేసారు. యం.ఏ.షరీఫ్ శాసన మండలి చైర్మన్ చేయడం ద్వారా తెలుగుదేశం పార్టీ ముస్లీం సోదరులను అన్ని రకాలుగా రాజకీయ ప్రాముఖ్యతను ఇచ్చామని తెలిపారు. ముస్లిం సోదరులు పవిత్రస్థలం అయిన మక్కా సందర్శించడానికి కూటమి ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేశారు.



## అనకాపల్లి జిల్లా నక్కపల్లి నందు దేశంలోని అతిపెద్ద...
## ఇంటిగ్రేట్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు..

- శాసనసభ్యుడు వనమాడి కొండబాబు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** అనకాపల్లి జిల్లా నక్కపల్లి బంగారయ్య పేట నందు దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేట్ స్టీల్ ప్లాంట్ ఆర్సిలార్ మిట్టల్,నిప్పాన్ స్టీల్ సంయుక్త ప్రాజెక్ట్ ఏర్పాటుతో యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కాకినాడ సిటీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.అనకాపల్లి జిల్లా బంగారయ్యపేట నందు దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై పెద్ద మార్కెట్ నందు నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యుడు వనమాడి కొండబాబు కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ యువత ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ముందు అడుగు వేస్తుందని, కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుపై గట్టి భరోసా కనిపిస్తోందిని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, ఇప్పటికే 6,28,347 ఉద్యోగాలను అందించి యువతలో కొత్త వెలుగులు నింపిందిని, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ, యువతకు భరోసా నిచ్చే విధంగా భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, నేడు అనకాపల్లి జిల్లా నక్కపల్లి బంగారయ్య పేట నందు ఆర్సిలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో యువతుకు భారీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, యెనిమిరెడ్డి మాలకొండయ్య, బచ్చుశేఖర్ , అట్ల సత్యనారాయణ గాది శివరామకృష్ణ చింతలపూడి రవి రెడ్నం సత్తిబాబు అమలకంటి బలరాం కోడూరు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో ఫుడ్ ల్యాబరేటరీ ప్రారంభోత్సవంలో

# సీఎం చంద్రబాబు తో జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 21..** తిరుమలలో శనివారం అత్యాధునిక ఆహార పదార్థాల తనిఖీ కేంద్రాలు (ఫుడ్ ల్యాబరేటరీ) ప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ డిఆర్ నాయుడు, ఎమ్మెల్యే టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ మరియు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, పలువురు ఎమ్మెల్సీలు టీటీడీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి లోకేష్ తనయుడు దేవాన్ష్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లో నీరు, ఆహారపదార్థాలు, ముడి సరకుల నాణ్యతను పరీక్షించనున్నారు అని అన్నారు. శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాలతో పాటు నెయ్యి, నూనె, పాలు వంటి ముడిసరకుల్లో కల్తీని సూక్ష్మస్థాయిలో పసిగట్టేలా ప్రయోగశాలలు ఆధునిక సాంకేతికతతో కూడిన యంత్రాలను ఏర్పాటు చేశారని దాదాపు రూ. 25 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రయోగశాలను నిర్మించారు అని అన్నారు.

ఇది దేశంలోనే తొలి అత్యాధునిక ఫుడ్ ల్యాబ్, ఇక్కడ ప్రసాదాల్లో వినియోగించే ముడిసరుకుల్ని పరీక్షించేలా ల్యాబ్ ప్లాన్ చేశారు. ప్రతి నెల 1,000 నుండి 1,500 నమూనాలపై పరీక్షలు నిర్వహిస్తారని నెహ్రూ తెలియజేశారు. తిరుమలలో ఈ ల్యాబ్ ఏర్పాటు కావడం ద్వారా భక్తులకు సురక్షితమైన ప్రసాదాలు అందనున్నాయి. తిరుమలకు వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్పించిన అత్యాధునిక సౌకర్యాల్లో భాగమేనని నెహ్రూ తెలియజేశారు.ద

## కాకినాడ పోర్ట్ ఏరియాలోని బియ్యం గోదాములు, చెక్ పోస్టులు
# జెసి భరత్ ఆకస్మిక తనిఖీ

- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ట నిఘా
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జెసి హెచ్చరిక





**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** కాకినాడ జిల్లాలో పేదలకు అందించే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ పోర్ట్ ఏరియాలోని వివిధ బియ్యం గోదాములను, చెక్ పోస్టులను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులా నాయక్, పోలీస్, టెక్నికల్ అసిస్టెంట్ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీస్, పోర్ట్ అధికారుల బృందం 29 గోదాములను తనిఖీ చేశారు. తొలుత బొంబాయి కాటా వద్ద ఉన్న చెక్ పోస్ట్ ను, గోదాముల్లో నిల్వ ఉంచిన బియ్యం స్టాక్ వివరాలు, రవాణా రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ విధానంపై సమగ్రంగా పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనుమానాస్పదంగా ఉన్న నిల్వలు, రికార్డులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఎలాంటి అక్రమాలు జరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని జెసి అపూర్వ భరత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో పేదలకు అందించే పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్) బియ్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందించే బియ్యం సరైన లబ్ధిదారులకు చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని ఆయన పేర్కొన్నారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతారని, అందువల్ల ఇలాంటి చర్యలను పూర్తిగా అరికట్టడం జరుగు తుందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీలు ముమ్మరం చేయడం జరిగిందన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.గోదాముల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, ప్రతి దశలో రికార్డులు సక్రమ ంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో పిడిఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా చర్యలు కొనసాగిస్తామని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. ఈ పరిశీలనలో జెసి వెంట కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, ఏఎస్ఓ లక్ష్మీ ప్రసన్న దేవి, పౌరసరఫరాల శాఖ డీటీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పోలీస్ అధికారు తదితరులు పాల్గొన్నారు.



# యువతను ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం..

### జాబ్ క్యాలెండర్ పూర్తి బూటకం...

### ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు....

**మండపేట (మనసులో మాట )మార్చి 21..** రాష్ట్రంలోని యువతకు ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి తిరిగి భారీ మోసం చేసిన కూటమి ప్రభుత్వం పై రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్ర స్థాయి లో ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల హామీగా ఇచ్చి మోసం చేసారన్న విషయాన్ని రాష్ట్ర యువత గుర్తించిన విషయాన్ని పసిగట్టి కల్లబొల్లు మాటలతో 20 నెలల్లో 6,28,347 ఉద్యోగాలు అందించామని చెబుతున్నారని పేర్కొన్నారు. రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే ఒప్పందాలు చేసుకున్నామని ప్రకటించిందన్నారు. ఇదంతా పూర్తి బూటకమని దుయ్యబట్టారు. ఏయే కంపెనీల్లో ఎన్ని ఉద్యోగాలు ఎవరికి కేటాయించారో కంపెనీ పేర్లు, ఉద్యోగుల సంఖ్య, నియామక ఆర్డర్లు బయటపెట్టగలరా అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ అంటే కేవలం ప్రకటన కాదన్నారు. నిరుద్యోగులకు ఇచ్చే భరోసా అని తోట గుర్తు చేశారు. కూటమి పాలకులు నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారే తప్ప భరోసా కల్పించింది ఏమీలేదని దుయ్యబట్టారు. చంద్రబాబు, వేగుళ్ళలు యువతకు అండగా ఉంటామని చెప్పి అవినీతి, అరాచక పాలనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పూర్తిగా నాశనం చేశారన్నారు. ఫలితంగా చాలామంది నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు . ఇప్పుడు తిరిగి జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసగించి వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం యువతను మోసం చేయడం మానుకోవాలన్నారు. ఉద్యోగాలు ఇచ్చి ఉంటే కంపెనీల పేర్లు, జాబ్ సంఖ్యలు, నియామక ఆర్డర్లు వెంటనే వెల్లడించాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే ఇది కేవలం ఎన్నికల ముందు ఓట్లు సాధించడానికి చేసిన మోసంగానే మరొక్కసారి నిరూపితమవుతుందన్నారు. యువత భవిష్యత్తు కోసం వైఎస్ఆర్ సీపీ అధికారంలో ఉండగా ఉద్యోగ అవకాశాలు కల్పించిందని గుర్తుచేస్తూ ప్రతిపక్షంలోనైనా పోరాడుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలబడుతుందని తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు.

# నారాయణ స్కూల్ యాజమాన్యం దురుసు ప్రవర్తన



**తణుకు మనసులో మాట మార్చి 21..** ప గో జిల్లాతణుకు లో రంజాన్ పవిత్రమైన పండగ రోజున తణుకులో ఉన్న నారాయణ స్కూల్ జరుగుతూ ఉంటే చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు ఇదేమిటని ప్రశ్నించడానికి వెళ్లిన ఐసా నాయకుల పై సదర యాజమాన్యం దురుసుగా ప్రవర్తించడం సిగ్గుమాలిన చర్య అని. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏ ఐ యస్ ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి విమర్శించారు. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి మాట్లాడుతూ శనివారం తణుకులో ఉన్న నారాయణ స్కూలు జరుగుతుందని విద్యార్థులు చెప్పిన కారణంగా మేము వెళ్లి అడుగుతున్న క్రమంలో అక్కడ యాజమాన్యం మేము ఇలాగే స్కూల్ రన్ చేస్తాం మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని వారు సమాధానం చెబుతూ ఉన్నారని వారు అన్నారు కూటమి ప్రభుత్వంలో చాలా కీలకంగా వ్యవహరిస్తూ ఒక రాష్ట్ర మంత్రి నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ రకంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్యఅని వారు ధ్వజమెత్తరు యాద్దేచ్ఛగా విద్యా వ్యాపారం చేస్తూ విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ నారాయణ స్కూల్ యాజమాన్యం ఉన్నారని కావున ఈ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షం లో పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యు. మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాదారుల్ని తరిమేస్తాం అంటే కుదరదు వారికి ఇల్లు నిర్మించాల్సిందే

### - పాటంశెట్టి సూర్యచంద్ర



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 21..** పేదలందరికీ ఉచితంగా ఇళ్ళు నిర్మిస్తామని ఎన్నికల ముందు వాగ్దానాలతో ఊదరగొట్టి గెలిచి గద్దినెక్కాక 16 సంవత్సరాల క్రితం పట్టాలు పొందిన వారిని తరిమేస్తామంటే చూస్తూ ఊరుకోమని పేదల పక్షాన బాధితులకు అండగా ఉంటామని పాటంశెట్టి సూర్యచంద్ర స్పష్టం చేశారు. జగ్గంపేటలో 2010 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో తోట నరసింహం ఆధ్వర్యంలో 196/2 సర్వే నెంబర్లో 170 మంది నిరుపేదలకు 4 ఎకరాల 73 సెంట్లు భూమి ప్రభుత్వం కేటాయించిందని నాటి నుండి నేటి వరకు హౌసింగ్ కాలనీ నిబంధనల ప్రకారం త్రాగునీరు రోడ్లు డ్రైనేజ్ విద్యుత్ మొదలగు కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడం వల్ల గృహాలు నిర్మించుకోలేకపోయామని గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కూడా ఎంతో ప్రయత్నం చేశామని నాడు కూడా మా సమస్యలు పరిష్కరించలేదని గత ఎన్నికల్లో కూడా జ్యోతుల నెహ్రూ నవీన్ కు ఓట్లేసి గెలిపించండి మీ సమస్య పరిష్కరిస్తాము డ్రైవర్స్ కాలనీలో అన్ని వసతులు ఏర్పాటు చేసి మీకు పక్కా గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారని నేడు ఈ స్థలాలతో మాకు సంబంధం లేదని ఇక్కడ మమ్మల్ని ఖాళీ చేయాలని వేరే వారికి ఇస్తున్నామని మేము చేసుకుంటున్న గృహ నిర్మాణ పనులను రెవెన్యూ పోలీస్ అధికారులచే నిలుపుదల చేసి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు అందరూ తమ ఆవేదనను పాటంశెట్టి సూర్యచంద్రకు వివరించి న్యాయం చేయాలని కోరారు. బాధితులందరికీ తప్పకుండా అండగా ఉండి సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తానని సూర్యచంద్ర బాధితులందరికీ ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మిస్తామని మాయమాటలు చెప్పి నేడు గత 16 సంవత్సరముల క్రితం ఇచ్చిన పట్టాలు రద్దుచేసి పేదల నోట్లో మట్టి కొట్టడం న్యాయం కాదని శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూకి జ్యోతుల నవీన్ కి మీడియా ద్వారా సూర్యచంద్ర తెలిపారు. తమ అనాలోచిత నిర్ణయాలు మార్చుకోకపోతే బాధితుల పక్షాన వారికి అండగా న్యాయం జరిగే వరకు పోరాడుతామని పాటంశెట్టి సూర్యచంద్ర స్పష్టం చేశారు.

# ప్రజా దర్బార్ ద్వారా పేదల కష్టాలు తీరుస్తాం

### - ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం(మనసులోమాట) మార్చి 21:** అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే ఆనందరావు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి మొత్తం 73 వినతులు వచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఇచ్చిన వినతుల్లో ప్రధానంగా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ సమస్యలు ఇతర మౌలిక వసతులపై ప్రజలు మొరపెట్టుకోగా కొన్ని సమస్యలపై ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తోందని, ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకే ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అనాథ ఆశ్రమంలో దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

### - కేక్ కట్ చేసి చిన్నారులకు భోజనాలు అందించిన కార్పొరేషన్ చైర్మన్ త్రిమూర్తులు



**భీమవరం, (మనసులో మాట) మార్చి 21 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో భీమవరంలోని అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి చిన్నారులతో కలిసి ఆనందంగా వేడుకలను నిర్వహించారు. చిన్నారులకు అన్నదానం నిర్వహించి వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి ఆనందంలో భాగస్వాములైయ్యారు. దేవాన్ష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ త్రిమూర్తులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మైలబత్తుల హైజాక్ బాబు, భీమవరం టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము చల్లబోయిన గోవింద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మాదాసు కనకదుర్గ, జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, కాపా అమర్ బాబు, విన్నకోట వినాయక బాబు, చెరుకు తిరుపతిరావు, గంధం రాధ, భీమవరం టీడీపీ పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు జోగేశ్వరి, వలవల ఆదిలక్ష్మి, శ్రీలక్ష్మి స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# యనమదుర్రులో సీతారామచంద్ర విగ్రహ ప్రతిష్ఠాపన

### కోదండ రాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి - ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం, (మనసులో మాట) మార్చి 21 :** ఏ ప్రాంత ప్రజలైనా రామరాజ్యం కావాలని కోరుకుంటారని, ఉత్తమ పాలకుడు కోదండ శ్రీరాముడు అని, కోదండ రాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటి చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలోని కోదండ రామాలయంలో శనివారం ఉదయం 10.04 నిమిషాలకు శ్రీసీతారామచంద్ర లక్ష్మణ, హనుమ, గణపతి, సుబ్రహ్మణ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్టాపన హోమము నిర్వహించారు. అనంతరం స్వామివారి శాంతి కళ్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# బోగలింగేశ్వరుడికి జటార్ఘూటం, నాగబంధనం సమర్పించిన మల్లిఖార్జున రావు దంపతులు

### - స్వామివారికి ప్రతిష్ట చేసిన అర్చకులు



**కోటనందూరు (మనసులో మాట) మార్చి 21..** కోటనందూరు లో ఉన్న శ్రీ సర్వమంగళాంభ సమేత బోగలింగేశ్వర స్వామి ఆలయంలో బోగలింగేశ్వరుడికి కోటనందూరు గ్రామానికి చెందిన ప్రస్తుతం ముమ్మిడివరం లో ఉంటున్న డొక్కు మల్లికార్జునరావు, నాగమణి దంపతు లు, కీర్తిశేషులు డొక్కు గురులింగం, వీర్రాజు దంపతుల జ్ఞాపకార్థం సుమారు 10 లక్షల విలువచేసే 3 కేజీల 600 గ్రాములు వెండి జటార్ఘూటం, నాగబంధనం, బంగారు పువ్వుతో వెండి కంచం, వెండి రుద్రాక్ష మాల సమర్పిం చారు. ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, ఆలయ కమిటీ చైర్మన్ గొంప గుంగు నాయుడు ఆధ్వర్యంలో అర్చకులు కొత్తలంక పేరయ్యశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య గ్రామ పెద్దలు కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరము బోగలింగేశ్వరుడికి దాతలు సమర్పించగా స్వామివారికి అలంకరించి ప్రతిష్టించారు. అనంతరము కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు దాతలకు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా దాతలు పెద్దలు మాట్లాడుతూ నా జన్మస్థలమైన కోటనందూరు లో ఉన్న బోగలింగేశ్వరుడికి ఎప్పటినుండో జటార్ఘూటం, నాగ బంధనం వెండి రుద్రాక్ష మాల, వెండి పళ్ళెం ఇవ్వాలని అనుకున్నా నీ, స్వామివారి అనుగ్రహంతో ఈరోజు ఇవ్వడం జరిగిందని అన్నారు. పెద్దలు మాట్లాడుతూ ఇలాంటి దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నం దుకు కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి అనుగ్రహం వీరిపై ఉండాలని, నిండు నూరేళ్ల ఆయుష్షు, ఆరోగ్యం ఆ కుటుంబాలకు ఇవ్వాలని తెలియజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి నారాయణ మూర్తి రాజు, సంబారు సత్యనారాయణ, మళ్ల తాతాజీ, గజ్జలపు జయప్రకాష్, మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు, పొన్న వీరభద్రం, పానుగంటి లక్ష్మి, డొక్కు మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



# సామర్లకోటలో కోలాహలంగా రంజాన్ వేడుకలు



సామర్లకోట (మనసులో మాట) మార్చ్ 21; ఆకాశంలో నెలవంక దర్శనం ఇవ్వటంతో సామర్లకోటలో ముస్లిములు పవిత్ర రంజాన్ వేడుకలను కోలాహలంగా శనివారం నిర్వహించారు. స్థానిక ఈద్గా మైదానంలో ముస్లిం మత పెద్దలు మహమ్మద్ సైఫుల్ల, మహమ్మద్ వారిస్ , మహమ్మద్ హాభిభుల్లా , మహమ్మద్ బాషి, మహమ్మద్ తోహిద్ తదితర మత పెద్దల ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో పవిత్ర రంజాన్ ప్రార్థనలు, వేడుకలను ఘనంగా నిర్వహించారు. మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ముస్లిం సోదరులను కలిసి, వారి ప్రార్థన కార్యక్రమాల్లో పాల్గొని, రంజాన్ శుభాకాంక్షలు అందించారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మహమ్మద్ మజీద్ అల్లా అది, మహమ్మద్ మునీమ్ దైవ సందేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరు సేవా తత్వాన్ని దాతృత్వాన్ని సహాయతత్వాన్ని కలిగి ఉండాలని, సమాజ హితమే తమహితంగా భావించాలని కోరారు. ఈద్గా మైదాన ప్రాంగణంలో ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ఉల్ పీతర్, రంజాన్ సందేశాలను ఒకరికొకరు పంచుకున్నారు. పట్టణంలో శాంతియుతంగా కోలహాలంగా రంజాన్ వేడుకలు జరిగాయి.

# ఘనంగా ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు



**ముమ్మిడివరం (మనసులో మాట)మార్చి 21..** ముమ్మిడివరం మండలంలో రంజాన్ నెల పురస్కరించుకొని చివరి రోజులో భాగంగా శనివారం ముమ్మిడివరం గొల్లగూడెంలో ఉన్న మజ్జిదే జహారాలో ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజులు అత్యంత ఘనంగా జరిగాయి. రంజాన్ నెల ప్రారంభం నుండి విచ్చేసి ఉన్న మౌలానా ముజస్సిమ్మ్ హైదర్ ప్రత్యేక ప ప్రార్థనలు చేయించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ముబారక్ లు తెలుపుకున్నారు. అనంతరం కృష్ణాజిల్లా మచిలీపట్నం నుండి విచ్చేసిన మత గురువు మౌలానా ముజస్ సిమ్ హైదర్ మాట్లాడుతూ రంజాన్ అనేది ఐక్యత ,దానధర్మాలు, జాలి, దయ ,కరుణ , ప్రేమలు పేదల పట్ల అందించాలనే దే రంజాన్ నెల ఉద్దేశం అని మౌలానా హైదర్ తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఇస్లాం కోసం ప్రత్యేక ప్రార్థన చేయాలని ఆయన తెలిపారు. అలాగే ఇరాన్ దేశంలో షియా అధ్యక్షుడు అలీ ఖామిని పై దాడి చేసి చంపేయడం చాలా బాధాకరమని శత్రువులు, శత్రు దేశాలు నాశనం అవ్వాలని ప్రత్యేక ప్రార్థన చేశారు. ముమ్మిడివరంలోని సున్ని జామీయా మసీదు వద్ద కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# రౌతులపూడిలో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ పండుగ



**రౌతులపూడి, (మనసులో మాట )మార్చి 21:** మండలంలోని రౌతులపూడి గ్రామంలో స్థానిక మదీనా మజీద్ లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ నమాజ్ ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్ ఉమర్ ఫారూఖ్ ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిమ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మదీనా మస్జిద్ సభ్యులు మాట్లాడుతూ 30 రోజులు ఎంతో కఠిన దీక్షతో ఈ ఈద్-ఉల్-ఫితర్ ఉపవాసం పాటిస్తారని ఈ నెలలో అల్లాహ్ కరుణ కోసం అనేక దానధర్మాల కార్యక్రమాలు చేపడతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదిన మజీద్ సభ్యులు షేక్ హుస్సేన్, షేక్ సల్మాన్, షేక్ సర్దార్, షేక్ మున్నా, హాఫిజ్ నాసిర్, షేక్ జానీ, షేక్ రహీమ్, షేక్ సలీమ్ షేక్ తానుష వల్లి, షేక్ బషీర్, మరియు రౌతులపూడి ముస్లిమ్స్ పాల్గొన్నారు.

# కే మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ



**రౌతులపూడి, (మనసులో మాట )మర్చి 21:** కంచర్ల మీడియా క్యాలెండర్ను రంజాన్ సందర్భంగా రౌతులపూడి మదీనా మజీద్ కమిటీ సభ్యులు చే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా రాసే ఏకైక పత్రిక మనసులో మాట పత్రికాని ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా పనిచేస్తున్నారని ఈ కంచర్లమీడియా మరింత ఉన్నత స్థానానికి చేరాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కంచర్ల మీడియా రౌతులపూడి మండలం రిపోర్టర్ షేక్ సలీం మరియు రౌతులపూడి మదీనా మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



## కాకినాడ కలెక్టరేట్లో సోమవారం జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

**- కాకినాడ కలెక్టర్ సన్మోహన్ సగిలి**

**కాకినాడ (మనసులో మాట )మార్చి 21..** ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం (డీ.ఆర్.సి) కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డీ ఆర్ సి సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు.


## అడ్డతీగల నుండి రంపచోడవరం సెటిల్ బస్ లేక ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు




**రంపచోడవరం మనసులో మాట మార్చి 20..** పోలవరం జిల్లా అడ్డతీగల మండలం అడ్డతీగల నుండి జిల్లా హెడ్ క్వార్టర్ అయిన రంప చోడవరమునకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు నానా అవస్థలకు గురవుతున్నారు. ఆఫీస్ పని మీద జిల్లా హెడ్ క్వార్టర్ కి వెళ్ళాలన్నా డిగ్రీలు చదివే విద్యార్థులు అలాగే మారేడుమిల్లి వంటి టూరిస్ట్ ప్రాంతాలకు వెళ్లడానికి గాని జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళడానికి గాని ఎటువంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో అటు రాజవొమ్మంగి అలాగే అడ్డతీగల వై రామవరం గంగవరం మండలాల ప్రజలు అధికారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా ముఖ ద్వారానికి వెళ్లాలంటే అడ్డతీగల నుండి గాని రాజోవొమ్మంగి గంగవరం ప్రాంతాల ప్రయాణికులు కొత్తపల్లి మీదుగా గోకవరం వెళ్లి గోకవరం నుండి రంపచోడవరం వెళ్లవలసిన పరిస్థితి ద్వాపరించింది. రంపచోడవరం వెళ్లాలంటే నానా అగచాట్లు పడవలసిన పరిస్థితి ఏర్పడుతుందని రాజో వొమ్మంగి అడ్డతీగల గంగవరం వై రామవరం ప్రజలు సుమారు 100 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తుందని ఇకనైనా ఆర్టీసీ అధికారులు జిల్లా ఉన్నతాధికారులు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత ప్రయాణికులు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో అడ్డతీగల నుండి గోకవరం డిపోనకు చెందిన ఆర్టీసీ సెటిల్ బస్సు ఉండేదని అది ఏ కారణం చేతనో రద్దు చేయడం జరిగిందని అప్పటినుండి ప్రయాణికులు ఏమైనా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి తిరిగి ఆ బస్సు సర్వీస్ ను ప్రారంభించాలని ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నారు.

### కొమరిపాలెంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి చేతులమీదుగా

## 'కంప్లీట్ ఫిట్‌నెస్ స్టూడియో' ప్రారంభోత్సవం



**అనపర్తి, (మనసులో మాట) మార్చి 21:** మల్లిడి మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో జిమ్ ప్రారంభం అనపర్తి నియోజకవర్గం,బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామంలో ఆధునిక సదుపాయాలతో నిర్మితమైన "కంప్లీట్ ఫిట్‌నెస్ స్టూడియో" జిమ్‌ను అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లిడి మణికంఠ రెడ్డికి డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కోస్తాంధ్ర రెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ త్రినాథ్ రెడ్డి, కె పీ ఆర్ సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యుడు వైయస్ఆర్‌సీపీ అనపర్తి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కొండేటి భీమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ గొలుగూరి దుర్గారెడ్డి, సత్తి మణికంఠ రెడ్డి అనపర్తి మండల వైయస్ఆర్‌సీపీ యువజన విభాగం జనరల్ సెక్రటరీ, కోస్తాంధ్ర రెడ్డి అసోసియేషన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి అసోసియేషన్ స్టూడెంట్ ప్రెసిడెంట్ సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామిక వేత్తల ట్రేడ్ ఫెయిర్ ను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** 120 స్టాల్స్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 28 జిల్లాల తో పాటు సుమారుగా 6 ఇతర రాష్ట్రాల నుంచి చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకాలు ప్రారంభం.. జిల్లా గ్రామీణాభి వృద్ధి సంస్థ, పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్ ఇ ఆర్ పి )ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఐటిఐ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన మహిళా పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, దుస్తులు భారీ ప్రదర్శన మరియు అమ్మకాల ట్రేడ్ ఫెయిర్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ రిబ్బన్ కట్ చేసి లాంచనంగా ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తో పాటు దేశంలోని ఉత్తరప్రదేశ్ కాశ్మీర్, పశ్చిమ బెంగాల్, లక్నో, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి స్టాల్స్ లో ఏర్పాటు చేసిన ప్రసిద్ధ చేనేత వస్త్రాలను హస్త కళారూపాలను పరిశీలించి వాటి ప్రత్యేకతను జేసీ అపూర్వ భరత్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ పీడీ జి శ్రీనివాసు మాట్లాడుతూ.. కాకినాడ ప్రభుత్వ ఐటిఐ అవరణలో ఈనెల 20 నుంచి 12 రోజులు పాటు డ్వాక్రా బజార్ (ఉమెన్స్ ఇంట్రెప్రెనేర్ ట్రేడ్ ఫైర్ 2026) నిర్వహించ బడుతుందన్నారు. ఈ డ్వాక్రా బజార్ లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మహిళా పారిశ్రామిక వేత్తలు వివిధ రకాల ఉత్పత్తులు మార్కెటింగ్ కోసం 120 స్టాల్స్ ఏర్పాటు చేశామని ఇందులో చేనేత వస్త్రాలు, హస్త కళా వస్తువులు, గృహ అలంకరణ వస్తువులు లభిస్తాయన్నారు. ఈ భారీ మహిళా పారిశ్రామిక ట్రేడ్ ఫెయిర్ (ఉమెన్స్ ఇంట్రెప్రెనేర్ ట్రేడ్ ఫైర్ ) ను సందర్శించి మహిళా ఉత్పత్తులను, మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని డీఆర్డీఏ పీడీ కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ టి. కనకరాజు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ఎస్వీ ప్రసాద్, డీఆర్డీఏ ఏపీడీ జిలాని ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆచంట వారి వీధిలో పునః నిర్మాణము చేసిన శ్రీ సీతారామ స్వామి ఆలయం

## నూతన విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం



**కాకినాడ మనసులో మాటమార్చి 21..** కాకినాడ జగన్నాధపురం అచంట వారి వీధిలో పునఃనిర్మాణ చేసిన శ్రీసీతారామ ఆలయంలో నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నపూర్ణ దంపతులు శ్రీసీతారామ లక్ష్మణ హనుమంతుల విగ్రహాలను ప్రతిష్ఠ చేసారు.ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మంపా రాధన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. విగ్రహాల ప్రాణప్రతిష్టపన కార్యక్రమం పూర్తి అయిన అంతరం విగ్రహదాతలు తలాటం హరీష్ అన్నపూర్ణ దంపతులు మంత్రప్రతిష్టను చేసారు. కార్యక్రమంలో బాగంగా సీతా రామ లక్ష్మణ హనుమంత విగ్రహాలను ప్రతిష్టంచారు. అదేవిదంగా శిఖర ప్రతిష్ఠ ను వైభవంగా జరిపించారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు శిఖర ప్రతిష్టను పురస్క రించుకుని శిఖరానికి బూరెలు సమర్పించగా భక్తులు బూరెలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు.తొలుత గోమాత దర్శనం తరువాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విగ్రహప్రతిష్టకు సంబందించి నిర్వహించిన యాగ క్రతువు ముగింపును పురస్కరించుకుని వేదపండితుల మంత్రోర్చణనల నడుమ తలాటం హరీష్ అన్నపూర్ణ దంపతులు మహాపూర్ణహూతిని అగ్ని హోత్రు నికి సమర్పించారు.ఈసందర్భంగా సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ రెండు ఏళ్ళ క్రితం ఇదే రోజున ఇదే మూహూర్తానికి10 :10 నిమిషాలకు శ్రీసీతారామలక్ష్మణహనుమంతుల విగ్రహాలను ప్రతిష్టంచడం తన పూర్వజన్మ శుకృతం అన్నారు. ఆలయకమిటి సభ్యులు పినిశెట్టి సురేష్ మాట్లాడుతూ పాలరాతి విగ్రహాలు బహుకరించిన సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో గుబ్బల బుజ్జి, కంచర్ల రమేష్, సత్యనారాయణ గుబ్బల కృష్ణ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## డైవర్స్ కాలనీ లబ్ధిదారుల పట్టాల రద్దు అనే ఆలోచన విరమించుకోవాలి

**- కర్నాకుల, బండారు రాజా**




**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 21..** కాకినాడ జిల్లా జగ్గంపేట పంచాయతీ డైవర్స్ కాలనీలో 10 సంవత్సరాల క్రితం లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని, ఆ ఆలోచనను విరమింప చేసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం నాడు డైవర్స్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణకుల వీరాంజనేయులు, వైఎస్ ఆర్ సి పి నాయకులు ఉప సర్పంచ్ బండారు రాజా పాల్గొని, వారు మాట్లాడుతూ 2010లో సర్వే నంబర్ 196 /2 లో సుమారు 4 ఎకరాల 73 సెంట్లు భూమి సుమారు170 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది. వారు ఆర్థిక స్తోమత బాగోలేక, ఇళ్ల నిర్మానం చేపట్టలేక ఖాళీగా ఉంచుకున్నారు. అప్పులు చేసి కొంతమంది ఇల్లు కట్టుకున్నారు.ఇప్పుడు ఇల్లు కట్టుకునే సమయంలో కూటమి ప్రభుత్వ నాయకులు, ప్రభుత్వం వారు కలిసి ఈ పట్టాలను రద్దుచేసి, వాళ్ల కార్యకర్తలకు ఇస్తానని అనడం సరైన పద్ధతి కాదని వారు విమర్శించారు. ఈ స్థలాల్లో డ్రైవర్లు, ఆశా వర్కర్లు, హిజ్రాలు, అనేకమంది ఉన్నారని, గతంలో లబ్ధిదారుల వద్ద నుండి (ఒక్కొక్కరు వద్దనుండి) 5 వేల రూపాయలు వసూళ్లు చేసి సొంతంగా కరెంటు వేసుకున్నారు అని, వాళ్ళని ఇబ్బందులు పెట్టి, బాధలు పెట్టకండి అని వారు తెలిపారు. తక్షణమే కూటమి ప్రభుత్వ నాయకులు ఈ ఆలోచనను విరమింప చేసుకోవాలని,అలాగే వారికి మౌలిక వసతులు, సిసి రోడ్లు, వాటర్ ట్యాంకు, మరుగుదొడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా మేము అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ విషయంపై సోమవారం నాడు చలో కాకినాడ కలెక్టరేట్ కు వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే.సతీష్ దాన్ శ్రీను,వాసు, శ్రీను, సత్తిబాబు, తాతాజీ, వెంకటలక్ష్మి, కుమారి,బాబ్జి, శ్రీనివాస్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులకు గ్రామస్తులు సహకరించాలి - ఎస్ఐ శేఖర్ బాబు




**అమలాపురం(మనసులో మాట) మార్చి 21..** అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు గ్రామ పెద్దలతో శనివారం అమలాపురం రూరల్ ఇమ్మిడి వరప్పాడులో గ్రామ స్తులతో శాంతి భద్రతల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్ ఐ శేఖర్ బాబు మాట్లాడుతూ గ్రామం లో ఫ్లెక్సీ లు ఏర్పాటు చేసే విషయంలో ముందస్తు అనుమతి తీసుకోవాలని, పరిమిత వ్యవది లో నే వాటిని తొలగించాలని కొన్ని సూచనలు జారి చేసారు. గ్రామంలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు ఆవేశాలకు లోనుకాకుండా, గ్రామ పెద్దలందరూ ఒకచోట కూర్చుని వాస్తవాలను చర్చించుకోవాలని, సోషల్ మీడియాలో అవాస్తవాలు, పుకార్లు లేదా అపోహల ఆధారంగా ఎటువంటి తొందరపాటు చర్యలకు పాల్పడకూడదని ఆయన సూచించారు. గ్రామమంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ దుర్గారావు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గెద్దయ్య మాజీ గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షులు వా. మల్లేశ్వరరావు జక్క. చిరంజీవి .టీడీపీ సెక్రటరీ శ్రీనివాస్ గారు.టీడీపీ ఉపాధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

## ఈ నెల 28న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం



**అమలాపురం(మనసులో మాట) మార్చి 21:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య కేంద్రమైన అమలాపురం లో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఈనెల 28వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ కంచిపల్లి సత్యనారాయణ (అబ్బులు) తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు ఈనెల 25న ప్రారంభమై ఏప్రిల్ 3వ తేదీ వరకు అత్యంత వైభవంగస ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 25వ తేదీన శ్రీ స్వామివారిని పెండ్లి కుమారుడిగాను అమ్మవారిని పెండ్లి కుమార్తె గాను ముస్తాబు చేస్తారన్నారు. అలాగే 27వ తేదీన ఎదురు సన్నాహం అంకురార్పణ కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారన్నారు .28వ తేదీన ఉదయం స్వామివారికి అత్యంత వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించబడుతుందని సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు .30వ తేదీన శ్రీ స్వామివారికి పొన్న వాహన గ్రామోత్సవం పురవీధులలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే 31వ తేదీ న మధ్యాహ్నం సంధ్యాసం అనంతరం శ్రీ స్వామివారికి కోనేరు నందు తెప్పోత్సవం అనంతరం అశ్వగంధర్వ వాహన గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1 వ తేదీన శ్రీ స్వామివారికి హనుమంత వాహన గ్రామోత్సవం అలాగే 2వ తేదీన శ్రీ స్వామివారికి చక్రస్నానం అత్యంత ఘనంగా నిర్వహించబడుతుందన్నారు. అలాగే 3వ తేదీ చైత్ర శుద్ధ పాడ్యమి నాడు స్వామివారికి పుష్పయాగం అత్యంత బలోపేతంగా నిర్వహించబడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పేరపు వీర వెంకట సత్య కుమార్ ధర్మకర్తలి మండల సభ్యులు దంగేటి విజయ గౌరీ దుర్వాసుల వెంకట సత్య జయలక్ష్మి మట్టపర్తి గౌరీ పార్వతి వెన్న మాణిక్యాంబ కుంచే అరుణకుమారి కల్లపల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## కోదండరాముని కళ్యానోత్సవాలకు పందిరి రాట ముహూర్తం

**యానాం (మనసులో మాట) మార్చి 21:** కేంద్రపాలిత ప్రాంతమైన యానాం కనకాల పేట గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి వారి 79 వ కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. వేద పండితులు సుదర్శనం గోపాలచార్యులు వారి ఆధ్వర్యంలో ఉదయం10.06 నిమిషాలకు విశేష పూజలు చేసి పందిరి రాట ముహూర్తం చేశారు. గ్రామానికి చెందిన కనకాల వెంకటరావు, శిరీష పుణ్య దంపతులచే నిర్వహించిన ఈ కార్యక్రమంలో హంసాని రామలక్ష్మణుడు, కవల గణపతి, గ్రామ పెద్దలు, భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు తుమ్మలపల్లి రమేష్ పరామర్శ



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 21 ..** జగ్గంపేట మండలం రామవరం గ్రామ మాజీ సర్పంచ్ మండపాక చిన్న మాత్ర మూర్తి మరియు బూరుపూడి జనసేన నాయకుడు పాఠంశెట్టి రమేష్ అమ్మమ్మ అయిన మండపాక అచ్చిరాజు ఇటీవల స్వర్గస్తులైనారు. రామవరం గ్రామంలో వారి స్వగృహంలో నిర్వహించిన అచ్చి రాజు దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా అచ్చి రాజు చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో మండపాక బాబ్జి, మండపాక పాపన్న దొర,మండపాక వెంకటేశ్వర్లు, పాఠంశెట్టి విశ్వనాథం, ఆళ్ళ శీను బాబు,మాదారపు వీరబాబు,రేవూరి శ్రీను,పండు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామవరం గ్రామంలో మండపాక పేర్రాజు భార్య ఇటీవల స్వర్గస్తులైనారు. రామవరం గ్రామంలో వారి స్వగృహంలో నిర్వహించిన వారి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళు లర్పించారు.ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మండపాక పాపన్నదొర, అడబాల వెంకటేశ్వర్లు,మాదారపు వీరబాబు,రేవూరి శ్రీను,పండు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా ఉత్పత్తులను కొనుగోలు చేసే వార్ని ప్రోత్సహించాలి..

**- జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** కాకినాడ నగరంలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్వాక్రా ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదరించాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కోరారు. కాకినాడ లోని ప్రభుత్వ ఐటిఐ ఆవరణలో ఏర్పాటు చేసిన డ్వాక్రా ఉత్పత్తుల స్టాళ్లను ఆయన ప్రారంభించారు. సుమారు 150 వరకు స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివిధ రకాల వస్తు ఉత్పత్తులను వీటిలో ఉంచా మన్నారు. వివిధ జిల్లాలకు చెందిన ఉత్పత్తులను ఈ స్టాళ్లలో ఉంచినట్లు పేర్కొన్నారు. సుమారు పది రోజులపాటు నిర్వహించే ఈ స్టాళ్ళను సందర్శించి కొనుగోలు చేసి వాటిని ప్రోత్సహించాలని జేసీ అపూర్వ భరత్ సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన డ్వాక్రా మహిళలు ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యతని స్తోందని చెప్పారు. కళావేదిక దగ్గర ఏర్పాటు చేసిన సాంస్కృతిక సాంప్రదాయాల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ జి శ్రీనివాస రావు, వెంకటేశ్వర రావు, ఏపీడి జిలానీ తదిరులు పాల్గొన్నారు.

## వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ వాడితే కఠిన చర్యలు

**- తహసీల్దార్ ఎస్ ఎల్ ఎన్ కుమారి**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** కాకినాడ రూరల్ హోటళ్ళు వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ వాడితే కఠిన చర్యలు తప్పవని కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్. ఎల్. ఎన్ కుమారి హెచ్చరించారు. స్థానిక రూరల్ మండలం రమణయ్యపేట, వాకలపూడి గ్రామాలలో హోటల్, పాస్ట్ పుడ్ సెంటర్ లను ఎమ్మార్వో తన బృందంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గృహ వినియోగ గ్యాస్ బండలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్ ను వ్యాపార అవసరాలకు వినియోగిస్తే సివిల్ సప్లై యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట మండల సివిల్ సప్లై ఆఫీసర్ ఎన్ వీరాస్వామి,రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.సురేష్, ఆర్ ఐ ఎమ్ భవాని పాల్గొన్నారు.

# నూతన పోలవరం జిల్లా తొలి కలెక్టర్‌కు సాదర స్వాగతం

**- జిల్లా అభివృద్ధిపై సిపిఎం ఆకాంక్షలు**

**రంపచోడవరం (మనసులో మాట) మార్చ్ 21..** పోలవరం జిల్లా ఆవిర్భావం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతన కలెక్టర్‌ను కేటాయించడం పట్ల సిపిఎం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేస్తోంది. బాధ్యతలు స్వీకరించబోతున్న నూతన కలెక్టర్ కి సీపీఎం పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పెన.కిరణ్, సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల.వాణిశ్రీ లు హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం అన్నారు.

నూతన జిల్లాగా ఏర్పడిన పోలవరం ప్రాంతానికి అపారమైన వనరులతో పాటు అంతే స్థాయిలో సవాళ్లు కూడా ఉన్నాయి. కేవలం పరిపాలనా విభజనతోనే సరిపెట్టకుండా, ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నూతన కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టడం, నూతన జిల్లాకు కేటాయించిన నిధులు అరకొరగా ఉన్నాయి. నూతన కలెక్టరేట్ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక ప్యాకేజీని రాబట్టడంలో కలెక్టర్ శక్తివంచన లేకుండా కృషి చేయాలి. నిర్వాసితుల సమస్యలే,జిల్లాకి ప్రాధాన్యత కావాలి

పోలవరం ప్రాజెక్టు వల్ల వేలాది కుటుంబాలు నివాసాలు కోల్పోయాయి.ఆర్ అండ్ ఆర్ (పునరావాసం మరియు పునరుద్ధరణ) ప్యాకేజీ అమలులో జరుగుతున్న జాప్యాన్ని అరికట్టాలి. నిర్వాసితులకు అందాల్సిన పరిహారం, నాణ్యమైన గృహ నిర్మాణాలు మరియు ఉపాధి అవకాశాలపై కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలి.

గిరిజన ప్రాంతాల అభివృద్ధి, జీవనోపాధి

జిల్లాలో అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం మరియు రవాణా సౌకర్యాలు దారుణంగా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన భూములకు హక్కుల కల్పన (ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు) మరియు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంపై దృష్టి సారించాలి. మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు

యువతకు ఉపాధి కల్పించేలా జిల్లాలో అగ్రో-బేస్డ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి సామాన్య ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవాలి. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి.

పోలవరం జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా కలెక్టర్ తీసుకునే ప్రతి ప్రజాపక్ష నిర్ణయానికి సిపిఎం తన పూర్తి మద్దతును అందిస్తుంది. అదే సమయంలో ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రజల పక్షాన పోరాటాలకు వెనుకాడబోమని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాం...!!

# ధర్మసేన సామాజిక పోరాటం

## కాపుల అణచివేత పేదల వైద్యానికి అన్యాయం!

**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** కాకినాడ నడిబొడ్డున పేద ప్రజల ప్రాణాలను కాపాడే మహా యజ్ఞానికి గండి కొడుతూ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ధర్మసేన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

ఏమిటీ అన్యాయం? జీవో ఎంఎస్ నెంబర్ 17 వెంటనే రద్దు చేయాలి.డాక్టర్ విన్నపం బూడిదలో పోసిన పన్నీరేనా? ఒక ఉత్తముడైన కాపు సామాజిక వర్గానికి చెందిన డాక్టర్, ఇదే 3.4 ఎకరాల స్థలాన్ని లీజుకు ఇస్తే, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే మల్టీ-నేషనల్ హాస్పిటల్ నిర్మిస్తానని డిప్యూటీ సీఎం ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకున్నారు.

ప్రజల ఆరోగ్యం కంటే హోటళ్లే ముఖ్యామా ?వేల మందికి ప్రాణదానం చేసే ఆసుపత్రి కంటే, ధనవంతుల విలాసాల కోసం ఎస్ వి ఎస్ కన్స్ట్రక్షన్స్ కు 'తాజ్' బ్రాండ్ హోటల్ కట్టుకోవడానికి భూమిని దారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసం? భారీ రాయితీలు ఎవరి కోసం? ఇప్పటికే కోట్ల రూపాయల ఆస్తి ఉండి, ప్రభుత్వం నుండి పెన్షన్లు పొందుతున్న వ్యక్తులకు, మళ్ళీ రూ104 కోట్ల పెట్టుబడి పేరుతో 10 ఏళ్ల పాటు 100శాతం ఎస్జిఎస్టి రీయింబర్స్‌మెంట్, రూ10 కోట్ల సబ్సిడీ, పారిశ్రామిక రేటుకే విద్యుత్ వంటి భారీ రాయితీలు కట్టబెట్టడం.. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడమే.కాపు జాతిపై వివక్ష - ఓటు బ్యాంకు రాజకీయాలు

అణచివేత ధోరణి అర్హత ఉన్న కాపు సామాజిక వర్గ డాక్టర్ ముందుకు వస్తే ప్రోత్సహించాల్సింది పోయి, కావాలనే పక్కన పెట్టడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటి? ఇది కేవలం డాక్టర్‌కు జరిగిన అన్యాయం కాదు, యావత్ కాపు జాతిని ఆర్థికంగా, సామాజికంగా ఎదగనివ్వకుండా తొక్కేయడమే.తీవ్ర పరిణామాలు తప్పవు. కాపులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ, కీలక నిర్ణయాల్లో అన్యాయం చేయడంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. వేరే కులం వారు ఉంటే పరిస్థితి ఇలాగే ఉండేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వాన్ని మా డిమాండ్ జీవో ఎంఎస్ నెంబర్ 17 వెంటనే రద్దు చేయాలి.విలాసవంతమైన హోటళ్ల కంటే, పేదలకు ప్రాణాధారమైన ఆసుపత్రి నిర్మాణానికే ఈ 3.4 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి. స్థానిక కాపు మేధావులను, నిపుణులను ప్రోత్సహించకుండా చేస్తున్న వివక్షను వెంటనే ఆపాలి.ధనవంతులకు ఇచ్చే రాయితీలను రద్దు చేసి, ఆ నిధులను ప్రజా ఆరోగ్యానికి ఖర్చు చేయాలి.మన హక్కుల కోసం.. మన జాతి గౌరవం కోసం.. ధర్మసేన గళం ఎత్తుతోంది!

# ఆదాయపు పన్ను కొత్త రూల్స్.. వేతన జీవులకు భారీ ఊరట, కఠిన నిబంధనలు...




**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** దేశంలో ఆదాయపు పన్ను విధానంలో చారిత్రాత్మక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 65 ఏళ్లుగా అమల్లో ఉన్న 1961 నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025ను తీసుకువచ్చింది. దీని అమలుకు అవసరమైన ఆదాయపు పన్ను నిబంధనలు-2026 ను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) మార్చి 20న నోటిఫై చేసింది. ఈ కొత్త చట్టం, నిబంధనలు ఏప్రిల్ 1, 2026 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల ద్వారా పన్ను విధానాన్ని సరళతరం చేయడంతో పాటు, పన్ను చెల్లింపు దారులకు, ముఖ్యంగా వేతన జీవులకు కొన్ని కీలక ప్రయోజనాలు కల్పించారు.పాత విధానం ఎంచుకుంటే ప్రయోజనాలు

ఈ కొత్త నిబంధనల ప్రకారం, పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ పాత, కొత్త పన్ను విధానాల మధ్య ఎంచుకునే స్వేచ్ఛను కలిగి ఉంటారు. అయితే పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వేతన జీవులకు ఈ మార్పులు పెద్ద ఊరటను అందిస్తున్నాయి.

హెచ్ ఆర్ ఏ మినహాయింపు విస్తరణ

ఇప్పటివరకు ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాల్లో మాత్రమే ఉన్న 50 శాతం ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ ఆర్ ఏ ) మినహాయింపు పరిధిని ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ నగరాలకు కూడా విస్తరించారు. ఈ 8 నగరాల్లోని ఉద్యోగులు తమ జీతంలో 50 శాతం వరకు హెచ్ ఆర్ ఏ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు. ఇతర ప్రాంతాల్లో ఇది 40 శాతం గా కొనసాగుతుంది.

భారీగా పెరిగిన అలవెన్సులు

పిల్లల చదువుల కోసం ఇచ్చే ఎడ్యుకేషన్ అలవెన్స్‌ను నెలకు రూ.100 నుంచి రూ.3,000కు (ఇద్దరు పిల్లల వరకు) పెంచారు. అదేవిధంగా, హాస్టల్ ఖర్చుల అలవెన్స్‌ను నెలకు రూ.300 నుంచి ఏకంగా రూ.9,000కు (ఇద్దరు పిల్లల వరకు) పెంచడం గమనార్హం.

సరళతరం... నుంచి కఠినతరం

పన్ను విధానాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా కొత్త చట్టాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా సెక్షన్ల సంఖ్యను 819 నుంచి 536కు, చాప్టర్లను 47 నుంచి 23కు తగ్గించారు. పన్ను చెల్లింపుదారులకు గందరగోళం కలిగించే ప్రీవియస్ ఇయర్ అసెస్మెంట్ ఇయర్ అనే పదాలను తొలగించి, వాటి స్థానంలో ఒకే టాక్స్ ఇయర్ అనే భావనను ప్రవేశపెట్టారు. అయితే, ప్రయోజనాలతో పాటు నిబంధనలను కూడా కఠినతరం చేశారు. హెచ్ ఆర్ ఏ క్లెయిమ్ చేయాలంటే ఇకపై ఇంటి యజమాని-అద్దెదారు సంబంధాన్ని తప్పనిసరిగా ప్రకటించాలి. అలాగే, డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించి, రూ.2 కోట్లకు మించి లావాదేవీలు జరిపే లేదా 3 లక్షల మందికి పైగా వినియోగదారులతో సంబంధాలున్న విదేశీ సంస్థలను పన్ను పరిధిలోకి తెచ్చేందుకు సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రెజెన్స్ (ఎస్ ఈ పి ) నిబంధనలను స్పష్టం చేశారు.

కొత్త చట్టం కింద 150కి పైగా కొత్త ఫారాలను కూడా నోటిఫై చేశారు. ముఖ్యంగా, ఉద్యోగులకు ఇచ్చే ఫారం 16 స్థానంలో ఇకపై ఫారం 130 రానుంది. ఏప్రిల్ 1 నుంచి ఈ సమూల మార్పులు అమల్లోకి రానుండటంతో పన్ను చెల్లింపుదారులు, నిపుణులు కొత్త నిబంధనలపై అవగాహన పెంచుకోవాల్సి ఉంటుంది.

# స్పెషల్ ఎంక్వయిరీ చేసి నిజం తేల్చమని జిల్లా పోలీస్ అధికారికి ఆదేశించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...



**నూజివీడు/ఏలూరు (మనసులో మాట).. మార్చి 21:** చాట్రాయి మండలం చాట్రాయి గ్రామంలో ఇటీవల మరణించిన అంబటి దీపు అనుదీప్ వర్షిత్ మరణం పై అనేక అనుమానాలు రేకెత్తడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి భరోసా ఇచ్చిన పార్థసారథి. దీపు రెండు రోజుల క్రితం అనుమానస్పద మరణంతో ఇటు పోలీసు శాఖ మరియు కొంతమంది వ్యక్తులు నాయకులతో అనుమానం తలెత్తుతున్న అంబటి దీపు కుటుంబ సభ్యులను పేరు పేరునా పరామర్శించి మీకు నచ్చిన అధికారి మీరు మెచ్చిన అధికారి ఎవరైనా ఉంటే మీకు నచ్చిన విధంగా ఎంక్వయిరీ వేస్తానని హామీ ఇచ్చిన మంత్రి. తల్లిదండ్రుల ఆవేదన అర్థం చేసుకున్న మంత్రి వర్యులు ఏలూరు జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ వారితో మాట్లాడి స్పెషల్ ఎంక్వయిరీ వేయమని ఆదేశించారు. నూజివీడు నియోజవర్గ పోలీస్ వారు కాకుండా ఇతర ప్రాంత పోలీసు అధికారులను ఎంక్వయిరీ వేసి సమగ్ర నివేదిక సమర్పించాలని నిజం నిగ్గు తేల్చాలని, తల్లిదండ్రుల యొక్క అనుమానాన్ని తీర్చాలని సిసి ఫుటేజ్ మరియు చెరువుగట్టు పరిసర ప్రాంతాలు గ్రామంలో ప్రధాన రహదారులు ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ మొత్తం పరిశీలించి నిజం తేల్చాలని జిల్లా పోలీస్ అధికారికి ఆదేశించిన మంత్రివర్యులు. తల్లిదండ్రులతో మాట్లాడుతూ బంధుప్రీతి కులప్రీతి ప్రాంతీయ ప్రీతి రాజకీయ ప్రీతికి తావు లేకుండా అన్నిటికీ అతీతంగా న్యాయం జరిగేటట్లు మీకు అన్ని విధాల న్యాయం చేస్తానని ధర్మాన్ని గెలిపిస్తానని, ఈ విషయంలో మీకు అన్యాయం జరిగినట్లు తేల్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని మంత్రివర్యులు మాట ఇచ్చారు.

# ఆంధ్రాభద్రాద్రిగా రామదుర్గం క్షేత్రాన్ని అభివృద్ధి చేసుకుందాం

**- బిజెపి సీనియర్ నేత ఏపీ ఆర్ చౌదరి**



**గోకవరం (మనసులో మాట), మార్చి 21 :** పురాతన పుణ్యక్షేత్రం రామదుర్గం ఆలయానికి రహదారి నిర్మాణము చేయిస్తున్న బిజెపి సీనియర్ నాయకులు ఎపిఆర్ చౌదరి, మట్టా మంగరాజు వచ్చే శ్రీరామనవమికి వేలాదిగా వచ్చే భక్తులకు సౌకర్యార్థం గేవల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని ఏపీ ఆర్ చౌదరి, మట్టా మంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్ చౌదరి మాట్లాడుతూ భద్రాచల క్షేత్రం తెలంగాణకు వెళ్ళిపోయిందని, రామదుర్గం క్షేత్రాన్ని మన ప్రాంతానికి ప్రధాన శ్రీరామ క్షేత్రముగా అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత మన ప్రాంతంలో ఉన్నటువంటి రామ భక్తులందరి పైన ఉందన్నారు. అందుకోసం ఈ సంవత్సరము నుండి శ్రీరామ నవమి ఉత్సవాలు రామదుర్గం కొండపైన అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు

# ద్వారపూడి లో ఘనంగా రంజాన్ వేడుకలు

**మస్జిద్ లో ఈదుల్ ఫితర్ ప్రార్థనలు**



**మండపేట (మనసులో మాట ) మార్చి 21..** మండపేట మండలం ద్వారపూడి లో ఘనంగా రంజాన్ పండుగ నిర్వహించారు. ఈదుల్ ఫితర్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్ కరిముల్లా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మానవాళి కి శుభ సందేశం అందజేసేందుకు మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా రసులుల్లాహ్ సల్లెలహు వ అలైహి వ సల్లెం వారి కి ఆ అల్లాహ్ దివ్య ఖురాన్ ను అవతరింపజేశారని చెప్పారు. ఈ దివ్య ఖురాన్ ఈ నెల లోనే భువి పై అవతరించిందని పేర్కొన్నారు. ఖురాన్ బోధనలు సర్వ మానవాళి కి ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ ఇస్లాం ప్రకారం నడుచుకోవాలన్నారు. ఐదు పూటల నమాజ్ ఆచరించాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మస్జిద్ ఇమామ్ కరిముల్లా, కమిటి చైర్మన్ డాక్టర్ వలీషా, సభ్యులు అఖి సిరాజుద్దీన్,ఇబ్రహీం, బషీర్, మదీన్న, రఫీ, బాబులు పెద్ద సంఖ్యలో ముస్లిం లు పాల్గొన్నారు.

# కిర్లంపూడి మదీనా జామియా మసీదులో ఘనంగా రంజాన్ వేడుకలు



**కిర్లంపూడి,(మనసులో మాట) మార్చి 21..** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మదీనా జామియా మసీదులో రంజాన్ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు.పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని గత నెల రోజులుగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో,ఉపవాస దీక్షలు నిర్వహించారు.శుక్రవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ఆనందం వ్యక్తం చేశారు.దీంతో రంజాన్ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఉదయం మండల కేంద్రమైన కిర్లంపూడిలో ఉన్న మండలంలోని పలువురు ముస్లిం సోదరులు మదీనా జామియా మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మత గురువు షంశుల్ హక్ పవిత్ర రంజాన్ మాసం ప్రత్యేకతను,రంజాన్ వేడుకల విశిష్టతను అందించిన సందేశం ముస్లిం సోదరులు శ్రద్ధగా ఆలకించారు.ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు హత్తుకుని ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం సంతోషంగా గడిపారు.ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ శాంతి, ప్రేమ, ఐక్యతకు రంజాన్ మాసం ఎంతో ప్రతీక అన్నారు.ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ షాబుద్దీన్, కోశాధికారి షేక్ కాలేషా, గౌరవ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, ఎండి ఖయ్యుం భాషా, షేక్ బషీర్, షేక్ కరీముల్లా అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.



# నిర్లక్ష్య నీడన కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి




**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** నిర్లక్ష్య నీడలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఉందనేందుకు నిదర్శనం గురువారం రాత్రి సుమారు 8 గంటల నుంచి గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఎమర్జెన్సీ వార్డు ఎదుట పడి ఉండగా, ఉదయం వరకు ఎవరూ ఆమెకు ప్రాథమిక చికిత్స అందించలేదు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, మహిళ కళ్లెదుటే కష్టంలో ఉన్నా వైద్య సిబ్బందిలో కదలకలేదు.ఆ మహిళాని కనీసం వార్డులో చేర్చే బాధ్యత గల డాక్టర్లు, మెడికల్ మేనేజ్‌మెంట్ అధికారులు (ఎం ఎన్ ఓ లు) కూడా స్పందించలేదని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్రజలు, రోడ్డుపై పడిపోయినవారికి సహాయం చేసే మనుషులు ఆసుపత్రిలో ఎందుకు నిర్లక్ష్యం చూపారు? అని యాజమాన్యాన్ని నిలదీస్తున్నారు. ఈ ఘటన ప్రభుత్వ వైద్య వ్యవస్థపై భిన్నమైన ప్రశ్నలను రేకెత్తిస్తోంది. స్థానికులు బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఇలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ పునరావృత మవుతాయని ఆందోళన వ్యక్తమవుతోందని విమర్శలు వస్తున్నాయి.

# ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలవిరాళం



**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 21 :** స్థానిక చెట్టు బలిజ పేట నాలుగో వార్డులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాలయానికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ రూ. లక్ష విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం కమిటీ సభ్యులకు లక్ష రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి చిన్న, పార్టీ నాయకులు ఆలం దొరబాబు, మేళం ప్రసాదు, చింతాకుల రాజు, చింతాకుల వీరలక్ష్మి, చింతాకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో రంజాన్ వేడుకలు



**పిఠాపురం, ( మనసులో మాట) మార్చి 21:** పిఠాపురంలో ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. స్థానిక కత్తుల గూడెం వీధిలో గల మసీదు నందు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని అనంతరం వారికి స్వీట్లను పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# హిందూ,ముస్లింలు అన్నదమ్ముల భావనతో కలిసికట్టుగా మరింత ముందుకు పయనించాలి



**ఏలూరు, మార్చి 21(మనసులో మాట)..** ప్రజలందరికీ మంచి జరగాలనే అత్యున్నత ఆశయంతో పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు నిర్వహించడం ఎంతో గొప్పవిషయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇదేరీతిలో ఎల్లప్పుడు హిందూ, ముస్లింలు అన్నదమ్ముల భావనతో కలిసికట్టుగా మరింత ముందుకు పయనించాలని ఆకాంక్షించారు. ఏలూరు పాత బస్టాండ్ సమీపంలోని కర్బలా మైదానంలో అంజుమన్ ఏ ముహాఫిజుల్ ఇస్లాం ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి జరగాలనే అత్యున్నత ఆశయంతో ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు నిర్వహించడం ఎంతో గొప్పవిషయమన్నారు. పేదవానికి సాయం చేయాలనే సిద్ధంతాన్ని రంజాన్ బోధిస్తుందని గుర్తుచేశారు. ఇదేక్రమంలో హిందూ, ముస్లింలు సోదరభావనతో కలిసికట్టుగా మరింత ముందుకు పయనించాలని ఆయన ఆకాంక్షించారు. గత 15 ఏళ్ల నుంచి తాను ఇక్కడ జరిగే రంజాన్ వేడుకలలో పాల్గొంటున్నానని తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# శివారు గ్రామాలలో జోరుగా ఎన్నికల ప్రచారం

**రెండవ రోజు ఇంటింటా టీవీకే పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటరాజు ప్రచారం**



**యానాం (మనసులో మాట) మార్చి 21:** కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గం పరిధిలోని శివారు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. రెండవ రోజు తన ఎన్నికల ప్రచారాన్ని టీవీకి పార్టీ అభ్యర్థి తోటరాజు ముమ్మరం చేశారు. రెండవ రోజు అదే జోరుతో తోటరాజు ఇంటింటా విజయ్ దళపతి ఎన్నికల హామీ మేనిఫెస్టో హామీల కరపత్రాలను అందిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తూ ముందుకు సాగారు. యానం శివారు ప్రాంతమైన సీతారాం నగర్, పరం పేట గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. మొబైల్ వ్యాన్లో బుర్రకథ చెబుతూ టీవీ కే మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కడలి సుబ్రహ్మణ్యం, విత్తనాల సత్యనారాయణ, సూరంపూడి చంద్రశేఖర్, పోతుల శివకృష్ణ ,నందికి భాస్కర్ శ్రీనివాస్, కోన సూరిబాబు, బిక్కు, పెమ్మడి వీరలక్ష్మి, అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏడు శనివారాల వెంకన్న దర్శించిన తుని ఎమ్మెల్యే యనమల దివ్య



**కొత్తపేట మనసులో మాట మార్చి 21..** ఏడు శనివారాల పేరు పొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకున్నారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం,చేయించి వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

# ఉపాధ్యాయుడు గొల్లపల్లికి ఉగాది పురస్కారం



**అనపర్తి( మనసులో మాట ) మార్చి 21:** తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ స్పందన సమావేశ మందిరంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ మేఘా స్వరూప్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా అనపర్తి శాసనసభ్యులు నల్లమల్లి రామకృష్ణారెడ్డి, రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు బుచ్చి చౌదరి, ఎమ్మెల్సీ ఆకుల వీర్రాజు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పులుగుర్త ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గొల్లపల్లి సత్యనారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించి ఆద్యాంతం రక్తి కట్టించారు. మీరు రచించిన " నేను మీ అమ్మను- ఉగాది" అనే కవిత అందరినీ ఆకట్టుకుంది. సత్యనారాయణను జె.సి మేఘా స్వరూప్, రాజమండ్రి మునిసిపల్ కమిషనర్ రాజీవ్ మీనా, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి కె. వాసుదేవరావులు సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

శాంతి సందేశం... స్వీయ నియంత్రణ.... శుభాలు కురిసే రంజాన్...

# ఘనంగా ఈదుల్ ఫితర్ ప్రార్థనలు

**పోటెత్తిన ముస్లింలు - మండపేటలో రంజాన్ పండుగ**



**మండపేట (మనసులో మాట ) మార్చి 21..** సర్వమతల శాంతి సామరస్యం,సౌభ్రాతృత్వం ఇస్లాం మతం కోరుకుంటుందని మండపేట హానఫీ అహలే సున్నత్ వల్ జామియా మస్జిద్ ఇమామ్ ముహమ్మద్ గులామ్ ముర్షిద్ రజ్వీ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా మండపేట కలువ పువ్వు సెంటర్ లో హనీఫీ అహలే సున్నత్ వల్ జామియా మస్జిద్ లో ఈదుల్ ఫితర్ ప్రార్థనలు శనివారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల ముస్లింలు నమాజ్ ప్రార్థనలకు పోటెత్తారు. ముప్పై రోజులు పాటు కఠిన ఉపవాసాలు పూర్తి చేసి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమామ్ ముహమ్మద్ గులామ్ ముర్షిద్ రజ్వీ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రపంచ శాంతి సామరస్యం సౌభ్రాతృత్వం ఇస్లాం కోరుకుంటుందన్నారు. ఈ నెల రోజుల శిక్షణ స్వీయ నియంత్రణ ను నేర్పిస్తుందని చెప్పారు. పర మత సహనం సోదరభావం తో జీవనం సాగించాలని కోరారు. ప్రస్తుతం సమాజం లో మతం పేరిట విధ్వంసం చేస్తున్న వారికి ముస్లిం లకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా రసులుల్లాహ్ సల్లెలహు వ అలైహి వ సల్లెం వారు జీవితాంతం శాంతి ను బోధించి విశ్వాసులకు దిశ నిర్దేశం చేశారని గుర్తు చేశారు. ప్రేమ తో హృదయాలు గెలవాలని దివ్య ఖురాన్ లో అల్లాహ్ ఆదేశిస్తారని చెప్పారు. హింస అశ్లీలత, అవినీతి,పక్షపాతం కు ఇస్లాం లో స్థానం లేదని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇరాన్ యుద్ధం ముగియాలని ప్రార్థించారు. అణగారిన, నీరు పేదలకు ప్రతి ఒక్కరూ దానధర్మాలు చేయాలని కోరారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం జామియా మస్జిద్ లోని శ్మశాన వాటికలో పూర్వీకుల సమాధులు వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. మండపేట రైతు బజార్ వద్ద గల ముస్లిం షాది ఖానా వద్ద మండపేట సైదులు పేట లోని హాజరత్ హంజా మస్జిద్ గాంధీనగర్ లోని అల్ అమీనా మస్జిద్ విజయ లక్ష్మీ నగర్ లోని అక్సా మస్జిద్ కు చెందిన ముస్లిం లు ఈద్ నమాజ్ ఆచరించారు. అక్కడ ఆయా మసీదు బాధ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రార్థన ప్రాంతాల్లో సి ఐ దొర రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి, రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు కామన ప్రభాకరరావు, బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ తదితరులు ముస్లిం లకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం లు ఎక్కువగా నివసించే గాంధీనగర్, రావుల పేట, సైదుల పేట, విజయలక్ష్మి నగర్ లలో రంజాన్ సందడి కనిపించింది. ముస్లిం లు సేమియా, బిర్యానీ లు స్నేహితులకు పంపిణీ చేశారు. నూతన వస్త్రాలు, అలంకారాలు, అత్తరు, సెంటు పరిమళాలు వెదజల్లయ్యాయి .

# రామవరం గ్రామ వైయస్ఆర్‌సీపీ పోలింగ్ బూత్ గ్రామ కమిటీల పూర్తి నిర్మాణం

- అభినంధించిన డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి
- పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో కమిటీల రూపకల్పన
- గ్రామ కమిటీలతో పాటు అనుబంధ విభాగాల సమగ్ర నిర్మాణం
- 126 మంది సభ్యులతో గ్రామ కమిటీలు 4 పోలింగ్ బూత్‌లకు ప్రత్యేక కమిటీలుపారదర్శకతతో ఆధార్ ఓటర్ ఐడి వివరాల సమగ్ర నమోదు
- రామవరం గ్రామ నాయకుల కృషి అభినందనీయం డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



**అనపర్తి (మనసులో మాట) మార్చి 21:** అనపర్తి మండలం రామవరం గ్రామంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ కేంద్ర కార్యాలయం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గ్రామ కమిటీలు, పోలింగ్ బూత్ కమిటీలను పూర్తిస్థాయిలో నిర్మించి, వాటి ప్రతులను అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కి గ్రామ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రామవరం గ్రామ వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కమిటీతో పాటు అనుబంధ విభాగాలన్నింటినీ సమగ్రంగా ఏర్పాటు చేశారు. మొత్తం 126 మంది సభ్యులతో గ్రామ కమిటీని రూపొందించగా, గ్రామంలోని నాలుగు పోలింగ్ బూత్‌లకు ప్రతి బూత్‌కు 11 మంది చొప్పున మరో 44 మంది సభ్యులను ఎంపిక చేసి బలమైన బూత్ స్థాయి వ్యవస్థను నిర్మించారు. ఈ కమిటీలలో సభ్యుల పూర్తి వివరాలతో పాటు ఫోటోలు, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీలు సేకరించి నమోదు చేసినట్లు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి వివరించారు. పార్టీ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకతతో కమిటీలను రూపొందించడం పట్ల డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గ్రామ నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, "రామవరం గ్రామంలో ఎంతో తక్కువ సమయంలో అన్ని కమిటీలను సమర్థవంతంగా పూర్తి చేసి అందించడం పార్టీ బలోపేతానికి గొప్ప ఉదాహరణ. గ్రామ నాయకుల కృషి నిజంగా అభినందనీయం" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అనపర్తి మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), పంచాయతీ వార్డు సభ్యులు తాడేలు వెంకన్న, మండల పార్టీ కార్యదర్శి కర్రి గాంధీ రెడ్డి, గ్రామ బీసీ సెల్ అధ్యక్షుడు మంతిన అప్పారావు, గ్రామ యువజన విభాగం అధ్యక్షుడు చింతా ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు పులగం వెంకటరెడ్డి, కర్రి శ్యాం ప్రసాద్ రెడ్డి, కె. తేజా పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్టు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**గండేపల్లి (మనసులో మాట)మార్చి 21..** ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులకు పరిష్కారంగా 5 లక్షల రూపాయలతో కల్వర్టు నిర్మాణానికి నిధులు సమకూర్చిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ. శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించిన గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, టిడిపి నాయకులు. మండల కేంద్రం మైన గండేపల్లి లో మంచినీటి చెరువుగట్టు వద్ద వర్షాకాలం నీరు బయటకు వెళ్లకుండా నీరు నిల్వ ఉండిపోయి స్కూలుకి వెళ్లే విద్యార్థులకు మండలంలోని పలు గ్రామాలనుంచి తమ అవసరాలు నిమిత్తం ఎమ్మార్వో ఆఫీస్, ఎండిఓ ఆఫీస్, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలకు గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారిని స్మశాన వాటిక కు తరలించే దారిలో నీరు నిలవ ఉండిపోయి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జగ్గంపేట శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండల సభ్యులు జ్యోతుల నెహ్రూ దృష్టిలో పెట్టగా ఆయన వెంటనే స్పందించి కల్వర్టు నిర్మాణం నిమిత్తం ఆర్ అండ్ బి నిధులనుండి 5 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగింది . శనివారం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి రామయ్య వెంపాటిరాజు, ఆళ్ల సత్తిబాబు, పోతుల బుల్లి దొర, చంద్రు బ్రహ్మారాజు, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, నాళం వీరబాబు, బోల్లిన వేణు, కంటిపూడి జిమ్మీ, చనుమూరి అప్పారావు, ఉండవిల్లి రాధాకృష్ణ, చెక్కపల్లి శ్రీను, బుగత నూకరాజు, గరిగిపాటి రమణ,తణుకు వీర వెంకట సత్యనారాయణ, పేరారపు రాజేంద్రప్రసాద్, గుర్రం శేఖర్, శెట్టి బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర విశ్వ హిందూ పరిషత్ పిలుపు మేరకు.. లింగంపర్తి లో విశ్వహిందూ పరిషత్ సత్సంగం



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చ్ 21..** ఏలేశ్వరం విశ్వహిందూ పరిషత్ వారు శ్రీ రామ మహోత్సవం లు లింగం పర్తి గ్రామం లో గల శ్రీ సీతా రామ దేవాలయం లో సత్ సంఘ్ అక్కడ ఉన్న లలితాసత్సంగ వారు., ఊరి పెద్దల వి. హెచ్. పి మహిళలు, విజయదుర్గ అమ్మ వారి గుడి ధర్మకర్తలు అందరితో కలసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో శ్రీ రామ రక్షా స్తోత్రాలు. హనుమాన్ చాలీసా, రామ భక్తి పాటలు, గోవింద నామాలు, చదువుట జరిగినది. ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు.వి.హెచ్. పి జిల్లా సాంస్కృతి విభాగ్ కన్వీనర్, కటకం. కిరీటి బాబు మండల విహెచ్పి కార్యదర్శి,. పి . దేవి, లింగంపర్తి ఖండ మహిళ అధ్యక్షురాలు. బి సుగుణ, పి మాధురి, అనంతలక్ష్మి, పెంటకోట మోహనరావు ఏలేశ్వరం విహెచ్పి మహిళ లు గిరిజ, కామాక్షి, కుమారి, లక్ష్మి, సత్యవతి, జ్ఞాన శ్రీవిద్య, హైమావతి, బేబీ, మొదలగు వారు పాల్గొన్నారు.అధిక సంఖ్య లో ఈ పాల్గొన్న సభ్యులకు, భక్తులు కు లింగం పర్తి విహెచ్ పి ఖండ మహిళ అధ్యక్ష, కార్యదర్సులు సుగుణ మాధురి లు సీతల పానీయాలు ప్రసాదాలు పసుపు కుంకుమ లు అందరికి అందించారు. వారికి జిల్లా వి హెచ్ వి తరపున అభినందనలు తెలియజేసారు.



# సమాజ మార్పు కోసమే కవిత్వం

**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** సమాజ మార్పు కోసం వారి వారి హావ భావాలకు అక్షర రూపం ఇచ్చేది కవిత్వమని ప్రముఖ కవి శిరీష పేర్కొన్నారు. కాకినాడ లోని రమణయ్య పేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కవిత్వ దినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రుగ్మతలను పారద్రోలేందుకు, జనాన్ని జాగృతం చేసేందుకు ఉపయోగపడే పదునైన ఆయుధం కవిత్వమన్నారు. కవిత్వానికి చదువు ,వయసుతో సంబంధం లేదని సృజనాత్మక ఉంటే జగతిని జాగృతం చేయవచ్చు అని అన్నారు. కవిత్వం కేవలం ఆనందం కోసం కాకుండా సమాజ ప్రయోజనం లోతుల్లోంచి రావాలని అన్నారు. నిజాన్ని నిర్భయంగా వ్యక్తం చేసేది కవిత్వమని శిరీష తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో శిరీషను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, కుమార్ యాదవ్ ,రాజా, పి. ధర్మచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుతో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దు..

**- సీఐ శ్రీనివాస్**




**పిఠాపురం, మనసులో మాట మార్చి 21:** స్థానిక ఆర్ఆర్‌బీ హెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం సాయంత్రం మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మత్తు పదార్థాలు ప్రధాన అడ్డంకి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై మణికుమార్, పోలీస్ సిబ్బంది,స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకై పటిష్టమైన చర్యలు



**కొత్తపేట మనసులో మాట మార్చి 21..** అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్ పి రాహుల్ మీనా , కొత్తపేట ఋూ సుంకర మురళీ మోహన్ ఉత్తర్వుల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగముగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనమునకు వచ్చే భక్తులకు రావులపాలెం రూరల్ సిఐ జష్ట విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము,సిబ్బంది హెల్మెట్ ల వినియోగం పై సుమారు 50 మంది వాహన దారుల కు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కొత్త చట్టాల ప్రకారం శిక్షలు విధించడం జరుగుతుందని వాహనదారులకు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, అదే విధముగా హెల్మెట్ ను తప్పని సరిగా ధరించాలని, తమ కోసం ఇంటి వద్ద భార్య, పిల్లలు తల్లితండ్రులు ఎదురుచూస్తూ ఉంటారనే విషయాన్ని వాహనదారులకు సూచించారు.

# బీజేపీలోకి కుండల హేమంత్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 21..** భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లోకి కాకినాడ నగరానికి చెందిన యువ నాయకుడు కుండల హేమంత్ కుమార్ యాదవ్ చేరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కుండలకు పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రధాని మోదీ కార్యదీక్ష, పార్టీ పట్ల ఆకర్షితులై తాను బీజేపీకి చేరినట్లు చెప్పారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా హేమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుండల సాయి కుమార్ యాదవ్, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, శంకర్ సింగ్, గీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



## జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో

# గ్రామీణ ఆరోగ్య హక్కు సాధనలో ముందడుగు

### - ఉండ్రాజవరం లో మెగా ఉచిత వైద్య శిబిరం

**నిడదవోలు (మనసులో మాట) మార్చి 21..** ఉండ్రాజవరం గ్రామంలోని ఆర్య వైశ్య కళ్యాణ వేదికలో శనివారం జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరం స్థానిక ప్రజల నుండి విశేష స్పందన పొందింది. ఈ శిబిరంలో తణుకు ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఆర్.కే. నాయుడు శ్వాసకోశ సంబంధిత సమస్యలపై పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు అందించారు అలాగే హైదరాబాద్‌కు చెందిన దంత వైద్య నిపుణురాలు డాక్టర్ బి. రవళి దంత సమస్యలపై చికిత్స అందించారు. నిడదవోలు జాగృతి కంటి వైద్యశాల అసిస్టెంట్ డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించి, పలు రోగులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 110 మందికి పైగా ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.

అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ఎన్ హెచ్ ఆర్ పి ఫోరమ్ ఉండ్రాజవరం మండల అధ్యక్షులు వద్రే రమేష్ బాబీ, సెక్రటరీ కోటిపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులు గంట ప్రభాకర్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఆర్ పిపశ్చిమ గోదావరి జిల్లా సెక్రటరీ ఐ. శేషాద్రి మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ఆరోగ్య సేవలు అందరికీ చేరువవుతాయి" అని తెలిపారు. అలాగే ఎన్ . హెచ్.ఆర్.పి తణుకు నియోజకవర్గ ఇంచార్జ్ గాదంశెట్టి జయకృష్ణ , నిడదవోలు నియోజకవర్గ ఇంచార్జ్ అడపా బాలు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న

కటకం రాఘవ ( ఎ పి హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్), బుద్దాల దుర్గాప్రసాద్ (ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త అసిస్టెంట్) సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో ఇలాంటి శిబిరాలు కీలకమని పేర్కొన్నారు.

# హెచ్పీసీఎల్ గ్యాస్ కాంట్రాక్ట్ వర్కర్స్ నల్ల రిబ్బనులతో నిరసన



**గోకవరం (మనసులో మాట), మార్చి 21 :** గోకవరం మండలం గోకవరం శివారు వీర్లంకపల్లి గ్రామంలో ఉన్న రాజమండ్రి ఎల్పిజి ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్మికులుగా గత 15 సంవత్సరాలుగా రాజమండ్రి హెచ్పిసిఎల్ ఎల్పిజి ప్లాంట్ లో గతంలో ఉన్న కాంట్రాక్టర్ 2024లో జూన్, ఆగస్ట్, సెప్టెంబర్, 2025లో మే, జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మొత్తం 8 నెలలు పిఎఫ్ చెల్లించవలసి ఉందన్నారు. ఈ విషయం పై మేనేజ్మెంట్ తో, కాంట్రాక్టర్ తో అనేకసార్లు మాట్లాడిన సమస్య పరిష్కారం అవ్వడం లేదన్నారు. అలాగే మరొక కాంట్రాక్టర్ 2022లో రెండు నెలల పబ్లిక్ హాలిడేస్ చెల్లించాలన్నారు. అలాగే వేరొక కాంట్రాక్టర్ 2022 ఆగస్టు నుండి 2023 నవంబర్ వరకు గల పబ్లిక్ హాలిడేస్ వేతనాలు చెల్లించ వలసి ఉందన్నారు. ఈ విషయం పై కూడా మేనేజ్మెంట్ తో, కాంట్రాక్టర్ తో అనేకసార్లు మాట్లాడిన తమకు మాత్రం సమస్య పరిష్కారం అవడం లేదన్నారు. అలాగే 10, 15 సంవత్సరాల నుంచి హిందుస్థాన్ పెట్రోలియం గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్న తమకు ఎటువంటి స్కిల్ డెవలప్మెంట్ లేకపోవడం, అలాగే గ్యాస్ కంపెనీ అనేది రిస్క్ తో కూడినది అయినా కూడా తమకు ఎటువంటి రిస్క్ అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. పై విషయాలు అన్నీ మేనేజ్మెంట్ వారిని, కాంట్రాక్టర్ ని అనేక సార్లు అడిగిన వారు సమస్యను పరిష్కారం చేయలేకపోతున్నారన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎవరికి చెప్పుకోవాలో ఎలా చెప్పుకోవాలో తెలియక మార్చి 11వ తేదీన రాజమండ్రి ఎల్పీజీ ప్లాంట్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ తమ సమస్యలను పరిష్కరించమని మేనేజ్మెంట్ కి సమ్మె నోటీస్ ఇచ్చామని దాంట్లో భాగంగానే శనివారం తమ విధులను నిర్వర్తిస్తూ నలుపు రంగు రెబ్బన్నతో నిరసన వ్యక్తం చేసామన్నారు. ఈనెల 26వ తేదీకి సమస్యలు పరిష్కరించని పక్షాన సమ్మెలోకి దిగుతామని రాజమండ్రి హెచ్పీసీఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తెలిపారు.

# కేదార్లంక గోదావరినది ఒడ్డున పొంచి వున్న పెను ప్రమాదం..

### 20 అడుగుల లోతు అక్రమ తవ్వకాలు - పట్టించుకోని సిబ్బంది...





**కపిలేశ్వరపురం (మనసులో మాట )మార్చి 21..** తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ప్రకృతి అందాలకు నిలయంగా ప్రఖ్యాత ప్రసిద్ధిగాంచిన ధనమ్మ తల్లి అమ్మవారి ఆలయం, సినిమా షూటింగ్ అనుకూల ప్రదేశంగా ఎంతో మంది పర్యాటకులు వచ్చే కేదార్లంక గ్రామం గోదావరి నది ఇప్పుడు చాలా అత్యంత ప్రమాదకరంగా మారింది. వచ్చే 2027 ఏడాది పుష్కరాలకు ఈ రేవు పుష్కరాల రేవు గా నిర్మించవలసివుంది కానీ మట్టి మాఫియా సుమారు 20 అడుగులు లోతుగా మట్టిని త్రవ్వి ప్రక్కనే ఉన్న ఇటుక బట్టిలకు తరలిస్తున్నా,అక్కడ విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు గాని,మైనింగ్ అధికారులు సైతం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుచున్నారు. అక్రమ రాయుళ్ళు ప్రతి రోజు అర్ధరాత్రి సమయాల్లో గోదావరి నది ఒడ్డునే చెట్టు లోతు గుంతలను అక్రమంగా తవ్వేసి గుంతలను అలానే వదిలేస్తున్నారు. ఇలాంటి తవ్వకాల వల్ల నీరు ఉన్న సమయంలో అవగాహనా లేని పర్యాటకులు ఎంతోమంది మృత్యువాత పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కానీ దారుణాతి దారుణంగా ఒడ్డు పక్కనే ఇలాంటి అక్రమ పనులు చేస్తున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం పై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నది వద్దున ఈ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయకపోతే రానున్న రోజుల్లో కేదార్లంక గ్రామం మొత్తం వరదల సమయం లో కనుమరుగయ్యే ప్రమాదం, అవకాశాలు ఉన్నాయని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు.

# విగ్రహాల సెంటర్ నామకరణ లో రాజకీయం తగదు...

### - జాతీయ నాయకుల సెంటర్ విగ్రహాల కన్వీనర్ మందపల్లి రవికుమార్...

### - ఎస్ సి ఎస్ ఎస్టీ బిసి ల సమావేశం...



**మండపేట (మనసులో మాట ) మార్చి 21..** మండపేట విగ్రహాల సెంటర్ నామకరణ లో రాజకీయం తగదని జాతీయ నాయకుల సెంటర్ విగ్రహాల కన్వీనర్ మందపల్లి రవికుమార్ పేర్కొన్నారు. మండపేట ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ లో ఎస్సీ, ఎస్టీ, బిసి నాయకులు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణా ప్రణాళిక చర్చించారు. ఈ సమావేశంలో సామాజిక వర్గాల నాయకులు మాట్లాడుతూ మండపేటలో ఎప్పుడు కులమత విభేదాలు లేకుండా అందరూ సామరస్యంతో కలిసిమెలిసి ఉండే వాళ్ళమని పేర్కొన్నారు. కొంతకాలంగా రాజకీయాన్ని పులుముతూ కులాలకు ఆపాదిస్తున్నారని విమర్శించారు. జాతీయ నాయకులను అవమానించే విధంగా జరుగుతున్న పరిణామాలు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అర్థం చేసుకుని ఎటువంటి విభేదాలు లేకుండా ముందుకు సాగే విధంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. తరతరాలుగా సామాజిక, ఆర్థిక విద్యాపరంగా అణిచివేతకు, వివక్షకు గురవుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలను ఆదుకునే క్రమంలో జ్యోతిరావు పూలే, బాబు జగజ్జీవనరావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి మహా నాయకులు విగ్రహాలు ఊరు చివర దళిత పేటల్లోనూ వెనకబడిన కులాల వాడల్లో మాత్రమే ప్రతిష్ట చేస్తున్నారన్నారు. ఊరి నడిబొడ్డున విగ్రహాలను ఏర్పాటు చేయడం మంచిదని తామంతా తలంపు చేసి వాణిమహల్ సెంటర్ లో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ఉన్నచోట కౌన్సిల్ తీర్మానంతో జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆ సెంటర్ కి జాతీయ నాయకుల సెంటర్ గా నామకరణం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నామకరణం వలన ఒక నాయకుడికి మంచి పేరు వస్తుందని మరో రాజకీయ పార్టీ నాయకులు అడ్డుకోవడం చాలా హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ సమావేశంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాతీయ బిసి సంఘం గౌరవ అధ్యక్షులు వీరమల్లు శ్రీనివాస్, జాతీయ బీసీ సంఘం మండపేట పట్టణం అధ్యక్షులు మల్లువలస గణపతి, బీసీ నాయకులు యర్రగుంట మణికంఠ కుమార్ జాతీయ నాయకుల సెంటర్ విగ్రహాల కన్వీనర్ మందపల్లి రవికుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉండ్రాజవరపు అర్జున్, మాల మహానాడు కార్యనిర్వాహక కార్యదర్శి సన్మాల ధనరాజు, దండింగి చిన్నబాబు అధిక సంఖ్య లో సెంటర్ విగ్రహాల కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను జరపుకున్న ముస్లింలు



**అనపర్తి (మనసులో మాట) మార్చి 21:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులో నెల రోజుల పాటు నిష్టతో కఠోర ఉపవాసదీక్షలను పాటించిన ముస్లీం సోదరులు శుక్రవారం సాయంత్రం, షవ్వాల్ నెల వంకను వీక్షించడంతో దీక్షలను విరమించి శనివారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. శాంతికి చిహ్నంగా జరుపుకునే రంజాన్ సందర్భంగా మసీదు కు విద్యుత్ దీపాలతో అందంగాఅలంకరించారు. ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఆడవారు, పిల్లలు, పెద్దలు ఇంటివద్ద నమాజు చేసుకున్నారు. అలాగే మగవాళ్లులు మసీద్ వద్ద ఖుద్బా నమాజు చేశారు. ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అలాగే మసీదు వద్ద పేదలకు దానధర్మాలు చేశారు. కుల మతాలకు అతీతంగా హిందూ సోదరులు ముస్లీం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు. బంధువులను, స్నేహితులను ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. పందలపాక బిలాల్ మస్జిద్ మత గురువు మోలాన్ షేక్ గులాం గౌస్ రిజ్విపాటు మాట్లాడుతూ నెల రోజులుగా ఉపవాసాలు, ప్రార్థనలు చేయడం ద్వారా అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరు పొందినట్లు చెప్పారు. సేమియా కిర్,హాలీమ్,బిర్యానీలు తయారు చేయడం పలు రకాలు పండ్లును ఇఫ్తార్ విందులు జరిగాయన్నారు. ఫ్రితా జకాత్,దాన ధర్మాలు చేయడం ద్వారా పుణ్య ఫలాలు ఇహా పరలోకాలలో సాఫల్యం పొందుతారని తెలిపారు. సామరస్య పూర్వకంగా అన్ని మతస్తులు అన్నదమ్ముల వలే ఉండాలన్నాని సందేశం ఇచ్చారు. ప్రత్యేక నమాజలు, రంజాన్।అలాగే బిక్కవోలు గ్రామంలోని మదీనామసీజీద్ వద్ద ఇమాన్ (గురువు) మొహమ్మద్ షజాహద్ అష్రఫి. ప్రత్యేక నమాజలు,రంజాన్ సందేశం వివరించారు. అలాగే పందలపాక గ్రామంలోని మరో అహల్లె సున్నత్ వలె జమాతే జామియా మసీదు లొను , బలభద్రపురంలో మసీద్లోనూ ముస్లింలు నమాజులో పాల్గొన్నారు. పందలపాకలో మసీద్ నమాజ్ సందేశం తెలుపుతున్నా మోలానే షేక్ గులాం గౌస్ రిజ్వి పందలపాకలో మసీద్ లో నమాజ్ చేస్తున్నా ముస్లీంలు.

# గోవాలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించిన జగ్గంపేట కళాకారిణిలు





**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 21** తెలుగు వారి జీవనాడి కూచిపూడి అని కూచిపూడి నాట్యాన్ని , తెలుగు వారి పెద్ద పండగ అయినటువంటి ఉగాది రోజున మా గురువు కళారత్న డా చింతా రవిబాలకృష్ణ సారధ్యంలో వారి శిక్షణలో వారి నేతృత్వంలో గోవా మహానగరంలో కూచిపూడి నాట్య వైభవాన్ని ప్రదర్శించామని ఉగాది రోజున ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, గోవా తెలుగు అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమాలు జరిగాయని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మన తెలుగు బిడ్డ గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ముఖ్యఅతిథిగా ఈ నృత్యాన్ని చూసి గవర్నర్ కళాకారుణిలను ప్రశంసలు అందించి అభినందించారు.

కూచిపూడి నృత్య గురువు విజయలక్ష్మి తెలియజేశారు. ఈ సందర్భంగా జగ్గంపేట చేరుకున్న ఆమె మాట్లాడుతూ ఉగాది వేడుకల్లో మా పాప గురువు బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయడానికి గోవా ముఖ్య పట్నం పనాజీ వెళ్లడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట కళాకారుణిలు ప్రదర్శించినటువంటి కూచిపూడి నృత్యాన్ని తిలకించిన ప్రేక్షకులు మంత్రముగ్ధులయి మమ్ములను మనసుపూర్తిగా ఆశీర్వదించి ప్రతీ ప్రదర్శనకు స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడం జరిగింది అని ఎక్కడో గోవా రాష్ట్రంలో మాకు జరిగిన ఈ గౌరవానికి మా సంతోషానికి అవధులు లేవు అని మా ప్రదర్శనలు ఎల్లప్పుడూ ఇలాగే సంపూర్ణ మద్దతు కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని మాకు అన్ని విధాలా సహకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు ధన్యవాదాలు .కూచిపూడి నృత్య గురువు ముళ్ళపూడి. విజయలక్ష్మి.

ఉగాది పండగ రోజున ఇంతటి గొప్ప అవకాశం ఇచ్చినటివంటి మా గురువుగారు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డ్ గ్రహీత చింతా రవిబాలకృష్ణ కి, తెలుగు భాషా సాంస్కృతిక శాఖ వారికి , అలాగే తెలుగు సంఘం గోవా వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటు కూచిపూడి నృత్య టీచర్ ముళ్ళపూడి విజయలక్ష్మి తెలియజేశారు.



# వాడపల్లి వెంకన్న దర్శించిన ప్రముఖ సినీ నటులు

**కొత్తపేట మనసులో మాట మార్చి 21..** కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం ప్రముఖ సిని నటులు తనికెళ్ల భరణి, గౌతమ్ రాజు, దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు. ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి చిత్రపటం చేశారు.

# బాధిత కుటుంబానికి భరోసా

### అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి ఆర్థిక సహాయం



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 21:** బాధిత కుటుంబానికి వైఎస్సార్సీపీ నాయకులు అండగా ఉంటామని భోరోసా కల్పించారు. గోవలంక గ్రామానికి చెందిన గుత్తాల సుబ్బాయమ్మ కుమార్తె వెంకటలక్ష్మి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకులు, పి.గన్నవరం నియోజకవర్గ ఇంఛార్జ్ చింతలపాటి శ్రీనివాసరాజు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి అండగా ఉన్నామంటూ భరోసా కల్పించారు. వైఎస్సార్సీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ కో ఆర్డినేటర్ మోర్త శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యుడు కూరాటి శ్రీకృష్ణల చేతులమీదుగా ఈ నగదును వెంకటలక్ష్మికి శనివారం అందజేసారు. ఈ కార్యక్రమంలో గోవలంక ఉపసర్పంచ్ కొట్నాల నరేష్, నాయకులు కోరుకొండ చంటి. కూరాటి వాసు, కాశి ఎమ్మెల్యే ఏడుకొండలు, గొల్లపల్లి విష్ణు, కోరుకొండ రాజు నాయకులు పాల్గొన్నారు.

# అమలాపురం లోఏఐటీయూసీ జిల్లా ప్రధమ మహాసభలు విజయవంతం



**అమలాపురం మనసులోమాట మార్చి21:** ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జిల్లా నలుమూలల నుండి ఏఐటీయూసీ శ్రేణులు భారీగా తరలిరావడంతో ఈ మహాసభ అనూహ్య విజయాన్ని అందుకుంది. ఈ మహాసభలో భాగంగా నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కే. సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్మిక సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించారు. నూతనంగా ఎన్నికైన సత్తిబాబును ఏఐటీయూసీ శ్రేణులు, అభిమానులు పూలమాలలు మరియు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్మిక వర్గ సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తారని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాటికలను ప్రోత్సహించటం అభినందనీయం

### - ప్రముఖ సిని నటులు తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల



**కొత్తపేట మనసులో మాట మార్చి 21 ..** సుమారు 25 సంవత్సరాల నుండి (సిల్వర్ జూబ్లీ )ఉగాది ఉత్సవాలు జరుగుతూ నాటికలను ప్రోత్సహించేందుకు, నాటిక పోటీలను నిర్వహించడం అభినందనీయమని సినీనటులు తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, గౌతంరాజు, గుండు సుదర్శన్ అన్నారు. రావులపాలెంలోని సి.ఆర్.సి. సేవా సంస్థలో జాతీయస్థాయి నాటిక పోటీ లను సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి వీరాఘవరెడ్డి, కళా పరిషత్ డైరెక్టర్ కె.సూర్య ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నాటికలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నాటికలను ప్రతిఒక్కరూ ఆదరించాలని కోరారు. ఈతరం యువకులకు నాటికల పై అవగాహన ఉండటం లేదని, పెద్దలు వీటి ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు. నృత్య ప్రదర్శలు చేసిన చిన్నారులకు సినీ నటులు, సంస్థ సభ్యులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. సీఆర్సీ కాటన్ కళా పురస్కారాన్ని విశా ఖపట్నానికి చెందిన కె. విజయలక్ష్మికి అందించి సత్కరించారు. గుంటూరుకు చెందిన అభియన ఆర్ట్స్ సహాన, విశాఖపట్నానికి చెందిన తెలుగు కళా సమితి చిటికిన వేలు, చైతన్య కళాస్ర వంతి అసత్యం, కాకినాడకు చెందిన ఎస్.వి.రంగారావు కళా స్రవంతి ఆచమనం నాటికలు, సీఆర్సీ రావులపాలెం బంగారు లేడి, భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం దొందు దొందే, ఎస్వీ రంగారావు కళాశాల స్రవంతి కాకినాడ ఆచమనం, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్, సంస్థ డైరెక్టర్లు సత్తి సూర్యభాస్కరరెడ్డి, చిన్నం తేజారెడ్డి, అంజనీ కుమార్ రెడ్డి, వర్మ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
ఆదివారం 22 మార్చి 2026




## దివ్య సుగుణాల పరిమళభరిత సారమే..

# ఈద్-ఉల్-ఫితర్



- రంజాన్ ప్రార్థనల్లో భాగంగా సందేశం ఇచ్చిన మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా....
- సూపర్ సిక్స్ హామీలు అమలుకు... కూటమి ప్రభుత్వం నికి మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించిన అంజాద్ భాష...

**కడప, (మనసులో మాట )మార్చి 21:** దైవభక్తి, శాంతి సమైక్యతకు, సోదర స్నేహ భావాలు, దానధర్మాలు వంటి దివ్య సుగుణాల పరిమళభరిత సారమే.. "ఈద్-ఉల్-ఫితర్" (రంజాన్ పర్వదినం) వేడుక ప్రత్యేకత అని మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజాద్ బాషా సందేశమిచ్చారు.

నగరంలోని బిల్టప్ సర్కిల్ లోని అమీనియా ఈద్గాలో పెద్దదర్గా పీఠాధిపతులు హజరత్ సయ్యద్ షా అరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజాద్ బాషా హాజరయ్యారు.

రంజాన్ ప్రార్థనలు ముగిసిన అనంతరం మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజాద్ బాషా మాట్లాడుతూ.. తెలిసో తెలియకో ఏడాదిపాటు చేసిన తప్పు లను సమూలంగా కడిగేసే అవకాశం పవిత్రమైన రంజాన్ మాసంలో లభిస్తుందన్నారు. ఈ సృష్టి ధనదాన్యాలు, ఇతర సౌకర్యాలు అన్నీ దైవం ఇచ్చేనవేనని.. భూమిపై మనదంటూ ఏమీ ఉండదని, కానీ మనిషి అజ్ఞానంతో అన్నీ తానే సాధించినట్లు భ్రమ పడుతున్నాడని.. వాటిలో ఏ ఒక్కటి తిరిగి తీసుకు వెళ్లలేడని తెలుసుకోవాలన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాలు, ఇఫ్తార్ల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కులమతాలకు అతీతంగా జిల్లాలో, అటు రాష్ట్రంలో దేశంలో, హిందూ, ముస్లింలు, క్రైస్తవులు కలిసి ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం జరిగిందన్నారు. అల్లా ఆజ్ఞ ప్రకారం ప్రతి ఒక్కరూ తన సంపాదనలో రెండున్నర శాతం జకాత్ రూపంలో పేదలకు ఖర్చు చేయడం ఈ రంజాన్ మాసంలో చేసే పవిత్ర పుణ్యకార్యం అన్నారు. అందుకే ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాని ఎస్.బి.అంజాద్ భాష ప్రజలకు సందేశానిచ్చారు. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా ఆ అల్లాహ్ కృప యావత్ ప్రాణికీ అందాలని.. దేశం, రాష్ట్రం, జిల్లా మరియు నా కడప నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని కోరారు.

కాగా.. సంతోషం నిండిన వదనాలు, చిరునవ్వుల పలకరింపులు.. మనసును ఉల్లాస పరిచే అత్తరు పరిమళాలు ముస్లిం సోదరుల మధ్య పండుగ వాతావరణాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఆత్మీయతను పెంచే అలింగన దృశ్యాలు సోదర, స్నేహ భావానికి ప్రతీకలుగా దర్శనమిచ్చాయి.

ఈ కార్యక్రమంలో మత గురువులు (మౌల్వి) ముష్టి న్యామతుల్లా సాహెబ్, దర్గా అమీర్, సీనియర్ నాయకులు సుభాన్ బాషా, మాజీ కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా ఖాన్, వివిధ పార్టీల నాయకులు నజీర్ అహ్మద్,అమీర్ బాబు, మాజీ వై వి యు రిజిస్టర్ గులాం తారీక్, మేధావుల విభాగం నగర అధ్యక్షుడు డాక్టర్ అస్గర్ అలీ, నగర కార్యదర్శి మాస్టర్ అహ్మద్, ఇస్మాయిల్,బన్న ఇతర మైనారిటీ, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు హాజరయ్యారు.

## ఆ అల్లా దీవెనలతో అందరూ ఆనందంగా ఉండాలి

### రంజాన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

**పలమనేరు మార్చి 22 (మనసులో మాట) :** పవిత్ర రంజాన్ పండుగని పురస్కరించుకొని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ్ రెడ్డి మైనారిటీ సోదరులకు శనివారం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైనారిటీ సోదరులను కలసిన ఆయన అందరినీ ఆత్మీయంగా కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆ అల్లా దీవెనలతో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ముందుకు రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ అబ్దుల్లా, తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు ఖాజా, నియోజకవర్గ నాయకులు చాంద్ భాషా, అమానుల్లా, మాబాషా, ఇక్బాల్, షరీఫ్, హనీఫ్, అఫ్రోజ్,రహీం భాషా, నదీం, సయ్యద్ గబ్బార్, మస్తాన్, జీలు, బాబాజాన్, అస్లాం, జావీద్ లతో పాటు పలువురు పట్టణ నాయకులు పాల్గొన్నారు.





## ఘనంగా రంజాన్ వేడుకలు

**పెనుమూరు, మార్చి 21(మనసులో మాట):** ముస్లిం సోదరులు ఈద్-ఉల్- ఫితర్ పర్వదినాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం పిల్లలు పెద్దలు తలంటి స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి, ఈద్గాలు, మసీదులకు వెళ్లి పేష్ ఇమామ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమూరు నూరానీ మసీదు, పూనే పల్లి, రేణుక నగర్ కాలనీ లోని ముస్లిం సోదరులు మసీదు నుండి ఈద్గా వద్ద కు ఐక్యమత్యంతో పురవీధుల్లో ర్యాలీగా వెళ్లారు. అక్కడ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సందర్భంగా మత గురువు మాట్లాడుతూ సర్వ మానవ సమానత్వాన్ని, ప్రేమాభిమానాలను పెంపొందించేదే రంజాన్ అన్నారు.ఈ మాసంలో ధనిక పేద తేడా లేకుండా రాగద్వేషాలు విడిచి సోదర భావంతో మెలగాలన్నారు. ఇస్లాం సర్వ మానవాళికి నూతన మార్గాన్ని, జీవన విధానాన్ని సూచిస్తుం దన్నారు. సర్వ మానవాళికి ముక్తి మార్గాన్ని చూపించేందుకు దైవం పంపిన ఖురాన్ షరీఫ్ గ్రంథం ఈ మాసంలోనే అవతరించిందన్నారు. ప్రపంచంలో ఎన్ని జాతులు మతాలు ఉన్నప్పటికీ అందరూ సోదరాభావంతో మెలిగే ఏకైక దేశం మనదేనన్నారు. రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి చిహ్నం అన్నారు. ముస్లిం క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుందన్నారు. పేదల ఆకలి దప్పికలు సర్వ మానవాళికి తెలియజేయాలన్నదే రంజాన్ పర్వదినం ఉద్దేశం అన్నారు. ఖురాన్ షరీఫ్ బోధించిన ఉత్తమ జీవన సరళిని అనుసరిస్తూ పరమత సహనాన్ని కలిగి ఉండాలన్నారు. ఉపవాస దీక్షలు ఆకలి గొప్పతనాన్ని తెలియజేస్తాయని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టటం కష్టాల్లో ఉన్న వారికి తోచిన విధంగా సహాయం చేయాలన్నారు. ఈ మాసంలో ప్రతి దీక్షపరుడు దానధర్మాలకు పెద్దపీట వేయాలన్నారు.నెల రోజులపాటు ముస్లిం సోదరులు కఠోర ఉపవాస దీక్షలతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా కరుణ కటాక్షాలు పొందాలని లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ బీద ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ తమకు ఉన్నదానిలో దానధర్మాలు చేస్తూ సేవా దృక్పథానికి,సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు.అల్లా ఇచ్చిన జీవితాన్ని పరమ పవిత్రంగా నిష్టగా గడుపుతూ పెద్దలు తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి ఉండాలన్నారు. ప్రవక్త బోధించిన బోధనలను తూచ తప్పకుండా పాటిస్తూ ఇస్లాం ధర్మాలను ఆచరిస్తూ దానధర్మాలు చేస్తూ పేదలను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని హిందూ ముస్లిం, క్రైస్తవ సోదరులు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ఎలాంటి వివాదాలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్ ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు నూరాని మసీద్ కమిటీ అధ్యక్షులు ఎస్ మహబూబ్ భాషా, ఉపాధ్యక్షులు ఎస్ అల్తాఫ్ హుస్సేన్, మున్నా ఖాన్, జిక్రియ భాషా, గౌస్ భాష, ఆసిఫ్ ఇమ్రాన్, రఫీ, గఫూర్, ఈక్రమ్ కలవకుంట పంచాయతీ పూనే పల్లి, రేణుక నగర్ కాలనీ. దేవలంపేట, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

### విభిన్న రంగాల్లో విశేష సేవలందించిన స్వాతంత్ర్య సమరయోధులు

## పప్పూరు రామాచార్యులు చిరస్మరణీయులు

### - అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



**ఉమ్మడి అనంతపురం, (మనసులో మాట )మార్చి 21:** విభిన్న రంగాల్లో విశేష సేవలందించిన స్వాతంత్ర్య సమరయోధులు పప్పూరు రామాచార్యులు చిరస్మరణీయులు అని అనంతపురము ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కొనియాడారు. పప్పూరు రామాచార్యులు స్మారక కమిటీ కన్వీనర్ హెచ్.నాగలింగయ్య ఆధ్వర్యంలో పప్పూరు రామాచార్యులు 54వ వర్ధంతి సందర్భంగా శనివారం అనంతపురము నగరంలోని స్థానిక జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న విగ్రహానికి అనంతపురము ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ నగర ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా అనంతపురం ఎంపీ అంబికా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న రాయలసీమ వాసుల్లో అగ్రగణ్యులుగా, సహకార, గ్రంథాలయ ఉద్యమనేతగా, అనంతపురము పురపాలక సంస్థ తొలి చైర్మన్‌గా, శ్రీబాగ్ ఒడంబడిక క్రియాశీలక సభ్యులుగా పప్పూరు రామాచార్యులు బహుముఖ సేవలందించి అనంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితో నేటి తరం అనంత అభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పప్పూరు స్మారక కమిటీ సభ్యులు డావ ఏ.ఏ. నాగేంద్ర, తోట నాగరాజు, ఎస్.భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కమ్మన్న, ఎల్.కె.పీ మాజీ అధ్యక్షులు గాజుల వెంకట సుబ్బయ్య, ఎస్.కె.యు మాజీ రిజిస్ట్రార్ ప్రొవ కె.సుధాకర్‌బాబు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దన్న గౌడ్, ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ రామ్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డావ పద్మశ్రీ, ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు మాధవ, మహాబోధి కృష్ణమూర్తి, ఎ.ఓబుళపతి, టి.వి.రెడ్డి, చంద్రశేఖర శాస్త్రి, డావ అంకె రామలింగమయ్య, పూలశెట్టి చలపతి, పుట్లూరు లక్ష్మన్న, శంకర కుళ్ళాయప్ప, రామశేషయ్య , మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### ఇండ్ల స్థలాలు,పెన్షన్లు, టిడ్కో గృహాలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరుతూ

## సిపిఐ ఆధ్వర్యంలో 24 వ తేదీన ఎంఆర్ఓ కార్యాలయం ముందు ధర్నా

### - సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు పిలుపు



పలమనేరు మార్చ్ 22 (మనసులో మాట):భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పలమనేరు నియోజకవర్గం ముఖ్యులతో చర్చిస్తూ పలమనేరు నియోజకవర్గంలో ఉన్నటువంటి అర్హత గల ప్రతి నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పట్టణాల్లో 2 సెంట్లు గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు మంజూరు చేయాలని,అర్హత గల వికలాంగులకు, వితంతులకు, వృద్ధాప్యం పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మండల తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు పిలుపునిచ్చారు

ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకి ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ,ఎస్టీ, బిసి,క్రిస్టియన్ మైనార్టీలకు పార్టీలకు అతీతంగా అర్హత గల ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించి పక్క గృహాలను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇదివరకు స్టేట్ కాయిన్లకు టీ డుకో గృహాలకు డిపాజిట్ చేసిన చెల్లించిన వారికి కిట్కో గృహాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి చెన్నకేశవులు, తమిళనాడు రాష్ట్ర అఖిల భారత యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు పి ఆర్ ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏ. గుర్రప్ప, డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు పి. గజేంద్రబాబులు తదితరులు పాల్గొన్నారు.



## మేఘన ఆటో ఫైనాన్స్ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే కురుగొండ్ల

**నెల్లూరు /వెంకటగిరి(మనసులో మాట )మార్చి 21:** వెంకటగిరి పట్టణంలో శనివారం మేఘన ఆటో ఫైనాన్స్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూడ ప్రస్తుత కాలంలో స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల అభివృద్ధికి ఆర్థిక సహాయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాంటి అవసరాలను తీర్చడంలో మేఘన ఆటో ఫైనాన్స్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు వాహన రుణాలు సులభంగా అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.వెంకటగిరి ప్రాంతంలో అభివృద్ధి వేగంగా సాగుతోందని, కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం స్థానిక ఆర్థిక వ్యవస్థకు శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఆర్థిక సేవలను సమర్థంగా వినియోగించుకుని తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.అనంతరం కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సిబ్బందితో మాట్లాడి సేవల వివరాలను తెలుసుకున్నారు. ఏ ఎం సి చైర్మన్, పట్టణ అధ్యక్షులు, ఏ ఎం సి మాజీ చైర్మన్, రాష్ట్ర చేనేత డైరెక్టర్, పట్టణ మాజీ అధ్యక్షులు, పట్టణ నాయకులు, సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## చెన్నూరు గ్రామంలో ఘనంగా రంజాన్ వేడుకలు



**నెల్లూరు /గూడూరు (మనసులో మాట )మార్చి 21:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని ఈద్గా వద్ద భారీ సంఖ్యలో భక్తులు నమాజ్ ఆచరించారు. చిన్నపిల్లలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకుంటూ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో అంబరాన్నంటిన రంజాన్ వేడుకలు ఈద్గాలలో లక్షలాదిమంది ముస్లింల సామూహిక ప్రార్థనలు జరుపుకున్నారు. పవిత్ర మాసంలో నెలరోజు కఠిన ఉపవాస దీక్షలు ముగించుకొని నెలవంక దర్శనంతో ముస్లిం సోదరులు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ మసీదులు వద్ద ముస్లింలు వేల సంఖ్యలో చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. తెల్లవారి జాము నుంచి కొత్త దుస్తులు ధరించి ప్రార్థన స్థలానికి చేరుకొని దేశవ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది.


### ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం




గరికపాటి నరసింహారావు పేద పిల్లలకు అందించే మధ్యాహ్నభోజన పథకంపై అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ ) కడప నగర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని శనివారం విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిధ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను "శోభనం పెళ్లికొడుకు"తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84% మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోడిగుడ్డును దానిని "గాడిద గుడ్డు" అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటు. గరికపాటి వ్యాఖ్యలు కనీస "విజ్ఞత లేనివి", ఏనాడయిన కార్పోరేట్లకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీల గురించి మాట్లాడని గరికపాటు పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కటం దుర్మార్గం. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమానించిన గిరికపాటి నరసింహారవు క్షమాపణలు చెప్పాలి.

ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ డిమాండ్ చేయడం జరిగింది లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# అధినేత



# వైఖరి మారుతోంది..!

- పనితనం అధారంగా ర్యాంకులు
- రానున్న కాలంలో మంత్రి కొలవుకు కొలమానం
- అన్నీ శాఖలపై మంత్రి లోకేష్ నేత్రం
- నియోజకవర్గాలలో పట్టు కోల్పోతున్న ఎమ్మెల్యేలపై గుర్రు
- ఆయా సెగ్మెంటులలో ద్వితీయశ్రేణి నాయకత్వానికి పగ్గాలు

**అమరావతి, పొలిటికల్ బ్యూరో (మనసులో మాట):** టిడిపి అధినేత చంద్రబాబు వైఖరి మారుతోంది. అభివృద్ధి ,సంక్షేమ పాలనే లక్ష్యంగా ముందుకు వెళుతోన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరో వైపు ఎమ్మెల్యేల పనితీరుపై కూడా సారించారు. రెండళ్ళ కాలంలో తాము చేపట్టిన అభివృద్ధి , సంక్షేమ పథకాల విషయంలో ప్రజలలో ఏ విధంగా ఉంది. పాలనలో మార్చుకోవాల్సిన విషయాలు ఏమైనా ఉన్నాయా అనే విషయం కూడా మెదడుకు అందటం లేదు. ఇంటిలిజెన్సు సమాచారం ఉన్నప్పటికీ తమ ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలలో తీసుకొచ్చే ఫీడ్ బ్యాక్ ముఖ్యమని చంద్రబాబు భావిస్తున్నారు. అయితే, పాలనలో వచ్చిన, వస్తోన్న మార్పుల కారణంగా ప్రజలలో ఏ విధంగా ఉందన్న ఎమ్మెల్యేలు పసిగట్ట లేక పోతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ, ఇటు ప్రభుత్వానికి,..అటు పార్టీకి చెడ్డ పేరు తీసుకొస్తున్నారన్న ఫిర్యాదులు కూడా అధినేతకు అందుతున్నట్లు సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో పాలన విషయంలో దారితప్పుతోన్న ఎమ్మెల్యేలను దారికి తీసుకురావాలని అధినేత నిర్ణయించుకున్నారు. నియోజకవర్గాలలో పట్టు కోల్పోతున్న కొందరు ఎమ్మెల్యేలకు సుతిమెత్తని హెచ్చరికలు చేస్తున్నారు. ఆ విషయంలో సీనియర్,జూనియర్ అన్న తేడా లేకుండా హెచ్చరికలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ర్యాంకులు,మార్కులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.పనితీరు ఆధారంగా ర్యాంకులు నిర్ణయించిన అధినేత తక్కువ ర్యాంకులు సాధించిన వారికి మలి ధశలో టిక్కెట్లు నిరాకరించే అవకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే 164( కూటామి ఎమ్మెల్యేలతో కలిపి) ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమతో కలిపి చూస్తే 100 మంది 67 మంది ఎమ్మెల్యే పనితీరు నిరుత్సాహంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచే అధిక ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. కృష్ణ, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో సీనియర్లు అధికంగా ఉన్న నేపథ్యంలో అక్కడి నియోజక వర్గాల నుంచి ఫిర్యాదులు తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పల్నాడు జిల్లాలో గురజాల, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, పెదకూర పాడు, సత్తెనపల్లి, నర్సరావుపేట నియోజకవర్గాలను పరిశీలిస్తే గురజాల, వినుకొండ నియోజక వర్గాలు ముందుకు వెళుతున్నట్లు నివేదికలు తెలిపాయి. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాలలో వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలకు టిడిపి ఘాటుగా సమాధానం ఇస్తున్నారని అధినాయకత్వం భావిస్తోంది. ఈ తరుణంలో ఆయా ప్రాంతాలను త్వరలోనే పర్యటించాలని అధినేత భావిస్తున్నట్లు సమాచారం అందుతోంది.

**అన్నీ శాఖలపై లోకేష్ నేతం:**

క్రూటిమి పార్టీ అధికారంలోకి రావడానికి విద్యాశాఖామంత్రి, చంద్రబాబు తనయుడు లోకేష్ ప్రధాన కారకుడిగానే కాకుండా పార్టీ భౌవిష్యత్తు అదినేతగా పార్టీ కేడర్ భావిస్తున్న నేపథ్యంలో అన్నీ శాఖలపై పట్టు సాధించాలన్న భావనతో లోకేష్ ఆయా శాఖలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వైసిపిలో ఎవరు ప్రభుత్వంపై విమర్శలు చేసినా వారిపై ఘాటుగా స్పందిస్తున్నారు. ఎవరు అవునన్నా..కాదన్న ఆ బావి పార్టీ అధినేత ఆయనే



నన్న సంకేతం ఇప్పటికు టిడిపి నేతలకు తెలిసి ఆయనను ప్రసన్నం చేసుకుంటున్నారు.

**నియోజకవర్గాలలో పట్టు కోల్పోతున్న ఎమ్మెల్యేలపై గుర్రు:**

కూటమి పాలనలోనే ఏడాదిలోనే కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో పట్టు కోల్పోతున్నారు. తొలి సారి గెలిచిన కొందరు నేతలు ధనార్జనే ద్యేయంగా పనిచేస్తున్నారని ఫిర్యాదులు అందాయి. ఇంటి ఎమ్మెల్యేలకు మలి సారి టిక్కట్లు నిరాకరించవలసి వస్తుందని అధినేత చంద్రబాబు కుండ బద్దలు కొట్టినట్లు సమాచారం. రానున్న కాలంలో తమ పదద్దతి మార్చుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. మొత్తానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మార్పు తీసుకొస్తున్న క్రమంలో అనేక అంశాలపై అధ్యయనం చేస్తున్నారు.

## అనవసరంగా గ్యాస్ సిలిండర్లు బుక్ చేయవద్దు

**- పల్నాడు జిల్లా పౌర సరఫరాల అధికారి**

**నరసరావుపేట, మార్చి 21, ( మనసులో మాట)..** ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయిల్ మరియు ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో, పల్నాడు జిల్లా పౌర సరఫరాల అధికారి వినియోగదారులకు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని గృహ అవసరాల (ఐశీఎవర్ఐఎ) వ్రా+ వినియోగదారులు ఆందోళన చెందవద్దని, సిలిండర్ నమోదు చేసుకున్న వారికి 3 నుండి 8 రోజుల లోపు డెలివరీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వినియోగదారులు అవసరం మేరకు మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని, కింది నిబంధనలను పాటించాలని ఒక సిలిండర్ తీసుకున్న 25 రోజుల తర్వాత మాత్రమే తదుపరి బుకింగ్‌కు అవకాశం ఉంటుంది.సిలిండర్ తీసుకున్న 45 రోజుల కాలవ్యవధి దాటిన తర్వాతే మరో సిలిండర్ బుక్ చేసుకోవాలి.

అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు

గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ ఎవరైనా సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు విక్రయించినా, లేదా గృహ అవసరాల సిలిండర్ల నుండి కమర్షియల్ సిలిండర్లలోకి గ్యాస్‌ను రీ-ఫిల్లింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి అక్రమాలు గమనిస్తే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్: 08647-252999 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

జిల్లాలో కమర్షియల్ సిలిండర్ల సరఫరాను కూడా మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కావున వ్యాపార సంస్థలు గృహ అవసరాల కోసం కేటాయించిన డొమెస్టిక్ సిలిండర్లను వాడకూడదని అధికారి ఇందుమూలంగా తెలియజేశారు.

## 35 ఏళ్లుగా వీడని ఆధ్యాత్మిక అనుబంధం

**- సిలువ మోసిన ఎమ్మెల్యే చదలవాడ**



**పల్నాడు, మార్చి 21 (మనసులో మాట):** క్రైస్తవ సోదరుల పట్ల తనకున్న అంకితభావాన్ని, భక్తిని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి చాటుకున్నారు. రావిపాడు గ్రామం నుండి కనపర్తి బాలయేసు పుణ్యక్షేత్రం వరకు శనివారం అత్యంత వైభవంగా జరిగిన పరిశుద్ధ సిలువ పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**సామాన్య భక్తునిగా ఎమ్మెల్యే..**

ఎమ్మెల్యే హోదాను, ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి అరవింద బాబు ఒక సామాన్య భక్తునిలా మారారు. తన భుజంపై పరిశుద్ధ సిలువను మోస్తూ గ్రామస్తులతో కలిసి పాదయాత్రలో ముందుకు సాగారు. గత 35 ఏళ్లుగా ప్రతి సంవత్సరం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం. ఆయన భక్తి శ్రద్ధలను చూసి స్థానిక భక్తులు, గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు. యేసు చూపిన శాంతి మార్గం ఆదర్శం పాదయాత్ర అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు: మానవాళికి సందేశం: యేసుక్రీస్తు చూపిన త్యాగం, శాంతి, కరుణ మార్గాలు ప్రపంచానికి దిక్సూచి అని కొనియాడారు. ముందస్తు ఈస్టర్ శుభాకాంక్షలు: రాబోయే ఈస్టర్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సంక్షేమం: నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.మత సామరస్యానికి ప్రతీకగా సాగుతున్న ఈ పాదయాత్రలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం. భక్తి మార్గం మనిషికి మానసిక ప్రశాంతతను ఇస్తుంది. డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**భారీగా తరలివచ్చిన భక్తులు**

రావిపాడు చర్చి వద్ద ప్రారంభమైన ఈ 45 రోజుల కఠోర దీక్ష పాదయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. చర్చి ఫాదర్లు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా యాత్ర ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## బెల్లంకొండ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**పల్నాడు,మార్చి 21, (మనసులో మాట):** బెల్లంకొండ పోలీస్ స్టేషన్ ను పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు.సాధారణ తనిఖీలలో భాగంగా శనివారం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నందు నిర్వహిస్తున్న రికార్డ్స్, ఫిర్యాదుల నిర్వహణ, కేసుల దర్యాప్తు కమ్యూనిటీ కార్యక్రమాలు సీసీ కెమెరాల నిర్వహణను ఆయన పరిశీలించి స్టేషన్ సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరు ప్రజలతో మమేకమై వారికి భరోసా కల్పించటమే పోలీసుల లక్ష్యం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాలు ఉపయోగించి వీలైనంత తొందరగా పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బాధితులకు తక్షణ న్యాయం చేయాలని సూచించారు. నేర నియంత్రణలో భాగంగా నాటు సారా,గంజాయి, రోడ్ యాక్సిడెంట్లు పై ప్రజలకు అవగాహన కల్పించడం.అక్రమ రవాణా సరిహద్దు గ్రామాలలో నిఘా పెంచాలన్నారు. సైబర్ నేరాలు మహిళల భద్రత రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు నేరస్తులను గుర్తించడం, ప్రజల భద్రతను బలోపేతం చేయడం కోసం పల్లెనిద్ర, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్, అవేర్నెస్ ప్రోగ్రాములు,నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని వలన పోలీసు వ్యవస్థను మరింత పారదర్శకంగా జవాబుదారీగా మార్చటానికి ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డి.ఎస్పి ఎం. హనుమంతరావు, పెదకూరపాడు రూరల్ సీఐ పత్తిపాటి సురేష్,బెల్లంకొండ ఎస్సై పి గోపి పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**పల్నాడు, మార్చి 21, (మనసులో మాట):** పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట బెల్లంకొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో రెండు మండలాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు రూ 9,01,256 విలువైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన వారికి అండగా సీఎం సహాయనిధి ఉంటుందన్నారు. పేదలకు భరోసాగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పెదకూరపాడులో రంజాన్ ర్యాలీ..

**ఆధ్యాత్మిక హోరు!**



**పల్నాడు, మార్చి 21,( మనసులో మాట):** పెదకూరపాడు రంజాన్ వేడుకలు అంబరాన్నంటాయి. మండల కేంద్రంలోని 7 మసీదులకు చెందిన ముస్లిం సోదరులు ర్యాలీగా ఈద్గాకు చేరుకున్నారు. 'అల్లాహు అక్బర్' అంటూ ఆ దేవదేవుని స్మరిస్తూ సాగిన ఈ యాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మౌజాన్ ముస్తఫా మాట్లాడుతూ.. ప్రతి ముస్లిం ప్రేమ, జాలి, కరుణ కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని, పేదలకు దానధర్మాలు చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# గురజాల సిహెచ్‌సి లో ముగిసిన కేంద్ర బృంద పర్యటన

గురజాల **మార్చి 21 ( మనసులో మాట)..** పల్నాడు జిల్లా నియోజకవర్గ కేంద్రం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రం లో జరుగుతున్న కేంద్ర బృందం పర్యటన శుక్రవారం తో ముగిసింది. ఈ ఆసుపత్రి లో అమలు చేస్తున్న ఆధునిక వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న సదుపాయలు విపులంగా పరిశీలించారు. ఆసుపత్రి లో రోగుల పేర్లు నమోదు విధానం లో తీసుకొని వచ్చి న మార్పులు, పేపర్ వినియోగం తగ్గించి డిజిటల్ విధానం ద్వారా చికిత్స చేయు ప్రక్రియ గురించి తెలుసు కుని తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డాక్టర్ సంజయ్ కుమార్ జైన్, డాక్టర్ కుంచె హన్నాహ్ జయశీలి మాట్లాడు తూ పల్నాడు జిల్లా గురజాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యటన లో సిబ్బంది చూపించి న శ్రద్ధ, మర్యాద లు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అని అభినందించారు. ముఖ్యం గా ప్రభుత్వం యొక్క లక్ష్యాలు అన్నీ కూడా చివరికి సామాన్య ప్రజలు, రోగులకు మెరుగైన వైద్య సదుపాయం చేర వేయటం అని అన్నారు. వారికి ఇన్ఫెక్షన్ రహిత వైద్యం, అత్యవసర సమయం లో మెరుగైన వైద్యం తో పాటుగా బాధ్యత తో కూడుకున్న సరైన సలహాలు ఇవ్వటమే అని అన్నారు.పరిశీలించి న అన్నీ డిపార్ట్మెంట్ లో కొన్ని విలువైన మార్పులు, సూచనలు అందించారు.అంతే గాక నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికేషన్ పొందుటకు అర్హతలు ఉన్నాయని కితాబిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా క్వాలిటీ అధికారి డాక్టర్ రామ్ ప్రసాద్,జిల్లా క్వాలిటీ మెంటర్ షీబా, గురజాల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ సాయి కర్ణ కుమార్, డాక్టర్ వాసు, డాక్టర్ అరవింద్, డాక్టర్ సురేష్, డాక్టర్ స్వరూప,డాక్టర్ దత్త శ్రీ మరియు హెడ్ నర్స్ జయ, ఆఫీస్ సిబ్బంది వెంకయ్య, శ్రీనివాస్, సిబ్బంది వున్నారు.

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



పవిత్ర రంజాన్ (మార్చి 21) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు.“పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశం. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుంది. ఈ రంజాన్ మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ కోరికలు అన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంటూ.... ఈద్ ముబారక్“ అంటూ చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## ముస్లింలకు జగన్ రంజాన్ శుభాకాంక్షలు



ముస్లిం సోదరులకు మాజీ సీఎం జగన్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ సామరస్యానికి, కరుణకు, సర్వమానవ సమానత్వానికి ప్రతీక అని ఆయన కొనియాడారు. అల్లాహ్ దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన ఉపవాస దీక్షలు, దైవారాధన మనిషిలోని చెడును రూపుమాపుతాయని, ఈ పవిత్ర మాసం ముగింపు వేడుక సమాజంలో సుహృద్భావాన్ని పెంపొందించాలని ఆశించారు.

# గరికపాటి వ్యాఖ్యలు బాధాకరం

## - మధ్యాహ్న భోజనం పేద పిల్లల హక్కు

## - ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్



**అమరావతి, మార్చి 21 ( మనసులో మాట)..** మధ్యాహ్న భోజన పథకం (డొక్కా సీతమ్మ బడి భోజనం) మరియు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోడిగుడ్లు అందించడంపై ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యల పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గరికపాటి తన ప్రసంగంలో ‘మధ్యాహ్న భోజనం అవసరమైంది, చదువు అక్కర్లేదు.. చదువు మిద్యాన్నం అయిపోయింది, అన్నం తినేవాడికి కోడిగుడ్డు పెట్టడం ఏమిటి? ప్రభుత్వం పని చదువు చెప్పడం తప్ప బట్టలు, అన్నం పెట్టడం కాదు‘ అని చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఒక పద్మశ్రీ అవార్డు గ్రహీత అయి ఉండి, పేద విద్యార్థులను ఉద్దేశించి ఇటువంటి మాటలు మాట్లాడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు పోషకాహారం అందించాలని, పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చి చదువుకోకూడదనే ఉద్దేశంతో వారు గౌరవంగా జీవిస్తూ పాఠాలు వినేందుకు ఈ స్కీమ్ కొనసాగుతుంటే, కనీస అవగాహన లేకుండా గరికపాటి మాట్లాడి ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం ప్రాముఖ్యతను, దాని వెనుక ఉన్న రాజ్యాంగబద్ధమైన హక్కులను విజయ్ ప్రతాప్ రెడ్డి వివరించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చు చేసి అమలు చేస్తున్న ఈ పథకం రాజకీయాలకు సంబంధించిన అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మొక్కుబడిగా ఈ పథకాన్ని అమలు చేయడం లేదని, ఇది సుప్రీంకోర్టు ఆదేశాలతో కొనసాగుతున్న అతి ముఖ్యమైన పథకమని గుర్తు చేశారు. ఆరోగ్యంగా జీవించడం అనేది విద్యార్థుల హక్కు అని, పేద పిల్లల ఆకలి తీరుస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న ఇటువంటి కార్యక్రమాలపై విమర్శలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

## ముస్లిం... మైనారిటీల అభివృద్ధికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ముస్లిం... మైనారిటీలకు రంజాన్ శుభాకాంక్షలు
- నెహ్రూనగర్... సుబ్రహ్మణ్య మైదానంలో ప్రార్థనలకు హాజరు



**రాజమహేంద్రవరం :** కూటమి ప్రభుత్వం ముస్లిం... మైనారిటీల అభివృద్ధి... సంక్షేమానికి కట్టుబడి ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక నెహ్రూనగర్ ఈద్గా, సుబ్రహ్మణ్య మైదానంలో జరిగిన ముస్లిం మైనారిటీల మత పరమైన ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి వ బరకాతుహ్ అంటూ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మనం అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని రంజాన్ పవిత్ర మాసం మనకు సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఈ సోదరత్వాన్ని పెంచుతోందని, మతం, కులం, మతపరమైన విభేదాలను మరచి, పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ మహత్తరమైన రంజాన్ పండుగ సందర్భంగా మీతో కలిసి ఆ అల్లాహ్‌ను ప్రార్థించే అవకాశం ఇచ్చినందుకు అల్లాహ్‌కు, నా ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వటం టీడీపీ హయాంలోనే ప్రారంభమైందని, మైనార్టీ వర్గాల అభివృద్ధికి ఏపీలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 10,000 మంది ఇమామ్‌లు, మౌజన్‌ల పెండింగ్ బకాయిలను విడుదల చేసిందన్నారు. సుమారు 5,000 మంది ఇమామ్‌లకు ఆరు నెలల గౌరవ వేతనం కింద రూ.30 కోట్లు, మరో 5,000 మంది మౌజన్లకు ఆరు నెలల బకాయిల కింద రూ.15 కోట్లు విడుదల చేసిందన్నారు. మొత్తం దాదాపు 5 వేల మసీదులకు సంబంధించి రూ. 45 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి సంబంధించి... దూదేకుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. హజ్ హౌస్‌ల నిర్మాణం, వక్ఫ్ ఆస్తుల రక్షణ, పోస్ట్ - మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌లు తదితర సంక్షేమ పథకాల్లో ముస్లిం విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక భరోసా ఇచ్చిందని, 2026-27 బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమ నిధిని రూ.6090 కోట్లకు పెంచిందన్నారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలు ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.



## స్విమ్స్ పీడియాట్రిక్స్ విభాగంలో

# 28 వారాల పసిబిడ్డకు ప్రాణదానం

**తిరుపతి, మార్చి 21 ( మనసులో మాట)..** తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల పీడియాట్రిక్స్ విభాగం వైద్యులు అత్యంత క్లిష్టమైన స్థితిలో ఉన్న 28 వారాల పసిబిడ్డకు ఆధునిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఈ వివరాలను స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ వెల్లడించారు. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం లక్కినేనిపల్లి గ్రామానికి చెందిన పూజిత అనే మహిళ ఫిబ్రవరి 5వ తేదీన స్విమ్స్ గైనకాలజీ విభాగంలో చేరగా, అదే రోజు ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించారు. అయితే బిడ్డ ఏడవ నెలలోనే (28 వారాలకే) జన్మించడంతో ఊపిరితిత్తులు పూర్తిగా ఎదగలేదు. దీంతో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ పునీత్ పర్యవేక్షణలో శిశువుకు సర్ఫాక్టెంట్ అందించి, ఎన్.ఐ.సి.యు లో వెంటిలేటర్ ద్వారా చికిత్స ప్రారంభించారు. చికిత్స సమయంలో రెండో వారంలో శిశువుకు నెక్రోటైజింగ్ ఎంటరో కొలైటిస్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పటికీ, వైద్యులు సమర్థవంతంగా చికిత్స అందించి బిడ్డను కాపాడారు.తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో స్విమ్స్ ఎన్.ఐ.సి.యు విభాగాన్ని అత్యాధునిక పరికరాలతో ఆధునీకరించడం వల్లే ఇటువంటి క్లిష్టమైన కేసుల్లో విజయం సాధిస్తున్నామని డాక్టర్ పునీత్ తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ, సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇటువంటి చికిత్సకు సుమారు 4 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, కానీ స్విమ్స్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఈ చికిత్సను పూర్తిగా ఉచితంగా అందించామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ మరియు ఈ.హెచ్.ఎస్ కార్డులు కలిగిన వారు తమ పిల్లలకు ఎటువంటి రుసుము లేకుండా స్విమ్స్ పీడియాట్రిక్స్ విభాగంలో అత్యుత్తమ వైద్య సేవలు పొందవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో ఘనంగా

# నారా దేవాన్ష్ జన్మదిన వేడుక

- శ్రీవారిని దర్శించుకున్న నారా కుటుంబం
- అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షల విరాళం
- భక్తులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించిన కుటుంబ సభ్యులు



**తిరుమల, మార్చి 21 ( మనసులో మాట)..** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి మనవడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కుమారుడు నారా దేవాన్ష్ జన్మదిన వేడుక తిరుమలలో ఘనంగా జరిగింది. నారా దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబం శనివారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. సీఎం చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, కుమారుడు నారా దేవాన్ష్ తిరుమల శ్రీవారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద క్యూ కాంప్లెక్స్ లో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అన్నప్రసాద వితరణ కోసం ఒక్కరోజు వ్యయం అయ్యే మొత్తం రూ.44 లక్షలను శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు నారా కుటుంబం విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా దేవాన్ష్ భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం అందరూ కలిసి స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్రతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన జనార్ధన స్వామి



**ఆలమూరు..** ఆలమూరులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత నవ జనార్ధన స్వామి చైత్రమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. నాలుగు శనివారం నాలుగు ప్రదక్షిణలతో స్వామివారిని కొలిచేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అంగర భగవాన్ ఆచార్యులు అంగర రంగాచార్యులు , ఖండవల్లి ప్రభాకరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తొలి హారతి అభిషేకాలు పూజలు నిర్వహించారు.

# భార్య మరణంతో మనస్తాపం.. ఎస్సై బలవన్మరణం

**కరీంనగర్, మార్చి 21 (మనసులో మాట):**



కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నెల 18వ తేదీన భార్య దివ్య బలవన్మరణానికి పాల్పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకుని ప్రాణాలు విడిచారు. మూడు రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు ఇద్దరూ మరణించడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎస్సై చంద్రశేఖర్ భార్య దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరు పూలు, ఆకులు మిక్సీలో వేసుకుని తాగారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే భర్త చంద్రశేఖర్ ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దివ్య మృతికి చంద్రశేఖరే కారణమని ఆరోపిస్తూ అంత్యక్రియల సమయంలో సీతంపేట గ్రామస్తులు ఎస్సైపై దాడి చేశారు. ఆ సమయంలో దివ్య తండ్రి అడ్డుకున్నప్పటికీ.. అందరి ముందు జరిగిన అవమానం, భార్య మరణం చంద్రశేఖర్‌ను కుంగదీశాయి. ఈ వేదనను భరించలేక ఆయన బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రమ మాది.. శిలాఫలకాలు మీవా?

**సిద్దిపేట అభివృద్ధిపై ఎమ్మెల్యే హరీష్ రావు నిలదీత**

- బీఆర్ఎస్ హయాం పనులకే రిబ్బన్ కటింగులా?
- కాళేశ్వరం నీళ్లతోనే పంటలు పండుతున్నాయి

**సిద్దిపేట, మార్చి 21 (మనసులో మాట):**

సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం సీఎం పర్యటన నేపథ్యంలో ఆయన పలు ప్రశ్నలు సంధించారు. రేవంత్ ప్రారంభించబోయే ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించినవేనని స్పష్టం చేశారు. "శ్రమ ఫలితం మాది.. శిలాఫలకాలు మీవా?" అంటూ ఘాటుగా విమర్శించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల కోసం తాము చేసిన పోరాటం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు.



## నిర్మాణాలు మావి.. ప్రారంభోత్సవాలు మీవా?

నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి వంటివన్నీ తాము అధికారంలో ఉన్నప్పుడు పూర్తి చేసినవని హరీష్ రావు గుర్తు చేశారు. వీటికి ఇప్పుడు సీఎం వచ్చి రిబ్బన్ కట్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ. 78 కోట్లతో నిర్మించిన జిల్లా జైలు తాము కట్టించిందని, కానీ శిలాఫలకంపై పేరు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం వేసుకుంటోందని మండిపడ్డారు. తాము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.

## కాళేశ్వరంపై చిల్లర మాటలు వద్దు

ఆయిల్ పామ్ సాగుకు కాళేశ్వరం ప్రాజెక్టే ప్రాణాధారమని హరీష్ రావు తెలిపారు. గతంలో కాళేశ్వరాన్ని విమర్శించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అదే ప్రాజెక్టు నీళ్లతో పండుతున్న పంటలను చూసి వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ఒకప్పుడు 8 వేల ఎకరాలు ఉన్న యాసంగి సాగు, ఇప్పుడు కాళేశ్వరం పుణ్యమా అని 80 వేల ఎకరాలకు చేరిందని వివరించారు. నర్మెట్టలో 20 కోట్ల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన పాండ్‌ను మలేషియా సాంకేతికతతో నిర్మించామని గుర్తు చేశారు.

## సిద్దిపేట నిధుల రద్దుపై ధ్వజం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సిద్దిపేటకు ఒక్క కొత్త పని కూడా ఇవ్వలేదని హరీష్ రావు ఆరోపించారు. గతంలో మంజూరైన రూ. 1071 కోట్ల పనులను అర్థాంతరంగా రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం వంటి ప్రాజెక్టులను రద్దు చేసి కొడంగల్‌కు తరలించడం ఏంటని ప్రశ్నించారు. రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదని, సిద్దిపేట జిల్లాలో 22 వేల మంది రైతులకు రూ. 300 కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## దళారులను నమ్మవద్దు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరవడం వల్ల రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోయారని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. తాము అసెంబ్లీలో పోరాడటం వల్లే ఇప్పుడు కేంద్రాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. మొక్కజొన్న, సన్ ఫ్లవర్ పండించిన రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు పిలుపునిచ్చారు. కరువుతో అల్లాడిన ప్రాంతాన్ని కాళేశ్వరం ద్వారా సస్యశ్యామలం చేశామని హరీష్ రావు స్పష్టం చేశారు.



# నర్మెట్టలో నేడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

**సిద్దిపేట జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి.. రైతు భరోసా నిధుల విడుదల**

**సిద్దిపేట, మార్చి 21 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. సుమారు రూ. 300 కోట్ల వ్యయంతో 62 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పలువురు నేతలు పాల్గొంటారు. సీఎం రాక సందర్భంగా నర్మెట్టలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## అత్యాధునిక సాంకేతికతతో నిర్మాణం

ఈ ఫ్యాక్టరీ ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పని చేయనుంది. భవిష్యత్తులో దీనిని 120 మెట్రిక్ టన్నులకు విస్తరించేలా రూపొందించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనులను నిరంతరం పర్యవేక్షించగా.. ఆయిల్ ఫెడ్ అధికారులు దీనిని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఈ ఫ్యాక్టరీ ద్వారా దీర్ఘకాలిక ఆదాయం లభించనుంది.

## రైతు భరోసా నిధుల పంపిణీ

ఇదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను కూడా విడుదల చేయనున్నారు. మొదటి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 3,590 కోట్లు నేరుగా జమ కానున్నాయి. ఏప్రిల్ నెలాఖరు వరకు మొత్తం రూ. 9,000 కోట్ల నిధులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిధులు రైతుల పెట్టుబడి కష్టాలను తీరుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## అట్టహాసంగా రైతు మహోత్సవ మేళా

ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా నర్మెట్టలో మూడు రోజుల పాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. వ్యవసాయం, ఉద్యానవన, పట్టు పరిశ్రమ వంటి వివిధ శాఖల ఆధ్వర్యంలో 150 స్టాళ్లను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ సహా 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు ఈ మేళాకు హాజరుకానున్నారు. ఇందులో రైతులకు సాగు మెలకువలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

## నూతన ఆవిష్కరణలు.. మేలైన వంగడాలు

ఈ మేళాలో ఫోన్ ద్వారా పొలానికి నీరు అందించే 'ఆటోపామ' సాంకేతికత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు రూపొందించిన సమీకృత వ్యవసాయ నమూనాలు చిన్న రైతులకు ఎంతో మేలు చేస్తాయి. అలాగే తెలంగాణ సోనా వరి, కంది, పెసర వంటి అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు

# ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి

- అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు పెడతాం: కేటీఆర్
- అమలు కాని అర గ్యారెంటీ కూడా
- ఐటీ ఉద్యోగాల తగ్గుదలపై సర్కార్ సమాధానం చెప్పాలి

**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరు గ్యారెంటీల్లో కనీసం అర గ్యారెంటీ కూడా అమలు కాలేదని మండిపడ్డారు.

## గ్యారెంటీలకు చట్టబద్ధత అవసరం

ఆరు గ్యారెంటీల అమలుపై శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్‌ను కలుస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. సీఎం సంతకం చేసిన ఫైల్ ఏమైందో చెప్పాలని నిలదీశారు. ఆ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా లేక ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు.

## ఐటీ ఉద్యోగాల తగ్గుదలపై ఆందోళన

హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గడంపై కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో 9.46 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగాలు, 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోయాయని ప్రభుత్వం స్వయంగా ఒప్పుకుందని గుర్తు చేశారు. వారం వ్యవధిలో అసెంబ్లీలోనూ, బడ్జెట్ ప్రసంగంలోనూ ఈ విషయాన్ని వెల్లడించారని పేర్కొన్నారు. ఈ తగ్గుదలకు కారణం కృత్రిమ మేధస్సు ఫలితమా లేక ప్రభుత్వ వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.



## పోరాటమే మార్గం

ప్రజల తరపున ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో ఇలాంటి బిల్లులు ప్రవేశపెట్టిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బీజేపీ ప్రైవేట్ బిల్లు పెట్టిందని ప్రస్తావించారు. బీజేపీ ఈ బిల్లును వ్యతిరేకించినా తమ పోరాటం ఆపబోమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక మలుపు

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్ అరెస్ట్
- ఫామ్ హౌస్ పార్టీకి డ్రగ్స్ సరఫరా
- నిందితుడి ఫోన్ డేటాపై సిట్ నిఘా




**రంగారెడ్డి, మార్చి 21 (మనసులో మాట):**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ విచారణ వేగవంతం చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను అధికారులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కౌశిక్ రవి ఇచ్చిన సమాచారం మేరకు నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ బృందం ఎట్టకేలకు అతడిని పట్టుకుంది.

## ఫామ్ హౌస్ పార్టీకి డ్రగ్స్ సరఫరా

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సరఫరా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ వద్ద రోహిత్ డ్రైవర్ శరత్ ద్వారా ఈ లావాదేవీలు జరిగినట్లు సమాచారం. ఈ పార్టీలో పలువురు ప్రముఖులు డ్రగ్స్ వినియోగించినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయింది.

## బయటపడ్డ డ్రగ్స్ గుట్టు

నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో తేలగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు తేలింది. వీరితో పాటు పుట్టా మహేశ్ కుమార్, కౌశిక్ రవి కూడా డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. అభిషేక్ సింగ్ దొరకడంతో ఈ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఫోన్ డేటాపై ఆరా

ప్రస్తుతం అభిషేక్ సింగ్ ఫోన్‌ను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులోని కీలక డేటాను విశ్లేషిస్తున్నారు. అతడి నుంచి ఇంకా ఎవరెవరు డ్రగ్స్ కొనుగోలు చేశారనే కోణంలో కూపీ లాగుతున్నారు. ఈ అరెస్టుతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర పెద్దల పేర్లు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మరో పెళ్లి చేసుకుందని మహిళపై ఘాతుకం

**మియాపూర్‌లో కత్తితో దాడి చేసిన యువకుడు**

**తండ్రితో కలిసి వచ్చి ఇంటి వద్దే దాడి**

**నిందితులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**



మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో కలిసి బాధితురాలి ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం భర్తను కోల్పోయి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. ఇద్దరు కూతుళ్లతో కలిసి హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంతకాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయమై ఫిబ్రవరి 20న పెళ్లి చేసుకున్నారు. అయితే నూకరత్నం పని చేసే చోట వంటవాడిగా ఉన్న ఆలీషా అలియాస్ పాండు ఆమెను ఇష్టపడ్డాడు. ఆమె ప్రసాద్‌ను పెళ్లి చేసుకోవడం అతడు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19న తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి పాండు నూకరత్నం ఇంటికి వెళ్లాడు. తనతో రావాలని ఆమెను వేధించాడు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆగ్రహం తట్టుకోలేక వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి వెంటనే బాధితురాలిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండు, అతడి తండ్రి లాలూను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# ఖమ్మం జిల్లాలో నిప్పుల భీభత్సం

**ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్, కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదాలు**

**భారీగా ఆస్తి నష్టం.. తప్పిన ప్రాణాపాయం**

**సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది**



**ఖమ్మం, మార్చి 21 (మనసులో మాట):**

ఖమ్మం జిల్లాలో శనివారం రెండు వేర్వేరు చోట్ల భారీ అగ్నిప్రమాదాలు జరిగాయి. నగరంలోని ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌తో పాటు మధిర మండలంలోని కోల్డ్ స్టోరేజీలో మంటలు చెలరేగి భారీగా ఆస్తి నష్టం సంభవించింది. అదృష్టవశాత్తు ఈ రెండు ఘటనల్లోనూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఖమ్మం నగరంలోని రోటరీ నగర్ లో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు అలుముకున్నాయి. బైక్ బ్యాటరీల వల్ల మంటలు వేగంగా వ్యాపించడంతో షోరూమ్ మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. పలు ఎలక్ట్రిక్ బైకులు అగ్నికి ఆహుతయ్యాయి. చార్జింగ్ పెట్టే సమయంలో జరిగిన పొరపాటు లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. మధిర మండలం ఆత్కూర్ సమీపంలోని శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో మరో ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి లోపల నిల్వ ఉంచిన మిర్చి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు కాలిబూడిదయ్యాయి. కోల్డ్ స్టోరేజీలో వాడే ఇన్సులేషన్ మెటీరియల్ వల్ల మంటలు ఆర్పడం సిబ్బందికి కష్టతరంగా మారింది. ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ రెండు ప్రమాదాల్లో జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అజాగ్రత్త వహించవద్దని, షార్ట్ సర్క్యూట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.

# లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

**15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు**

**గుడిహత్నూర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం**

**అతివేగమే కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ**

**ఆదిలాబాద్, మార్చి 21 (మనసులో మాట):**




ఆదిలాబాద్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఓవర్‌టేక్ చేసే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ముఖ్యంగా క్యాబిన్ భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ తో పాటు ముందు కూర్చున్న ప్రయాణికులు క్యాబిన్ లోనే చిక్కుకుపోయారు. ప్రమాద శబ్దం విన్న వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు అద్దాలు పగలగొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. గాయపడిన 15 మందిని మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అతివేగం, అజాగ్రత్తగా ఓవర్‌టేక్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన బస్సును పక్కకు తొలగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# కాంగ్రెస్‌లో ప్రకంపనలు.. జీవన్‌రెడ్డి ఆవేదన

- మంత్రుల రాయబారం.. సీనియర్ నేత సస్పెన్స్
- అవమానం జరిగితే ఎలా ఉండాలి?
- ఈ నెల 25న రాజీనామాకు సిద్ధం?



**జగిత్యాల, మార్చి 21 (మనసులో మాట):**

కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పార్టీ మారతారన్న ప్రచారంతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన నివాసానికి చేరుకున్నారు. గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో పార్టీలో తనకు జరుగుతున్న అవమానాలపై జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**గౌరవం లేని చోట ఉండలేను**

పార్టీలో నాలుగు దశాబ్దాలుగా ఉన్న తనకు తగిన గుర్తింపు లభించడం లేదని జీవన్‌రెడ్డి మంత్రుల ముందు వాపోయారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. నిఖార్సైన కాంగ్రెస్ వాదులకు అన్యాయం చేయడంపై ఆయన మండిపడ్డారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు విరుద్ధంగా పార్టీ సాగుతోందని వ్యాఖ్యానించారు. తన ఆవేదనను అధిష్టానం పట్టించుకోకపోవడం వల్లే ఈ కఠిన నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

**మంత్రుల హామీ.. జీవన్ నిరీక్షణ**

జీవన్‌రెడ్డి సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఆయన పార్టీ వీడటం మంచిది కాదని, కలిసి ముందుకు సాగుదామని కోరారు. అయితే మంత్రుల విన్నపానికి జీవన్‌రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలిచిన సమావేశానికి కూడా ఆయన గైర్హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**25న కీలక నిర్ణయం?**

భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 25వ తేదీన ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మంత్రుల రాయబారం ఫలించి ఆయన శాంతిస్తారో.. తన పంథాలోనే సాగుతారో అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# దానం క్లీన్ చిట్‌పై బీజేపీ భగ్గు

- స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్
- రాజ్యాంగ విరుద్ధమని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం
- సోమవారం విచారణ జరపనున్న ధర్మాసనం


**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మళ్లీ కోర్టు మెట్లు ఎక్కింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన క్లీన్ చిట్‌ను సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచిన దానం నాగేందర్ ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాకుండా సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. బీ ఫామ్ ఒక పార్టీది తీసుకుని మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల కేసులో దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని స్పీకర్ ఇటీవల తేల్చి చెప్పారు. బహిరంగంగా పార్టీ మారిన వ్యక్తికి క్లీన్ చిట్ ఇవ్వడంపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో స్పీకర్, దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరపనుంది. కోర్టు తీర్పు ఎలా ఉంటుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ షాక్

- వాట్సాప్ డీపీ మార్చి రూ. 1.20 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లు
- మీటింగ్‌లో ఉన్నానంటూ అకౌంటెంట్‌కు మెసేజ్
- కేరళకు వెళ్లిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు



**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

టెక్నాలజీ పెరిగే కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలు దివ్యారెడ్డిని సైబర్ కేటుగాళ్లు భారీగా మోసం చేశారు. నకిలీ వాట్సాప్ సందేశంతో ఆమె ఖాతా నుంచి ఏకంగా రూ. 1.20 కోట్లు కాజేశారు. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

**మీటింగ్‌లో ఉన్నానంటూ నమ్మించి..**

దివ్యారెడ్డి సుమారు 18 కంపెనీలకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 13న ఆమె పేరు, ఫొటోతో ఉన్న ఒక నకిలీ వాట్సాప్ ఖాతా నుంచి సంస్థ అకౌంటెంట్‌కు సందేశం వచ్చింది. "నేను ప్రస్తుతం ఒక ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నాను.. అత్యవసరంగా ఈ ఖాతాకు రూ. 1.20 కోట్లు పంపండి" అని ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. అది నిజమేనని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా వెంటనే ఆ భారీ మొత్తాన్ని కేటుగాళ్లు సూచించిన ఖాతాకు బదిలీ చేశారు.

**రెండోసారి ప్రయత్నించగా బయటపడ్డ గుట్టు**

ఈ నెల 17న మళ్లీ అదే నకిలీ ఖాతా నుంచి మరోసారి డబ్బు పంపాలంటూ సందేశం వచ్చింది. అయితే ఈసారి అకౌంటెంట్ అప్రమత్తమై చెక్ అప్రూవల్ కోసం నేరుగా దివ్యారెడ్డిని సంప్రదించారు. గతంలో జరిగిన లావాదేవీ గురించి చెప్పగా.. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని ఆమె స్పష్టం చేశారు. అప్పటికే రూ. 1.20 కోట్లు పోయాయని గ్రహించిన బాధితురాలు వెంటనే 1930 హెల్ప్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**కేరళకు వెళ్లిన ప్రత్యేక బృందాలు**

బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొన్ని కీలక ఆధారాలు లభించడంతో పోలీసు బృందాలు కేరళకు వెళ్లాయి. నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిపేటప్పుడు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని పోలీసులు సూచించారు. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే సందేశాలను నమ్మకూడదని హెచ్చరించారు. ఎవరైనా డబ్బు అడిగితే వెంటనే ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని, పెద్ద లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# బాన్సువాడలో హనుమాన్ మహాయజ్ఞం..

**పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం**

**భక్తిశ్రద్ధలతో 108 సుందరకాండ పారాయణ**

**సామూహిక మండల పూజలో భక్తుల కోలాహలం**

**బాన్సువాడ, మార్చి 21 (మనసులో మాట):**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ దీక్ష స్వాముల సామూహిక మహా మండల పూజ అట్టహాసంగా జరిగింది. పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో 162వ హనుమాన్ మహాయజ్ఞం భక్తిభావంతో కొనసాగింది.

**కుటుంబ సమేతంగా పోచారం పూజలు**

ఈ పవిత్ర క్రతువులో బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆయనతో పాటు పోచారం శంభు రెడ్డి, ప్రేమల దంపతులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వారు ఈ సందర్భంగా ప్రార్థించారు.

**మారుమోగిన హనుమాన్ నామస్మరణ**

యజ్ఞంలో భాగంగా 108 కుండాత్మక సుందరకాండ పారాయణ నిర్వహించారు. హనుమాన్ దీక్షలో ఉన్న స్వాములు సామూహికంగా పూజలు చేస్తూ ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో నింపేశారు. భక్తుల జై హనుమాన్ నామస్మరణతో బాన్సువాడ పట్టణం మారుమోగింది.



**తరలివచ్చిన ప్రజాప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పూజ ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

# కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్

- నగరంలో కల్తీ సమోసాల గుట్టురట్టు
- కుల్సుంపురాలో టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు
- ప్రముఖ హోటళ్లకు నాసిరకం ఆహారం సరఫరా
- 73 ఏళ్ల నిందితుడు అబ్దుల్ రషీద్ అరెస్ట్



**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

హైదరాబాద్‌లోని కుల్సుంపురా ప్రాంతంలో అత్యంత భయంకరమైన ఆహార కల్తీ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది.

### అపరిశుభ్ర వాతావరణంలో తయారీ

ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో పాడైన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. అందులో అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహారం తయారవుతున్న దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి.

### నిబంధనలు గాలికి.. యధేచ్ఛగా దందా

హైదరాబాద్ ఫుడ్ అడల్టేషన్ సర్వేలెన్స్ టీమ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కుల్సుంపురా పోలీసులు సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు తేలింది. నిందితుడి వద్ద ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ వంటివి ఏవీ లేకపోవడం గమనార్హం. కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం వస్తువులతో ఆహారం తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు.

### భారీగా నిల్వలు స్వాధీనం

దాడి సమయంలో సుమారు రూ. 5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి పదార్థాలు ఉన్నాయి. నిందితుడిపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమాలపై సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్ సీజ్

- అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణం
- రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు
- ఐదు లగ్జరీ కార్ల స్వాధీనం



**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

మాజీ శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఫామ్ హౌస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

### నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో ఈ ఫామ్ హౌస్ కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది.

### లగ్జరీ వాహనాల స్వాధీనం

డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఈ ఫామ్ హౌస్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు.. అక్కడ ఉన్న విలాసవంతమైన ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేశారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో వాటిని స్వాధీనం చేసుకుని ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ పోలీసుల కస్టడీలోనే ఉంది.

### కఠిన చర్యలకు సిఫార్సు

ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక అందించింది. నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తుండటంతో త్వరలోనే సీజ్ ప్రక్రియ పూర్తి కానుంది. ప్రభుత్వ భూమి దుర్వినియోగంపై అధికారులు విచారణను వేగవంతం చేశారు.

# సైన్యంలో కొలువులకు అగ్నివీర్ ప్రకటన

- తెలంగాణలోని 33 జిల్లాల యువతకు అవకాశం
- వయోపరిమితి 22 ఏళ్లకు పెంపు
- ఏప్రిల్ 1 వరకు దరఖాస్తుకు గడువు





**కామారెడ్డి, మార్చి 21 (మనసులో మాట):**

భారత సైన్యంలో వివిధ విభాగాల్లో కొలువుల భర్తీకి అగ్నివీర్ నియామక ప్రక్రియ మొదలైంది. అవివాహిత యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ పరిధిలోని తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల నివాసితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వివిధ కేటగిరీల్లో నియామకాలు

ఈ నోటిఫికేషన్ ద్వారా జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్ తో పాటు ట్రేడ్స్‌మ్యాన్ (10వ తరగతి, 8వ తరగతి) విభాగాల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులు తమ విద్యార్హతలను బట్టి ఏవైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. అగ్నివీర్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 22 ఏళ్లకు పెంచడం విశేషం.

### పరీక్షా విధానం.. అదనపు మార్కులు

ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షను తెలుగుతో సహా 13 భాషల్లో నిర్వహిస్తారు. ఐటీఐ, డిప్లొమా, ఎన్సీసీ సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులకు నిబంధనల ప్రకారం బోనస్ మార్కులు లభిస్తాయి. దరఖాస్తులను కేవలం అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్ ఇండియన్ ఆర్మీ.ఎన్ఐసి.ఇన్ ద్వారానే సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1, 2026. ఆన్‌లైన్ పరీక్షలు జూన్ 1 నుంచి జూన్ 15, 2026 వరకు. అభ్యర్థులు తాజా సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను తరచూ గమనిస్తూ ఉండాలి. తమ ఈ-మెయిల్ ఐడీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. పూర్తి వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయాన్ని 040-27740059 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

### దళారులను నమ్మవద్దు

సైనిక నియామక ప్రక్రియ పూర్తిగా కంప్యూటరీకరించిన పద్ధతిలో, అత్యంత పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికే మధ్యవర్తులు, ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కేవలం అభ్యర్థుల ప్రతిభ, కష్టపడి చదవడం ద్వారా మాత్రమే మెరిట్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందని వివరించారు.

# తారా కళాశాలలో ఎంఎస్ఎన్ ఫార్మా కొలువుల మేళా

### 23న సంగారెడ్డిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

### బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులకు అవకాశం

**సంగారెడ్డి, మార్చి 21 (మనసులో మాట):**

సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలో ఈ నెల 23 (సోమవారం) ఉద్యోగ ఎంపికల మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ ఫార్మా సంస్థ ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ (రుద్రారం) ఆధ్వర్యంలో ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్కేసీ), కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. సోమవారం ఉదయం 10 గంటల నుండి కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు మొదలవుతాయి. బీఎస్సీ (కెమిస్ట్రీ) లేదా ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) పూర్తి చేసిన వారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరుకావచ్చు. అభ్యర్థులు తమ వెంట రెజ్యూమ్ (బయోడేటా), విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు ఇది ఒక మంచి ఉద్యోగావకాశమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ వీరేందర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. వినోద్ కుమార్ గౌడ్, టీఎస్కేసీ కన్వీనర్ డా. సుచిత్ర సింగ్ కోరారు.

# అకాల వర్షంతో అన్నదాతకు కష్టం..

### పాల్వంచలో పంట నష్టం పరిశీలన

### 7 గ్రామాల్లో 265 ఎకరాల్లో దెబ్బతిన్న మక్కజొన్న

### 190 మంది రైతులకు వాటిల్లిన నష్టం

### ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్న అధికారులు



**పాల్వంచ, మార్చి 21 (మనసులో మాట):**

జిల్లాలో నిన్న కురిసిన అకాల వర్షం, వడగళ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. పాల్వంచ మండలం పాయకారి యానం బైలు, రాజాపురం గ్రామాల్లో దెబ్బతిన్న మక్కజొన్న పంటను శనివారం వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నేలపాలైన తీరును చూసి రైతుల బాధను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 7 గ్రామాల్లో సుమారు 190 మంది రైతులకు చెందిన 265 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. చేతికి వస్తుందనుకున్న సమయంలో వడగళ్ల వాన కురవడంతో మక్కజొన్న పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. క్షేత్రస్థాయిలో ప్రతి పొలాన్ని పరిశీలించి నష్టం స్థాయిని అధికారులు అంచనా వేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు హామీ ఇచ్చారు. అకాల వర్షాల వల్ల కలిగిన నష్టంపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. రైతులెవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ పర్యటనలో స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టులపై దాడులు జరిగితే సహించేది లేదు

### దోషులను వెంటనే రిమాండ్‌కు తరలించాలి: డప్పు రామస్వామి

### చేవెళ్ల నియోజకవర్గ ఎంజేఎఫ్ కమిటీ ఎన్నిక

**చేవెళ్ల, మార్చి 21 (మనసులో మాట):**

షాబాద్ మండల పరిధిలో దళిత జర్నలిస్టులపై వరుసగా జరుగుతున్న దాడులను మాదిగ జర్నలిస్టు ఫోరం (ఎంజేఎఫ్) రాష్ట్ర నాయకులు డప్పు రామస్వామి తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆరోపించారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎంజేఎఫ్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ ఇలిటం బుచ్చన్న అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేసారం శంకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### పోలీసుల తీరుపై ఆగ్రహం

రాష్ట్రంలో ఎక్కడ దళిత జర్నలిస్టులపై దాడి జరిగినా చూస్తూ ఊరుకోబోమని డప్పు రామస్వామి హెచ్చరించారు. గత నెల 25న షాబాద్ మండలంలో జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనప్పటికీ.. ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే దోషులను రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.

### ఏప్రిల్ 4న భారీ బహిరంగ సభ

పోలీసులు స్పందించకపోతే ఈ విషయంపై డీసీపీ, ఫ్యూచర్ సిటీ కమిషనర్, జిల్లా కలెక్టర్ సహా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని రామస్వామి స్పష్టం చేశారు. ఏప్రిల్ 4న షాబాద్ మండల కేంద్రంలో ఎంజేఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు తరలివచ్చి మాదిగ జర్నలిస్టుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని కోరారు.

### ఎంజేఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ప్రతినిధులతో కూడిన ఎంజేఎఫ్ అడహాక్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా ఆశిగారి మహేష్ ఎన్నికయ్యారు. కో కన్వీనర్లుగా రమేష్ (చేవెళ్ల), సోప్పగల సంజీవ్ (శంకర్పల్లి), పాండు (నవాబుపేట్), కుమార్ (మొయినాబాద్), అప్పలీ శ్రీనివాస్ (షాబాద్) నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చంద్రశేఖర్, శేఖర్ లోకరాజు, సుదర్శన్, వెంకటేష్, సన్నీ పాల్గొన్నారు.

# అధికారి నివాసంలో కలెక్టర్ రంజాన్ సందడి

**మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి శుభాకాంక్షలు**

**శాంతినగర్‌లో రాజర్షి షా పర్యటన**



**అదిలాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ కలీంను కలిశారు. అదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న అధికారి నివాసానికి స్వయంగా వెళ్లిన కలెక్టర్.. అబ్దుల్ కలీం కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ రాకతో అబ్దుల్ కలీం నివాసంలో సందడి నెలకొంది. అధికారి కుటుంబ సభ్యులు రాజర్షి షాకు ఘనస్వాగతం పలికారు. రంజాన్ పండుగ విశిష్టతను, ఈ నెలలో పాటించే నియమాలను అబ్దుల్ కలీం వివరించగా కలెక్టర్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ముస్లిం సోదరుల పవిత్ర పండుగ ప్రాముఖ్యతపై వారు కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లాలో కొనసాగుతున్న మత సామరస్యం, గంగా జమునా తెహజీబ్ సంస్కృతిపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. పండుగ వేళ కలెక్టర్ స్వయంగా తమ ఇంటికి వచ్చి పలకరించడం పట్ల అబ్దుల్ కలీం సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ చూపిన ఈ ఆత్మీయతకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండుగలు మనుషుల మధ్య బంధాలను పెంచుతాయని ఈ భేటీ ద్వారా మరోసారి రుజువైంది.

# కేసీఆర్‌కు రంజాన్ శుభాకాంక్షలు

**కలిసిన చిన్ననాటి మిత్రుడు జహంగీర్**

**ఆత్మీయంగా పండుగ పలకరింపు**

**హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):**



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన చిన్ననాటి స్నేహితుడు జహంగీర్ శనివారం కలిశారు. ములుగు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉన్న ఆయన.. రంజాన్ పర్వదినం సందర్భంగా కేసీఆర్‌కు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన జహంగీర్, కేసీఆర్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ వేళ మిత్రులిద్దరి కలయిక ఎంతో ఆత్మీయంగా సాగింది. యువజన విభాగం ఉపాధ్యక్షుడు, ఏజెడ్ ఫౌండేషన్ ఛైర్మన్ జుబేర్ పాషా తన కుటుంబ సభ్యులతో కలిసి కేసీఆర్‌ను సందర్శించారు. రంజాన్ పండుగ శుభాకాంక్షలు అందజేసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

# నారాయణపేటలో రంజాన్ బందోబస్తు పరిశీలన

**ఈద్గా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన డీఎస్పీ**

**నారాయణపేట, మార్చి 21 (మనసులో మాట):**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు రంజాన్ పండుగను పురస్కరించుకుని పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఈద్గాలు, మసీదులు, ప్రార్థన మందిరాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎన్. లింగయ్య జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేశారు. భద్రతపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం అక్కడికి వచ్చిన ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిసామరస్యాల నడుమ పండుగను జరుపుకోవాలని డీఎస్పీ లింగయ్య కోరారు.



# వాసవి బంధన్ అధ్యక్షుడిగా మేడ నరేష్

- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- తంబోలా ఆటలు, బహుమతుల ప్రదానంతో సందడి






**ఎల్బీనగర్, మార్చి 21 (మనసులో మాట):**

కర్మాన్‌ఘాట్ లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్ హాల్ లో వాసవి బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా మేడ నరేష్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ నారాయణస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**నూతన కార్యవర్గ ఎన్నిక**

నూతన కార్యవర్గంలో కోశాధికారిగా గ్రంధి సతీష్, ఉప అధ్యక్షుడిగా కమలాపురం నగేష్ బాధ్యతలు చేపట్టారు. వనిత విభాగ్ అధ్యక్షురాలిగా నీల విజయలక్ష్మి, కార్యదర్శిగా కలకొండ వసంతి, కోశాధికారిగా శివ నీరజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మేడ నరేష్ మాట్లాడుతూ.. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత మెరుగైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కోవిడ్ సమయంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకున్నామని నరేష్ గుర్తుచేశారు. పేద విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. గతంలో అక్కినేని అమల వంటి ప్రముఖులకు అవార్డులు అందజేశామని, మున్ముందు సమాజహితం కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని వెల్లడించారు.

**ఉత్సాహంగా మహిళా దినోత్సవం**

ప్రధాన కార్యదర్శి డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉత్సాహంగా సాగాయన్నారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన 'తంబోలా' ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, విజేతలకు బహుమతులు అందజేశామని చెప్పారు. మహిళలు తమ హక్కులతో పాటు సామాజిక బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది మహిళలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# వాసవి బంధన్ సెక్రటరీగా డాక్టర్ నారాయణస్వామి

- ఏకగ్రీవంగా ఎంపిక చేసిన కమిటీ సభ్యులు
- మానవ సేవే మాధవ సేవ అన్న నూతన కార్యదర్శి

**ఎల్బీనగర్, మార్చి 21 (మనసులో మాట):**

కర్మాన్‌ఘాట్ లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్ హాల్ లో వాసవి బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ మేడ నరేష్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ నారాయణస్వామిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన పెద్దలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దల ఆశీస్సులతో ఈ పదవిని స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ లో తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రతి నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నారాయణస్వామి వెల్లడించారు. సమాజహితం కోసం తన వంతు ఏ సహాయం కావాలన్నా ఎల్లప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఫౌండేషన్ సభ్యులు, పెద్దల సహకారంతో సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ సంస్థ ఆశయాలను నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు.



# రంజాన్ ప్రార్థనల్లో రఘువీర్ రెడ్డి

**లోక శాంతి కలగాలని మసీదులో ప్రత్యేక దువా**

**ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు**



**ఎల్బీనగర్, మార్చి 21 (మనసులో మాట):**

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద మసీద్ లో పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం మానవాళికి సహనం, కరుణ, పరస్పర గౌరవం వంటి గొప్ప విలువల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. ఉపవాస దీక్షలు మనిషిలో క్రమశిక్షణతో పాటు తోటివారి పట్ల సేవాభావాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, కలహాలు త్వరగా ముగిసి అంతటా శాంతి నెలకొనాలని అల్లాను వేడుకున్నట్లు రఘువీర్ రెడ్డి తెలిపారు. ప్రతి మనసులో ప్రేమ, ప్రతి ఇంటిలో ఆనందం నిండాలని కోరుకున్నారు. సమాజంలో సామరస్యం పెంపొందేలా మనందరం కలిసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# రైతులు అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

**సోయాబీన్ బకాయిల చెల్లింపు పూర్తి: కలెక్టర్ రాజర్షి షా**

**ఒత్తిడిలో ఉంటే 14416 నంబర్‌కు కాల్ చేయండి**

**రైతు గణపతి మృతిపై విచారణకు ఆదేశం**

**అదిలాబాద్, మార్చి 21 (మనసులో మాట):**

జిల్లాలో సోయాబీన్ కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లింపులు పూర్తిగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. పంటల సాగులో కష్టాలు ఎదురైనప్పుడు రైతులు ఆందోళనకు గురై ఆత్మహత్యల వంటి కఠిన నిర్ణయాలకు పాల్పడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సాగుకు సంబంధించిన సందేహాలున్నా లేక ఇతర సమస్యలున్నా వెంటనే క్షేత్రస్థాయిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ), వ్యవసాయ అధికారులు (ఏఓ)లను సంప్రదించి తగిన సలహాలు పొందాలని సూచించారు.

**ఒత్తిడిని జయించేందుకు ప్రభుత్వ చేయూత**

మానసిక ఒత్తిడితో బాధపడుతున్న రైతులు వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న టెలీ-మానస్ 14416 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ నంబర్‌కు కాల్ చేసి నిపుణులైన కౌన్సిలర్ల ద్వారా ఉచితంగా సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఈ సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేవలం కష్టపడి పని చేయడం ద్వారానే సమస్యలను అధిగమించవచ్చని రైతులకు భరోసా కల్పించారు.

**రైతు గణపతి ఘటనపై స్పష్టత**

ఇటీవల అదిలాబాద్ గ్రామీణ మండలం అర్లి (బి) గ్రామానికి చెందిన రైతు తుడుం గణపతి ఆత్మహత్య ఘటనపై కలెక్టర్ స్పష్టతనిచ్చారు. గత ఏడాది నవంబర్ 18న గణపతి తీసుకువచ్చిన సోయాబీన్‌లో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టి మళ్లీ తీసుకురావాలని అధికారులు సూచించారని తెలిపారు. అనంతరం 40 క్వింటాళ్ల సోయాబీన్‌ను 2,13,120 రూపాయలకు కొనుగోలు చేసినట్లు వివరించారు. దీనితో పాటు అతని కుటుంబ సభ్యుల పేర్లపై మరో 41 క్వింటాళ్లను కొనుగోలు చేసి మొత్తం 81 క్వింటాళ్లకు సంబంధించిన పూర్తి చెల్లింపులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు.



**బాధితులకు పరిహారంపై హామీ**

బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చర్యలు ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. త్రీ-మెన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తున్నామని చెప్పారు. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆయన వెల్లడించారు.

# ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించిన ఎలాన్ మస్క్

- ట్విటర్ కొనుగోలుపై జ్యూరీ కీలక తీర్పు
- వాటాదారులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశం
- షేర్ల విలువ తగ్గడంపై కోర్టులో విచారణ

బిజినెస్ డెస్క్ - మనసులో మాట

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 2022లో ట్విటర్ కొనుగోలు చేసిన సమయంలో ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని జ్యూరీ నిర్ధారించింది. కొనుగోలు ఒప్పందానికి ముందు ఆయన చేసిన ప్రకటనలు పెట్టుబడిదార్లను గందరగోళానికి గురిచేశాయని స్పష్టం చేసింది. దీనివల్ల ట్విటర్ షేర్ల విలువ పడిపోయిందని వెల్లడించింది.

## ఉద్దేశపూర్వక గందరగోళం

ట్విటర్ వాటాదారులు దాఖలు చేసిన పిటిషన్‌పై శాన్ ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టులో మార్చి 2న విచారణ మొదలైంది. మే 2022లో మస్క్ చేసిన కొన్ని ట్వీట్లు, ఒక పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు వాటాదారులను భయాందోళనకు గురిచేశాయని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనివల్ల చాలా మంది తమ షేర్లను తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోయారని వివరించారు. ఈ వాదనలతో ఏకీభవించిన తొమ్మిది మంది సభ్యుల జ్యూరీ.. నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని టెస్లా అధినేతను ఆదేశించింది.

## కుట్ర ఆరోపణల కొట్టివేత

స్టాక్ విలువను కావాలనే తగ్గించేందుకు మస్క్ కుట్ర పన్నారనే ఆరోపణలను మాత్రం జ్యూరీ తోసిపుచ్చింది. కేవలం ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని మాత్రమే స్పష్టం చేసింది. కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఇన్వెస్టర్ల నమ్మకాన్ని దెబ్బతీశాయని అభిప్రాయపడింది. దీనివల్ల మార్కెట్‌లో గందరగోళం ఏర్పడిందని పేర్కొంది.


## నకిలీ ఖాతాల సాకు

ట్విటర్‌లో నకిలీ ఖాతాల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్లే తాను కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గాలని చూశానని మస్క్ కోర్టులో వాదించారు. అయితే ట్విటర్ యాజమాన్యం డెలావేర్ కోర్టును ఆశ్రయించడంతో చివరకు తన నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చిందని చెప్పారు. చివరకు 2022 అక్టోబర్‌లో 44 బిలియన్ డాలర్లు చెల్లించి ట్విటర్ ను సొంతం చేసుకున్నారు. ఒక్కో షేర్‌కు 54.20 డాలర్లు వెచ్చించి ఈ ఒప్పందాన్ని పూర్తి చేశారు.



# పసిడి.. 1983 తర్వాత భారీ పతనం

- ఔన్సు బంగారం 4500 డాలర్ల దిగువకు
- వెండి ధరలోనూ 5 శాతం కోత
- హైదరాబాద్‌లో మేలిమి పుత్తడి 1,49,992




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం ధర ఊహించని రీతిలో పతనమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4500 డాలర్ల దిగువకు చేరింది. 1983 తర్వాత ఒకే వారంలో ఈ స్థాయిలో ధర తగ్గడం మళ్లీ ఇప్పుడే కనిపిస్తోంది. సాధారణంగా ఉద్రిక్తతలు ఉన్నప్పుడు పెరిగే పసిడి ధర.. ప్రస్తుతం అంచనాలకు భిన్నంగా భారీగా పడిపోతుండటం ఇన్వెస్టర్లను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

## భారీగా పడిపోయిన వెండి

కమోడిటీ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2.47 శాతం తగ్గి 4,492 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి సైతం 5 శాతం కుంగి 70 డాలర్ల దిగువకు చేరుకుంది. హైదరాబాద్‌లో శనివారం పది గ్రాముల మేలిమి బంగారం ధర 1,49,992 రూపాయలుగా నమోదైంది. గతంలో వెండి ధర 119 డాలర్ల గరిష్ఠాన్ని తాకినప్పటికీ.. ప్రపంచవ్యాప్త పరిణామాల వల్ల ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీంతో మదుపర్లు తమ వాటాలను ఉపసంహరించుకుంటున్నారు.

## 1983 నాటి పరిస్థితుల పునరావృతం

1979-1980 కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగి ఔన్సు 850 డాలర్లకు చేరాయి. అప్పుడు ఇరాన్ విప్లవం వల్ల చమురు సరఫరాకు ఆటంకం కలగడం.. అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధం వంటి ఉద్రిక్తతలు ఉండేవి. అయితే ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు పెంచాలని నిర్ణయించడంతో 1983లో పుత్తడి బుడగ పగిలిపోయింది. ఫలితంగా ధరలు 20 శాతం మేర తగ్గి 400 డాలర్ల దిగువకు పడిపోయాయి. సరిగ్గా ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి.

## డాలర్‌కు పెరుగుతున్న గిరాకీ

ప్రస్తుత ఘర్షణల వల్ల ముడిచమురు ధరలు పెరిగినా బంగారం ధర మాత్రం తగ్గడం విశేషం. మదుపర్లు డాలర్ వైపు మొగ్గు చూపడమే ఇందుకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో చమురు ధర బ్యారెల్‌కు 200 డాలర్లకు చేరితే బంగారం ధర ఔన్సు 5,400 నుండి 6,000 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే వెండి ధర 110 నుండి 130 డాలర్లకు చేరుకోవచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇవన్నీ కూడా అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక అంశాలపై ఆధారపడి ఉంటాయి.

# కుషాక్ ఫేస్‌లిఫ్ట్ లాంచ్.. రూ. 10.69 లక్షల నుంచే!

## స్కోడా నుంచి సరికొత్త ఎస్‌యూవీ విడుదల
## వెనుక సీటులో మసాజ్ ఫంక్షన్.. అదిరిపోయే ఫీచర్లు

బిజినెస్ డెస్క్ - మనసులో మాట

స్కోడా ఆటో ఇండియా ఎస్‌యూవీ ప్రియుల కోసం కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఈ సరికొత్త కారు ప్రారంభ ధరను రూ. 10.69 లక్షలుగా (ఎక్స్ షోరూం) కంపెనీ ప్రకటించింది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ. 18.99 లక్షల వరకు ఉంటుంది.



## ఐదు వేరియంట్లలో లభ్యం

ఈ కొత్త మోడల్‌ను క్లాసిక్+, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మాంటే కార్లే అనే ఐదు రకాల్లో కంపెనీ అందిస్తోంది. మార్కెట్లో ఇప్పటికే ఉన్న హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, రెనో డస్టర్ వంటి మోడళ్లకు ఇది ప్రధాన పోటీదారుగా నిలవనుంది.

## లగ్జరీ ఇంటీరియర్ - అదిరిపోయే డిజైన్

కొత్త కుషాక్ డిజైన్ స్కోడా కొడియాక్ తరహాలో ఉంటుంది. దీనికి ప్రత్యేకమైన గ్రిల్, ఎల్ఈడీ టెయిల్ లైట్లు అమర్చారు. లోపల 10.25 అంగుళాల డిజిటల్ కాక్‌పిట్, ఏఐ అసిస్టెంట్‌తో కూడిన 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉన్నాయి. ఈ విభాగంలో మొదటిసారిగా వెనుక సీట్లో మసాజ్ ఫంక్షన్‌ను ప్రవేశపెట్టడం విశేషం. పనరోమిక్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఛార్జింగ్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్ వంటి సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి.

## భద్రత - ఇంజిన్ సామర్థ్యం

భద్రత పరంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, పార్కింగ్ కెమెరా, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ ఇచ్చారు. అయితే ఇందులో 360 డిగ్రీల కెమెరా, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటివి లేవు. ఇంజిన్ ఆప్షన్ల విషయానికి వస్తే.. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ (6 స్పీడ్ మాన్యువల్ లేదా 8 స్పీడ్ ఆటోమేటిక్), 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ (7 స్పీడ్ డీసీటీ) వెర్షన్లలో ఈ కారు లభిస్తుంది.

# డాక్టర్ రెడ్డీస్ కొత్త ఇంజెక్షన్

## మధుమేహ రోగులకు ఊరట..




- 62 శాతం తక్కువ ధరకే 'ఒబెడా' విడుదల
- బరువు తగ్గడానికి కూడా ఉపయోగకరం
- పెన్ రూపంలో 4 వారాల డోస్ లభ్యత

హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):

నగరానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం తీపి కబురు అందించింది. టైప్-2 డయాబెటిస్ నియంత్రణకు ఉపయోగించే సెమాగ్లుటైడ్ జనరిక్ ఇంజెక్షన్‌ను 'ఒబెడా' పేరుతో మార్కెట్లోకి విడుదల చేసింది. మన దేశంలో ఈ ఔషధానికి పేటెంట్ గడువు ముగియడంతో తక్కువ ధరకే అందుబాటులోకి తెచ్చినట్లు కంపెనీ వెల్లడించింది.

## సామాన్యులకు అందుబాటులో ధర

ఈ ఇంజెక్షన్ ధర నెలకు రూ. 4,200 నుంచి ప్రారంభమవుతుంది. అంతర్జాతీయ కంపెనీ నోవో నార్డిస్క్ విక్రయించే అసలు ఔషధం ధరతో పోలిస్తే ఇది 62 శాతం తక్కువ. ఈ ఔషధాన్ని ప్రీ-ఫిల్డ్ పెన్, డిస్పోజబుల్ పెన్ రూపంలో 2 ఎంజీ, 4 ఎంజీ సామర్థ్యంతో విక్రయిస్తున్నారు. ఒక్కో పెన్ నాలుగు వారాల డోస్ వరకు పని చేస్తుంది. అంటే నెల మొత్తానికి ఒక పెన్ సరిపోతుంది.

## బహుళ ప్రయోజనాలు

సెమాగ్లుటైడ్ ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచడమే కాకుండా.. రక్తంలో చక్కెర స్థాయిలను సమర్థంగా అదుపు చేస్తుంది. దీనితో పాటు బరువు తగ్గించడంలోనూ, గ్లూకోజ్ స్థాయిలను క్రమబద్ధీకరించడంలోనూ ఇది మెరుగైన ఫలితాలను ఇస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా మధుమేహం బారిన పడుతున్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడనుంది.

## మార్కెట్లో పెరుగుతున్న పోటీ

ఈ విభాగంలో ఇప్పటికే సన్ ఫార్మా, జైడస్ లైఫ్ సైన్సెస్, గ్లెన్ మార్క్ వంటి కంపెనీలు తమ ఉత్పత్తులను విడుదల చేశాయి. గత శుక్రవారం నాట్కో ఫార్మా కూడా తన జనరిక్ ఔషధాన్ని మార్కెట్లోకి తెచ్చింది. ప్రముఖ కంపెనీలన్నీ తక్కువ ధరకే ఈ జీఎల్పీ-1 రిసెప్టార్ అగోనిస్ట్ ఔషధాన్ని తీసుకురావడం వల్ల మధుమేహ రోగులకు చికిత్స భారం గణనీయంగా తగ్గనుంది.

# బీఎస్ఎన్ఎల్, వొడాఫోన్ ఐడియా దోస్తీ!

- టెలికాం రంగంలో భారీ మార్పు..
- నెట్‌వర్క్ విస్తరణే లక్ష్యంగా ఇరు సంస్థల ఒప్పందం
- టవర్లు, స్పెక్ట్రమ్ పంచుకోనున్న టెలికాం దిగ్గజాలు
- గ్రామీణ ప్రాంతాల్లో మెరుగుపడనున్న 5జీ సేవలు




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న వొడాఫోన్ ఐడియా (వీఐ), ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ చేతులు కలపనున్నాయి. నెట్‌వర్క్ కవరేజీని మెరుగుపరచడం తో పాటు ఖర్చులను ఆదా చేసేందుకు టవర్లు, ఫైబర్ కేబుళ్లు, స్పెక్ట్రమ్‌ను ఇరు సంస్థలు పంచుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే రెండు సంస్థల మధ్య ప్రాథమిక చర్చలు జరిగినట్లు సమాచారం.

## నెట్‌వర్క్ నాణ్యత పెంపు - 5జీ విస్తరణ

టెలికాం మార్కెట్‌లో ఒకటి రెండు కంపెనీల ఆధిపత్యం పెరగకుండా పోటీని నిలబెట్టడానికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. 5జీ సేవలను దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించడానికి, నెట్‌వర్క్ నాణ్యతను పెంచడానికి ఈ ఒప్పందం కీలకం కానుంది. ప్రస్తుతం రెండు సంస్థలు 4జీ సైట్లు, అప్‌గ్రేడ్‌ల కోసం భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ క్రమంలో వనరులను పంచుకోవడం వల్ల ఆర్థిక భారం తగ్గనుంది.

## గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు

ఈ రెండు కంపెనీలు జట్టు కట్టడం వల్ల పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సిగ్నల్ సమస్యలు తొలగిపోనున్నాయి. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ సంస్థ కాగా.. వొడాఫోన్ ఐడియాలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. ఈ నేపథ్యంలో రెండు సంస్థల మధ్య సమన్వయం కుదిరితే సామాన్య వినియోగదారులకు తక్కువ ధరలో మెరుగైన టెలికాం సేవలు అందే అవకాశం ఉంది. ఖర్చుల తగ్గింపు: మౌలిక సదుపాయాలను పంచుకోవడం వల్ల నిర్వహణ వ్యయం తగ్గుతుంది. కొత్త నెట్‌వర్క్ ఏర్పాటుకు పట్టే సమయం ఆదా అవుతుంది. మారుమూల ప్రాంతాల్లో కూడా సిగ్నల్ సమస్యలు ఉండవు. మార్కెట్‌లో గుత్తాధిపత్యాన్ని అడ్డుకోవచ్చు.

# విజయ్ - రష్మికలకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అభినందనలు

## కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపిన ఎల్బీ నగర్ శాసనసభ్యుడు

హైదరాబాద్, మార్చి 21 (మనసులో మాట):

ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సినీ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్నలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంటకు ఆయన తన హృదయపూర్వక అభినందనలు అందజేశారు. నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త జంటకు ఆశీస్సులు అందజేశారు.



# కీళ్ల నొప్పులు, వాపులు ఇబ్బంది పెడుతున్నాయా..?

## అయితే ఈ ఆహారాలను తినండి, ఎంతో ఉపయోగం ఉంటుంది..!



వయస్సు మీద పడిన వారిలో సహజంగానే కీళ్లలో కదలికలు తగ్గి కీళ్ల నొప్పులు, వాపులు వస్తుంటాయి. ఈ సమస్య వచ్చేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉండడం, పలు రకాల మందులను వాడడం, గాయాలు, దెబ్బలు తగలడం వంటివి కూడా కీళ్ల నొప్పులు, వాపులు వచ్చేందుకు కారణం అవుతాయి. శరీరంలో కొన్ని రకాల పోషకాలు లోపించడం వల్ల కూడా ఇలా జరుగుతుంది. చలికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే కీళ్ల నొప్పులు, వాపులు ఉన్నవారు నొప్పిని తగ్గించే మందులను వాడుతుంటారు. ఇవి అప్పటి వరకు తాత్కాలికంగా ఉపశమనం అందించినా దీర్ఘకాలంలో తరచూ నొప్పి నివారణ మందులను ఉపయోగం అంత మంచిది కాదు. వీటి వల్ల కిడ్నీలపై భారం పడుతుంది. ఇంకా అనేక సమస్యలు వస్తాయి. కనుక కీళ్ల నొప్పులు, వాపులను సహజసిద్ధంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు గాను యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉండే ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. వీటి వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**ఆకుకూరలు, కూరగాయలు..**

కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించేందుకు గాను ఆకుకూరలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిల్లో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. పాలకూర, తోటకూర, బచ్చలికూరను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో విటమిన్ కె అధికంగా ఉంటుంది. ఇది వాపులను తగ్గించడంలో సహాయం చేస్తుంది. ఆకుకూరల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గేలా చేస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ లేదా కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. క్యాబేజీ, కీరదోస, కొత్తిమీర వంటి కూరగాయలు, ఆకుకూరలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవి సమస్య నుంచి బయట పడేలా చేస్తాయి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

**పసుపు, అల్లం..**

పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. కనుక దీన్ని రోజూ తీసుకుంటే నొప్పులు, వాపులకు చెక్ పెట్టవచ్చు. పసుపును మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. కానీ ఇది మన శరీరానికి సరిపోదు. కనుక పసుపును విడిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఒక కప్పు గోరు వెచ్చని నీటిలో లేదా పాలలో పావు టీస్పూన్ పసుపును కలిపి రోజూ రాత్రి పూట తాగాల్సి ఉంటుంది. దీని వల్ల ఎంతో ఫలితం ఉంటుంది. నొప్పులను, వాపులను తగ్గిస్తుం ది. అలాగే మనం తరచూ వంటల్లో వేసే అల్లం కూడా మేలు చేస్తుంది. దీని వల్ల అనేక అనారోగ్య సమస్యలను తగ్గించు కోవచ్చు. అల్లంలోనూ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అల్లం రసంను రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ చొప్పున భోజనానికి ముందు సేవిస్తుండాలి. దీని వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. నొప్పులు, వాపులు తగ్గి ఉపశమనం లభిస్తుంది.

**బీట్ రూట్, చేపలు..**

బీట్‌రూట్‌ను చాలా మంది అంతగా ఇష్టపడరు. కానీ ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. బీట్ రూట్‌లో పొటాషియం, మెగ్నీషియం, నైట్రేట్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక రోజూ బీట్ రూట్‌ను ఒక కప్పు మోతాదులో తింటుంటే ఫలితం ఉంటుంది. కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించుకోవచ్చు. బీట్ రూట్‌ను నేరుగా తినలేకపోతే జ్యూస్ చేసి ఒక కప్పు మోతాదులో రోజూ తాగాలి. దీని వల్ల సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. అలాగే వారంలో కనీసం రెండు సార్లు చేపలను తింటున్నా ఉపయోగం ఉంటుంది. చేపలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ పోషకాలుగా పనిచేస్తాయి. అలాగే చేపల్లో విటమిన్లు బి6, బి12, విటమిన్ డి ఉంటాయి. ఇవి కూడా నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక తరచూ చేపలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. ఇలా ఆయా ఆహారాలను తరచూ తింటుంటే కీళ్ల నొప్పులు, వాపులను సహజసిద్ధంగా తగ్గించుకోవచ్చు.

# మీకు యాక్టివేటెడ్ చార్ కోల్ అంటే ఏమిటో తెలుసా?

## దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

పూర్వం ప్రజలు బొగ్గులతో దంతాలను తోముకునే వారన్న సంగతి తెలిసిందే. అంతేకాకుండా బొగ్గును పాత్రలను శుభ్రం చేసేందుకు కూడా ఉపయోగించేవారు. అయితే ఇప్పుడు బొగ్గు దాదాపుగా లభించట్లేదు. అందరూ వంట గ్యాస్‌ను వాడుతున్నారు. కనుక బొగ్గు రావడం లేదు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో మనకు యాక్టివేటెడ్ చార్ కోల్ అని లభిస్తుంది. దీన్ని కొందరు వినే ఉంటారు. దీన్ని ఎక్కువగా మెడిసిన్లను, సౌందర్య సాధన ఉత్పత్తులను తయారు చేసేందుకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని కంపెనీలు తమ టూత్ పేస్టలలోనూ చార్ కోల్‌ను అందిస్తున్నాయి. అయితే వాస్తవానికి చార్ కోల్ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది మనకు మార్కెట్‌లో పొడి, ట్యాబ్లెట్ల రూపంలో లభిస్తుంది. దీన్ని బాహ్యంగా ఉపయోగించవచ్చు. లేదా అంతర్గతంగా కూడా తీసుకోవచ్చు. యాక్టివేటెడ్ చార్ కోల్‌తో మనకు అనేక లాభాలు కలుగుతాయి. దీంతో పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు.

**జీర్ణ సమస్యలకు..**

యాక్టివేటెడ్ చార్ కోల్ అంటే కర్రలను కాల్చడం వల్ల ఏర్పడే బొగ్గు. కానీ దీన్ని మనకు నేరుగా విక్రయించరు. చార్ కోల్‌ను తయారు చేసిన తరువాత శుభ్రం చేసి మనకు ప్యాక్‌లలో అందిస్తారు. యాక్టివేటెడ్ చార్ కోల్‌ను చార్ కోల్ అని సింపుల్‌గా కూడా పిలుస్తారు. కొందరు దీన్ని కొబ్బరి టెంకలు లేదా పొట్టును కాల్చి దాంతో వచ్చే బొగ్గు ద్వారా తయారు చేస్తారు. అయితే ఏ పదార్థం ఉపయోగించినా కూడా చార్ కోల్ ఒకటే విధంగా ఏర్పడుతుంది. ఇక చార్ కోల్‌తో దంతాలను తోముకోవడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియ నశించి నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. చార్ కోల్‌కు చెందిన ట్యాబ్లెట్లు మనకు ఆన్ లైన్‌లో, మెడికల్ షాపుల్లో లభిస్తాయి. వీటిని పోషకాహార నిపుణులు లేదా వైద్యుల సూచన మేరకు తీసుకోవచ్చు. సాధారణంగా వీటిని రోజుకు 500 మిల్లీగ్రాముల మోతాదులో తీసుకుంటారు. ఈ ట్యాబ్లెట్లను వాడడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మలబద్దకం తగ్గుతుంది.

**వ్యర్థాలను బయటకు పంపేందుకు..**

ఫుడ్ పాయిజనింగ్ అయిన వారు యాక్టివేటెడ్ చార్ కోల్‌ను వాడితే ఎంతో ఫలితం ఉంటుంది. సాధారణంగా కొన్ని సార్లు మనకు మనం తాగే ద్రవాలు, తినే ఆహారం కారణంగా ఫుడ్ పాయిజనింగ్ అవుతుంది. అలాంటప్పుడు యాక్టివేటెడ్ చార్ కోల్ ను తీసుకుంటే ఫలితం ఉంటుంది. దీని వల్ల పొట్టలో ఉండే అసౌకర్యం కూడా తొలగిపోతుంది. యాక్టివేటెడ్ చార్ కోల్‌ను తీసుకుంటుంటే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు వెళ్లిపోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. బాడీ డిటాక్స్ అవుతుంది. మద్యం విపరీతంగా సేవించడం వల్ల వచ్చే హ్యాంగోవర్ సమస్యను చార్ కోల్ తగ్గిస్తుంది. హ్యాంగోవర్ ఉన్నవారు యాక్టివేటెడ్ చార్ కోల్‌ను తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**చర్మ సమస్యలకు..**

పురుగులు, కీటకాలు కుట్టిన చోట కొబ్బరినూనెలో యాక్టివేటెడ్ చార్ కోల్‌ను కలిపి రాయాలి. దీంతో మంట, దురద, నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అన్ని రకాల చర్మ సమస్యలకు కూడా చార్ కోల్‌ను ఉపయోగించవచ్చు. దీన్ని పలు రకాల ఫేస్ ప్యాక్‌లలోనూ వాడవచ్చు. దీన్ని వాడడం వల్ల చర్మంపై ఉండే మృత కణాలు తొలగిపోతాయి. చర్మం తేమగా, మృదువుగా మారుతుంది. కాంతివంతంగా కనిపిస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. యాక్టివేటెడ్ చార్ కోల్‌ను వాడడం వల్ల ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు సైతం తగ్గిపోతాయి. ఇలా యాక్టివేటెడ్ చార్ కోల్ మనకు ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది.



# ఆకుపచ్చ రంగులో ఉండే ఈ ఆహారాలను రోజూ తినండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!



ఆకుకూరలు, కూరగాయలతోపాటు పలు ఇతర ఆహారాలు కూడా ఆకుపచ్చ రంగులో ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాలను పోషకాలకు గనిగా చెబుతుంటారు. ఈ ఆహారాల్లో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా అనేక రకాల విటమిన్లు, మినరల్స్, ఫైబర్, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ ఆహారాల్లో క్లోరోఫిల్ అనే వర్ణ ద్రవ్యం కూడా ఎక్కువగానే ఉంటుంది. అందుకనే అవి ఆకుపచ్చ రంగులో ఉంటాయి. అయితే ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇవి మన శరీరానికి పోషణను, శక్తిని అందిస్తాయి. జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేలా చూస్తాయి. మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి.

**ఎముకల దృఢత్వానికి..**


ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాల్లో పాలకూర ఒకటి. ఇందులో ఫోలేట్, విటమిన్ కె, విటమిన్ ఎ, ఐరన్, లుటీన్ అధికంగా ఉంటాయి. పాలకూరను తింటే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. పాలకూరలో ఉండే విటమిన్ కె, క్యాల్షియం ఎముకలకు మేలు చేస్తాయి. ఇందులో ఉండే లుటీన్, జియాజాంతిన్ అనే పోషకాలు కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా చూస్తాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. అలాగే ఆకుపచ్చని ఆహారాల్లో బ్రోకలీ కూడా ఒకటి. ఇది చూసేందుకు అచ్చం కాలిఫ్లవర్ లా ఉంటుంది. కానీ అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో విటమిన్లు సి, కెలతోపాటు ఫైబర్, సల్ఫోరాఫేన్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు.

**కొలెస్ట్రాల్ స్థాయిలకు..**

అవకాడోలు కూడా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. వీటిల్లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అలాగే వీటిల్లో పొటాషియం, విటమిన్ కె, ఫోలేట్ అధికంగా ఉంటాయి. అవకాడోలను తినడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. అలాగే ఆకుపచ్చ రంగులో ఉండే గ్రీన్ టీని కూడా రోజూ తీసుకోవాలి. ఇందులో పాలిఫినాల్స్, ఎల్-థియానైన్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందువల్ల గ్రీన్ టీని సేవిస్తుంటే మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడవచ్చు. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**పెద్ద పేగు ఆరోగ్యానికి..**

ఇక ఆకుపచ్చ రంగులో ఉండే బీన్స్, అదే రంగులో ఉండే అలసందలను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. వీటిల్లో ఫైబర్‌తోపాటు విటమిన్లు కె, సి, మాంగనీస్ అధికంగా ఉంటాయి. కనుక వీటిని తింటే పెద్ద పేగు ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఉండే సిలికాన్ వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కివి పండ్లను కూడా తినవచ్చు. ఇవి కూడా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈ పండ్లలో విటమిన్లు సి, కె, ఫైబర్, సెరొటోనిన్ అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఏర్పడదు. నిద్ర లేమి తగ్గుతుంది. పడుకున్న వెంటనే గాఢంగా నిద్రిస్తారు. ఇలా ఆకు పచ్చ రంగులో ఉండే ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.




# రికార్డు బ్రేక్..

## 15 ఏళ్ల ఫానీ ఉటాగుషిమానిండే డెబ్యూతోనే అజేయ సెంచరీ

## ఫానీ ఉటాగుషిమానిండే డెబ్యూతోనే అజేయ సెంచరీ

## 65 బంతుల్లో అజేయంగా 111 రన్స్ (17 ఫోర్లతో) కొట్టింది

## టీ20ఐలలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కురాలైన బ్యాట్స్‌మెన్‌గా కూడా రికార్డు

**ఢిల్లీ:** 15 ఏళ్ల రువాండా క్రికెటర్ ఫానీ ఉటగుషిమనిండే మహిళల క్రికెట్‌లో చరిత్ర సృష్టించింది. ఆమె తన టీ20 అంతర్జాతీయ (т20×) డెబ్యూ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన మొదటి మహిళగా నిలిచింది. నైజీరియా ఇన్విటేషనల్ విమెన్స్ టీ20× టోర్నమెంట్‌లో, ఘనాతో జరిగిన మ్యాచ్‌లో (లాగోస్‌లోని తఫావా బాలెవా స్క్వేర్ క్రికెట్ ఓవల్‌లో, మార్చి 20, 2026) ఆమె 65 బంతుల్లో అజేయంగా 111 రన్స్ (17 ఫోర్లతో) కొట్టింది. ఈ భారీ ఇన్నింగ్స్‌తో రువాండా బలమైన స్కోరు సాధించి విజయం సాధించింది. అంతేకాకుండా, టీ20ఐలలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కురాలైన బ్యాట్స్‌మెన్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించింది. గతంలో, మహిళల టీ20ఐలో అరంగేట్రం మ్యాచ్‌లో అత్యధిక స్కోరును ఆస్ట్రేలియాకు చెందిన కరెన్ రోల్టన్ నెలకొల్పారు, ఆమె 2005లో ఇంగ్లాండ్‌పై 96లి పరుగులు చేశారు. టీ20ఐలో అత్యంత పిన్న వయస్కురాలైన సెంచరీని ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలోకా నెలకొల్పారు, ఆమె 16 సంవత్సరాల 233 రోజుల వయస్సులో మాలిపై సెంచరీ సాధించారు. పురుషుల టీ20ఐ క్రికెట్‌లో, నలుగురు బ్యాట్స్‌మెన్లు తమ అరంగేట్రంలోనే శతకాలు సాధించారు, కానీ వారిలో ఎవరూ పూర్తి స్థాయి సభ్య దేశానికి చెందినవారు కాదు. 2022లో ఫిలిప్పీన్స్‌పై అజేయంగా 108 పరుగులు చేసిన కెనడాకు చెందిన మాథ్యూ స్పూర్స్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. పురుషుల టీ20ఐలో శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడైన బ్యాట్స్‌మెన్ ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ మెకాన్. మెకాన్ 18 సంవత్సరాల 280 రోజుల వయస్సులో ఈ ఘనతను సాధించాడు. ఫ్యానీ ఉటాగుషిమానిండే శతకంతో రాణించడంతో, రువాండా తమకు కేటాయించిన 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. 19 బంతుల్లో 32 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టుకు నాయకత్వం వహించిన మెర్వెల్ ఉవాసే కూడా మరో ప్రధాన స్కోరర్‌గా నిలిచింది. ఘనా బౌలింగ్ ఎంతగా చెల్లాచెదురైందంటే, వారు 25 వైడ్‌లతో సహా 28 అదనపు పరుగులు ఇచ్చారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఘనా పూర్తిగా ఒత్తిడికి లోనైనట్లు కనిపించింది. రువాండా బౌలర్లు క్రమంగా తమ పట్టును బిగించి, 20 ఓవర్లలో ఘనాను 8 వికెట్ల నష్టానికి కేవలం 88 పరుగులకే పరిమితం చేశారు. రువాండా ఈ మ్యాచ్‌ను 122 పరుగుల భారీ తేడాతో గెలుచుకుంది.



# 4 ఓవర్లు వేయకపోతే రూ.2 కోట్లు కట్ చేయండి

## • ఆస్ట్రేలియా ప్లేయర్‌పై అశ్విన్ షాకింగ్ కామెంట్స్



**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు మరికొన్ని రోజుల్లో షురూ కానుంది. ఈ సీజన్‌కు ముందు, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ విషయంలో ఒక పెద్ద చర్చ మొదలైంది. గ్రీన్ పాత్ర, ఫిట్‌నెస్‌పై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర విమర్శలు చేశారు. ఒక మ్యాచ్‌లో గ్రీన్ పూర్తి నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయకపోతే.. అతడి జీతం నుంచి రూ.2 కోట్లు కట్ చేయాలని పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 మినీ-వేలంలో కామెరాన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 25.20 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో అతను ఆ వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. సుదీర్ఘ గాయం తర్వాత గ్రీన్ ఇటీవలే క్రికెట్‌లోకి తిరిగి వచ్చాడు. ఈ సీజన్‌లో కేకేఆర్ తరఫున కీలక పాత్ర పోషిస్తాడని అందరూ భావిస్తున్నారు. ఈ తరుణంలో రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా వారి జీతాల నుంచి కోత విధించే హక్కు ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఉండాలన్నారు. ప్రత్యేకంగా కామెరాన్ గ్రీన్‌ను ఉదాహరణగా పేర్కొంటూ, గ్రీన్ కేవలం రెండు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేస్తే.. జట్టు అతని కాంట్రాక్ట్ నుంచి రూ.2కోట్లు తగ్గించాలన్నారు. “మీరు ఐపీఎల్ వేలంలోకి ఎంట్రీ ఇచ్చినప్పుడు.. పూర్తి నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయగలనే అంచనా ఫ్రాంచైజీలకు ఉంటుంది. బ్యాటింగ్ సైతం చేస్తారని అంచనా ఉంటుంది. బౌలింగ్‌పై ఏవైనా ఆంక్షలు ఉంటే ఫర్వాలేదు.. కానీ ఏం లేకుండా కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేస్తే మీ కాంట్రాక్ట్ నుంచి నగదు కోతలు విధించే అవకాశం ఫ్రాంచైజీలకు ఉండాలి” అని అశ్విన్ అన్నాడు. ఇక గ్రీన్‌కు ఇటీవల గాయం అయినందున, నాలుగు ఓవర్లు బౌలింగ్ వేయగలడా? అనే చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు.. ఐపీఎల్‌లో కామెరాన్ గ్రీన్‌ను ప్రతి మ్యాచ్‌లో పూర్తి నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయడానికి క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతిస్తుందా? అనే చర్చల మధ్య రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# ‘కోట్లు పెట్టి కొంటే హ్యాండ్ ఇస్తారా?

## • ఐపీఎల్‌లో విదేశీ ప్లేయర్స్ తీరుపై ఆకాష్ చోప్రా ఫైర్



**ఢిల్లీ:** ఐపీఎల్ మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. అప్పటికే అన్ని జట్లు సిద్ధమయ్యాయి. ఇక ఓ అంశం మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన బౌలర్లు ఒక్కొక్కరిగా ఐపీఎల్‌కు దూరమవుతున్నారు. దీంతో కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఫ్రాంచైజీలు ఆందోళనకు గురవుతున్నాయి. సన్‌రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఇప్పటికే దూరమయ్యాడు. ఇషాన్ కిషన్‌ను తమ కెప్టెన్‌గా టీమ్ నియమించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా టోర్నమెంట్ ప్రారంభానికి దూరమవ్వనున్నాడు. ఇప్పుడు, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన మిచెల్ స్టార్క్ సైతం ఐపీఎల్ 2026 ప్రారంభానికి అందుబాటులో ఉండడు. ఇలా వరుసగా స్టార్ ప్లేయర్స్ దూరమవుతుండంపై తాజాగా మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా ఫైర్ అయ్యారు. మిచెల్ స్టార్క్ సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదని తెలిసిందన్నారు. ఇప్పటికే జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమిన్స్‌లు దూరమయ్యారని.. తాజాగా స్టార్క్ గాయంతో బాధపడుతున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొందన్నారు. కానీ నిజానికి అతను ఫిట్‌గా ఉన్నప్పటికీ సీఏ మాత్రం ఏవో సాకులు చెప్పి అతన్ని ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడకుండా చూస్తుందని ఆరోపించారు. స్టార్క్ టీ20 క్రికెట్‌కు ఎప్పుడో వీడ్కోలు పలికాడని గుర్తు చేశారు. మరి రెండు నెలలుగా స్టార్క్ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఏం చేసినట్లు? అని నిలదీశారు. “ఆస్ట్రేలియా క్రికెట్ ఎందుకు ఇలా ప్రవర్తిస్తుందో అర్థం కావడం లేదు. మరోవైపు న్యూజిలాండ్ బౌలర్ లోకీ ఫెర్గూసన్ సైతం దూరమయ్యాడు. ఫెర్గూసన్ కుటుంబంతో గడిపేందుకు తొలి ఏడు మ్యాచులకు రాకపోవడం దారుణం.. ప్రెసెంట్ అతను సౌతాఫ్రికాతో 20 సిరీస్‌లు అడుతున్నాడు. ఇది అయిపోగానే వెంటనే కుటుంబంతో గడిపేందుకు వెళ్తాడట. అది అతడి వ్యక్తిగతం కానీ.. అతన్ని రూ. 2 కోట్లకు కొనుగోలు చేశారు. ఏడు మ్యాచుల తర్వాత వచ్చి రూ.కోటి తీసుకుని వెళ్లిపోతాడు. ఐపీఎల్‌లో మాట ఇచ్చి ఏడు మ్యాచ్‌లకు దూరమైతే, టీమ్‌లు ఏం చేయాలి? ఇది సరైన నిర్ణయం కాదు.. జట్టు తీవ్రంగా నష్టపోతుంది.” అని ఆకాష్ చోప్రా వెల్లడించారు. ఇదిలా ఉండగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లో పాట్ కమిన్స్ లేని లోటు స్పష్టంగా కనిపించనుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌లో మిచెల్ స్టార్క్ లేని లోటును పూడ్చేందుకు లుంగి ఎన్గిడి లేదా కైల్ జేమీసన్ వంటి బౌలర్లపై ఆధారపడాల్సి వస్తుంది. చెన్నై సూపర్ కింగ్స్ లో నాథన్ ఎల్లిస్ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమవ్వడం సీఎస్‌కేకు పెద్ద దెబ్బగా మారనుంది. లక్నో సూపర్ జెయింట్స్ లో వానిందు హసరంగ సైతం గాయంతో బాధపడుతుండటంతో ఆ జట్టు స్పిన్ విభాగంపై ఆందోళన నెలకొంది. విదేశీ ఆటగాళ్ల ఈ తరహా నిర్ణయాల వల్ల ఐపీఎల్ ఫ్రాంచైజీలు భవిష్యత్తులో ఆటగాళ్లను ఎంచుకునేటప్పుడు పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

# ఐపీఎల్ ముందే కేకేఆర్‌కు వరుస దెబ్బలు

## మరో స్టార్ బౌలర్ దూరం..



**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026కు ముందు, మూడుసార్లు విజేతగా నిలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టుకు సమస్యలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే హర్షిత్ రాణా ఈ టోర్నమెంట్ మొత్తానికి దూరమవ్వగా, ఇప్పుడు మరో ఎదురు దెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ఆకాశ్ దీప్ సైతం ఈ సీజన్‌కు దూరం కానున్నాడు. గతేడాది అబుదాబిలో జరిగిన మినీ వేలంలో కేకేఆర్ జట్టు ఆకాశ్‌ను రూ. 1 కోటికి కొనుగోలు చేసింది. ఇప్పుడు ఆకాశ్ అందుబాటులో లేకపోవడం ఆ జట్టు బౌలింగ్ విభాగానికి పెద్ద దెబ్బగా మారనుంది. వాస్తవానికి.. ఆకాశ్ దీప్‌కు ముందే గాయమైంది. బెంగాల్ తరపున రంజీ ట్రోఫీ సెమీఫైనల్ ఆడుతున్నప్పుడే వెన్నునొప్పి బారిన పడ్డాడు. ఈ గాయం నుంచి కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. మార్చి 18న కోల్‌కతాలో ప్రారంభమైన కేకేఆర్ ప్రీ-సీజన్ క్యాంప్‌కు గానీ, శుక్రవారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌కు గానీ ఆకాశ్ హాజరు కాలేదు. మరోవైపు.. శ్రీలంక పేసర్ మతీషా పతిరానా విషయంలోనూ ఇంత వరకు క్లారిటీ రాలేదు. రాణా భుజం గాయంతో బాధపడుతున్నాడు. ఈ సీజన్‌లో రాణా ఆడతాడా? లేదా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఈ ఎదురు దెబ్బలతో ప్రస్తుతం కేకేఆర్ బౌలింగ్ విభాగంలో వైభవ్ అరోరా, ఉమ్రాన్ మాలిక్, బ్లెస్సింగ్ ముజరబానీ, కార్తీక్ త్యాగి మాత్రమే ఉన్నారు. ఇక ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు మేనేజ్మెంట్ కసరత్తు షురూ చేసింది. ఈడెన్ గార్డెన్స్‌లో నవదీప్ సైనీ, ఆకాష్ మధ్వాల్, సందీప్ వారియర్ వంటి ఆటగాళ్లతో ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ నెల 29 ముంబైతో కేకేఆర్ తొలి మ్యాచ్‌ను ఎదుర్కోనుంది. అంతలోపు మేనేజ్మెంట్ ఏం చేస్తుందో వేచి చూడాలి.





# నితిన్ మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా, కొత్త తరహా కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.



# శంబాల దర్శకుడితో సందీప్ కిషన్ మూవీ

యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో మైలురాయి లాంటి ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవలే 'శంబాల' చిత్రంతో సూపర్ హిట్ అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి భారీ కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రం ఒక హై-వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా ప్రేక్షకులను అలరించనుంది. కొన్ని యుద్ధాలు ముగియవు.. కొంతమంది రాజులు మరణించరు అనే పవర్‌ఫుల్ మరియు ఇంట్రెస్టింగ్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, ఇది ఒక గొప్ప చారిత్రక లేదా పురాణ సంబంధిత నేపథ్యం ఉన్న ఎపిక్ సాగా అని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు మరియు మహిధర్ రెడ్డి సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్, ఆయన మునుపటి సినిమాల కంటే భిన్నమైన మేకోవర్‌లో ఉండబోతోందని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దనున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సందీప్ కిషన్, ఈ ఎపిక్ సాగాతో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకోనున్నారు.

# పెళ్లిపీటలు ఎక్కిన పునర్నవి



తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పునర్నవి భూపాలం తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన ఈ భామ, తన అమాయకత్వం, సహజమైన నటనతో మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆమెను ఇండస్ట్రీక్రి పరిచయం చేసింది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో కొంతకాలం సినిమాలకు దూరమైంది. ఈ సమయంలోనే బుల్లితెరపై 'బిగ్ బాస్ తెలుగు'లో పాల్గొని మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించడంతో పాటు అభిమాన వర్గం కూడా పెరిగింది. నిజానికి సినిమాల కంటే ఈ కార్యక్రమం ద్వారానే ఆమెకు ఎక్కువ ప్రాచుర్యం లభించింది. అయితే, వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్ణయించుకుంది పునర్నవి. లండన్‌లో చదువులు కొనసాగిస్తూ, పూర్తిగా తన విద్యపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటూ ఉండేది. ఇటీవల డిసెంబర్ నెలలో తాను ప్రేమించిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 20న ఆమె తన ప్రియుడు హేమంత్ వర్మను వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాహ వేడుకను చాలా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల మధ్య నిర్వహించారు. ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంటకు సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉ న్నపునర్నవి ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇక భవిష్యత్తులో ఆమె మళ్లీ సినిమాల్లోకి వస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.





# నాలుగు గంటల సినిమా.. దమ్ముండాల్సిందే

## దురంధర్ -2 మూవీ అద్భుతం అన్న రాజమౌళి

రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన 'ధురంధర్ 2: ద రివెంజ్' చిత్రంపై టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా ఈ సినిమా చూసిన జక్కన్న ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. నాలుగు గంటల సినిమా తీయాలంటే దమ్ముండాలని పేర్కొన్నారు. ఈ చిత్రం మొదటి భాగం కంటే స్కేల్ మరియు ఎమోషన్ పరంగా అద్భుతంగా ఉందని, తనకు 'ధురంధర్ 1' అంటే చాలా ఇష్టమని కానీ సీక్వెల్ దానిని మించిపోయిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి కొనియాడారు. రణవీర్ సింగ్ నటనను ప్రస్తావిస్తూ, షెడ్ లో చెల్లెలితో వచ్చే సన్నివేశం ఒక 'మాస్టర్‌క్లాస్ ఇన్ యాక్టింగ్' అని, హమ్జా మరియు జస్కీరత్ పాత్రల్లో ఆయన మెస్మరైజ్ చేశారని అభినందించారు. అలాగే ఆర్. మాధవన్ దేశం నిస్సహాయతను తన నటనతో అద్భుతంగా పండించారని రాజమౌళి ప్రశంసించారు.సినిమాలోని రైటింగ్, మ్యూజిక్, వరల్డ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలు కూడా అద్భుతంగా కుదిరాయని ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ భారీ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కూడా సునామీ సృష్టిస్తోంది, కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు తిరగరాస్తోంది.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861